భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# 23వ అఖిల భారత మహాసభ
# రాజకీయ తీర్మానం

(కన్నూరులో ఏప్రిల్ 6-10, 2022లో జరిగిన మహాసభలో ఆమోదించింది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# 23వ అఖిల భారత మహాసభ రాజకీయ తీర్మానం

(కన్నూరులో ఏప్రిల్ 6-10, 2022 లో జరిగిన మహాసభలో ఆమోదించబడినది)

**01.** పార్టీ 22వ అఖిల భారత మహాసభ అనంతర కాలంలో బిజెపి మరింత సంఘటితపడింది. ప్రభుత్వ అధికారంలో ఉంటూ ఫాసిస్టు స్వభావంగల ఆర్‌ఎస్‌ఎస్ యొక్క హిందూత్వ మతోన్మాద ఎజండాను దూకుడుగా అమలుచేయడం ద్వారా ఇది జరిగింది. అది పచ్చి నయా ఉదారవాద సంస్కరణలను అమలు చేయడం, మతోన్మాద-కార్పొరేట్ శక్తుల లంకెను బలపరుచుకుంటూ జాతీయ సంపదను కొల్లగొట్టడం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహించడం, రాజకీయ అవినీతిని చట్టబద్ధం కావించడం, పూర్తి స్థాయిలో నిరంకుశత్వాన్ని రుద్దడం ద్వారా బహుముఖంగా దాడి చేస్తున్నది.

**02.** మతోన్మాద, జాతీయ దురహంకారపూరిత ప్రచారం చేపట్టి 2019 లోక్‌సభ ఎన్నికల అనంతరం బిజెపి మరిన్ని ఎక్కువ సీట్లతో, మరింత ఎక్కువ శాతం ఓట్లతో తిరిగి అధికారాన్ని చేపట్టింది. అప్పటి నుంచి పచ్చి మతోన్మాద చీలికను తెచ్చి మన లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగ పునాదులనే దెబ్బ తీసే విధంగా జమ్ము, కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసింది. రాజ్యాంగంలోని 370 , 35-ఎ అధికరణలను రద్దుచేసింది. రాజ్యాంగ వ్యతిరేకమైన రీతిలో పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) తీసుకువచ్చింది. అయోధ్యలో మందిర నిర్మాణాన్ని మొదలుపెట్టింది. ముందస్తుగా నిర్బంధించేందుకు వీలు కల్పించే

క్రూరమైన చట్టాలను అతి దారుణంగా దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామిక హక్కులమీద, పౌర హక్కుల మీద నిర్దాక్షిణ్యంగా దాడికి పూనుకుంది. భారత గణతంత్ర రాజ్యాంగపు స్వభావాన్నే మార్చేందుకు నిరంతరం ప్రయత్నిస్తోంది.

**03.** వివిధ తరగతుల శ్రామిక ప్రజల నుండి, మోడీ ప్రభుత్వ విధానాలకు వస్తున్న ప్రతిఘటన పెరగడం కూడా ఈ కాలంలో మనం చూస్తాము. కొత్త లేబర్ కోడ్‌లకు, ప్రైవేటీకరణ జోరుకు వ్యతిరేకంగా ఆయా రంగాల వారీ జరిగిన సమ్మెలతోబాటు, కార్మికవర్గం సాధారణ సమ్మెలను కూడా నిర్వహించింది. రాజ్యాంగాన్ని, పౌరసత్వ హక్కును నాశనం చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన సిఎఎ–వ్యతిరేక ఉద్యమం ఒక ప్రజా ఉద్యమంగా పెంపొందింది. అత్యంత పెద్దదీ, అత్యంత దీర్ఘకాలం పాటు సాగిన రైతాంగ పోరాటం మూడు వ్యవసాయ చట్టాల రద్దుతో ఒక చారిత్రిక విజయంగా ముగిసింది.

**04.** గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో, బిజెపి ప్రభుత్వం అమెరికా వ్యూహాత్మక, రాజకీయ, భద్రతాపరమైన కుయుక్తులకు పూర్తిగా లొంగిపోయింది. రష్యా యుక్రెయిన్ యుద్ధంలో అమెరికాకు భిన్నమైన వైఖరి తీసుకున్నప్పటికీ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి లోబడివుండే నమ్మినబంటులా తయారైంది. దీనితో, మనదేశపు దీర్ఘకాల ప్రతిష్ట పైన, మన ఇరుగు పొరుగు దేశాలతో ఉండే సంబంధాలపైన తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యమైన పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో, వాటి ప్రభావం నేటి మన దేశ పరిస్థితులను నేరుగా ప్రభావితం చేసే విధంగా ఈ ప్రభుత్వ వైఖరి ఉంది.

## అంతర్జాతీయ పరిస్థితి

**1.1:** 22వ అఖిల భారత మహాసభ అనంతర కాలంలో అంతర్జాతీయ పరిస్థితులలో ప్రధానాంశాలు ఈ విధంగా ఉన్నాయి :

**(అ)** అత్యంత వినాశకారి అయిన కోవిడ్ 19 మహమ్మారి విజృంభించి, కొత్త కొత్త రూపాలలో ఆ వైరస్ తన ప్రభావాన్ని ఇంకా కొనసాగింపు.

(ఆ) ఈ మహమ్మారిని, దానితోపాటు ఉత్పన్నమైన సవాళ్ళను ఎదుర్కోవడంలో పెట్టుబడిదారీ దేశాలు, సోషలిస్టు దేశాల మధ్య స్పష్టంగా వ్యక్తమౌతున్న వ్యత్యాసాలు.

(ఇ) ముదురుతున్న ప్రపంచ ఆర్థిక మాంద్యం.

(ఈ) ఆర్థిక మాంద్యానికి పరిష్కారం చూపలేకున్న నయా ఉదారవాద విధానపు దివాలాకోరుతనం. అంతే కాక, నయాఉదారవాద బాటలోనే సంపన్నుల లాభాలను గరిష్ట స్థాయికి చేర్చేలా ఉన్న, ఆర్థిక వ్యవస్థను కోలుకునేందుకు రూపొందించిన ఉద్దీపన పథకాలు.

(ఉ) ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింతగా బలపడుతున్న ద్రవ్య పెట్టుబడి పట్టు.

(ఊ) ప్రజల జీవితాలపై, జీవనోపాధిపై పడుతున్న వినాశకర ఫలితాలు; ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆకలి, పేదరికం నిరుద్యోగం స్థాయి; మృగ్యమౌతున్న విద్యావకాశాలు, గృహలేమి.

(ఎ) ఒక ప్రపంచ స్థాయి శక్తిగా ఎదుగుతున్న చైనా ప్రభావం.

(ఏ) చైనాను అడ్డుకునేందుకు, ఒంటరిపాటు చేసేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదం యత్నాలు.

(ఐ) కొనసాగుతున్న ప్రపంచ రాజకీయ మితవాదం మొగ్గు, దానికి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రతిఘటన.

(ఒ) అమెరికన్ సామ్రాజ్యవాద దూకుడుకు లాటిన్ అమెరికాలో పెరుగుతున్న ప్రతిఘటన; ప్రతిష్టాత్మకమైన ప్రజా పోరాటాలతో చిలీ, వెనిజులా, బొలీవియా, పెరూ, హోండురస్‌లలో వామపక్ష అభ్యుదయ శక్తుల ఎన్నికల విజయాలు.

(ఓ) అమెరికా – నాటో సైన్యాల ఉపసంహరణతో ఆఫ్ఘనిస్తాన్‌ను తాలిబాన్‌లు కైవసం చేసుకున్న అనంతరం అక్కడ తలెత్తుతున్న పరిస్థితి ఈ కాలపు ఒక ప్రధాన పరిణామం.

(ఔ) మన ఇరుగు పొరుగు దేశాల మధ్య భారతదేశం ఒంటరిపాటు పెరగటం, వాటిలో ఎక్కువ దేశాలతో మన సంబంధాలు క్షీణించడం.

(అం) గ్లోబల్ వార్మింగ్ వలన పెరుగుతున్న తీవ్ర ప్రమాదం, పర్యావరణ మార్పు కోసం అత్యవసరంగా చేపట్టవలసిన నిర్ణయాత్మక చర్యలు.

## వినాశకరంగా కోవిడ్ మహమ్మారి

**1.2:** 2019 డిసెంబర్‌లో విరుచుకుపడ్డ కోవిడ్ 19 మహమ్మారి ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రధాన సమస్యగానే కొనసాగుతూ విధ్వంసం సృష్టిస్తోంది. కరోనా వైరస్ వేగంగా పరివర్తన చెందుతుండడంతో కొత్త కొత్త రకాలు పుట్టుకొస్తున్నాయి. తాజాగా విస్తరిస్తున్న ఒమిక్రాన్ తరహా వైరస్, డెల్టా ఇంకా ఇతర తరహాల కన్నా వేగంగా ప్రపంచవ్యాప్తంగా సోకుతోంది. కోవిడ్ మహమ్మారి ప్రారంభమైనప్పటి నుంచీ ఇప్పటివరకూ దాదాపు 30 కోట్ల మందికి వైరస్ సోకింది. ఇప్పటికే దాదాపు 55 లక్షల మంది ప్రాణాలను కోల్పోయారు.

**1.3:** **ప్రపంచంలో వ్యాక్సిన్ అసమానతలు :** విశ్వవ్యాప్తంగా సమస్త మానవాళికీ వ్యాక్సిన్ అందించే కార్యక్రమం వేగవంతం చేస్తే తప్ప ఈ మహమ్మారి తన విధ్వంసాన్ని కొనసాగిస్తూనే వుంటుంది. అందరికీ భద్రత కల్పించకుండా ఏ ఒక్కరూ క్షేమంగా ఉండజాలరు. ప్రపంచంలో వ్యాక్సిన్ అసమానతలు చాలా హెచ్చు స్థాయిలో ఉన్నందువలన అందరికీ వ్యాక్సిన్ అందడంలేదు. పరివర్తనల ద్వారా కొత్త తరహాల వైరస్‌లు పుట్టుకురావడానికి కూడా ఈ వ్యాక్సిన్ అసమానతలు దోహదం చేస్తున్నాయి. సంపన్న, అభివృద్ధి చెందిన దేశాలు తమ జనాభా అవసరాలకు మించి వ్యాక్సిన్‌లను నిల్వ చేసుకోవడం, ఎక్కువగా వినియోగించడం అసమానతలకు ఒక కారణం. సంపన్న దేశాలలోని జనాభాలో దాదాపు 70 శాతం పూర్తిగా వ్యాక్సిన్‌లను పొందగలిగితే, తక్కువ ఆదాయాలు కల దేశాలలోని జనాభాలో కేవలం 2.5 శాతం మాత్రమే పొందగలిగారు. తమ దేశాల జనాభా కన్నా 150 శాతం అధికంగా సంపన్న దేశాలు వ్యాక్సిన్‌లను వేయించాయి. అదే పేద

దేశాలలోని జనాభాలో కేవలం 7 శాతం మాత్రమే వ్యాక్సిన్‌లను పొందగలిగారు. యావత్తు ఆఫ్రికా ఖండంలో ఉన్న వయోజనులలో కేవలం 10 శాతం మాత్రమే 2022 ఆరంభం నాటికి పూర్తిగా వ్యాక్సిన్‌లను పొందగలిగారు. కొన్ని అధికాదాయ దేశాలు వ్యాక్సిన్‌లపై ఉన్న మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను సడలించి, పేటెంటు హక్కులను తొలగించేందుకు తిరస్కరించడం కూడా ఒక కారణం. బడా ఫార్మా కంపెనీల లాభాలను కాపాడేందుకే ఈ విధంగా తిరస్కరించడం జరుగుతోంది. ఇది వ్యాక్సిన్‌ల ధరలు ఎక్కువగా ఉండడానికి దారి తీస్తున్నది. దాని కారణంగా పేద దేశాలు వ్యాక్సిన్‌లను కొనుగోలు చేయలేకపోతున్నాయి. దేశీయంగా వ్యాక్సిన్‌ల ఉత్పత్తికి అనుమతి లేకుండా ఉంది.

**1.4: అరకొర ప్రజారోగ్య సంరక్షణ :** పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజారోగ్య సంరక్షణ ఎంత తక్కువగా ఉందో ఈ మహమ్మారి పూర్తిగా బహిర్గతం చేసింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇది మరీ నగ్నంగా బైటపడింది. లాభాలను అత్యధికంగా దండుకోవాలనే నయా ఉదారవాద విధానాల కారణంగా వైద్య, ఆరోగ్య సేవలు పెద్ద ఎత్తున ప్రైవేటీకరించబడ్డాయి. ఎక్కడైనా ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు అందుబాటులో ఉన్నా అవి ఆరోగ్య బీమా ద్వారా మాత్రమే అందుతూ, ఇన్సూరెన్స్ కంపెనీలకే ప్రయోజనకరంగా ఉంటున్నాయి తప్ప ప్రభుత్వ నిధుల ద్వారా వైద్య సేవలు అందడం లేదు. అత్యధిక మందికి ప్రైవేటు వైద్య సేవలను పొందగలిగే స్తోమత లేనందువలన లక్షలాది ప్రజలు తమ ప్రాణాలను నిలుపుకోలేకపోయారు. మహమ్మారిని అదుపు చేయడమూ కష్టసాధ్యమైపోయింది. వ్యాక్సిన్ అసమానతలకు ఇది కూడా తోడు కావడంతో ప్రజల జీవితాలపై, ముఖ్యంగా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలపై వినాశకర ప్రభావాన్ని కలిగించింది.

**1.5: సోషలిస్టు దేశాలు :** ఇందుకు పూర్తిగా భిన్నమైన రీతిలో సోషలిస్టు దేశాలు కరోనా మహమ్మారి విషయంలో వ్యవహరించాయి. ప్రజల రక్షణే కేంద్రంగా ఉండే తమ విధానాలతో, ప్రజారోగ్య వ్యవస్థలతో ఆ దేశాలు ఈ మహమ్మారి సవాలును పెట్టుబడిదారీ దేశాల కన్నా సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. మరోసారి సోషలిజం ఔన్నత్యాన్ని నిరూపించాయి. చైనా

ఈ మహమ్మారి నుండి గట్టి సవాలునే ఎదుర్కొంది. కాని దానిని అదుపు చేయగలిగింది. అంతేకాక, తన ఆర్థిక వ్యవస్థ తిరిగి కోలుకోగలిగింది. ఆర్థిక కార్యకలాపాలన్నీ పునః ప్రారంభించబడ్డాయి. 100 దేశాలకు చైనా వ్యాక్సిన్‌లను సరఫరా చేయగలిగింది. అమెరికా విధించిన క్రూరమైన దిగ్బంధనం వలన తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నా, క్యూబా తనకు అవసరమైన ఔషధాలను, పరికరాలను విదేశాల నుండి పొందగలిగింది. పైగా దేశీయంగా వ్యాక్సిన్‌లను పెంపొందించింది. 50కి పైగా దేశాలకు వ్యాక్సిన్‌లను సరఫరా చేసింది. వైద్యబృందాలను పంపింది. వియత్నాం కూడా కోవిడ్-19 మహమ్మారిని మొదటి వేవ్‌లో సమర్థవంతంగా అరికట్టగలిగింది. ఇప్పుడు డెల్టా వేవ్ ను నియంత్రిస్తోంది.

## ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం

**1.6:** 2008లో ఆర్థిక సంస్థలు కుప్పకూలడంతో వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం నుంచి ప్రపంచ పెట్టుబడిదారీ విధానం అంతకు పూర్వపు స్థాయికి కోలుకోలేకపోయింది. ప్రపంచ జిడిపి వృద్ధి 2009లో 5.4 శాతం ఉండగా అది క్రమంగా పడిపోతూ 2019 నాటికి 2.8 శాతానికి చేరుకుంది. అంతలో మహమ్మారి ప్రభావం పడింది. దానితోబాటు వచ్చిన లాక్‌డౌన్‌లు, ఉత్పత్తి నిలుపుదలల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2020 ముగిసే నాటికి 4.4. శాతం కుదించుకు పోయిందని ఐఎంఎఫ్ లెక్కలు తెలియజేస్తున్నాయి. రాబోయే కాలంలో ఆరోగ్యకరమైన వృద్ధిరేటు సాధించబడుతుందని ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు అంచనాలు తెలియజేస్తున్నాయి. అయితే ఇంకా కొనసాగుతున్న వ్యాక్సిన్ అసమానతలు తదితర సమస్యలు ఈ వృద్ధిరేటును ఎగరగొట్టవచ్చునని కూడా హెచ్చరిస్తున్నాయి. మహమ్మారి రాక మునుపటి వృద్ధి రేటు కన్నా 2022లో వృద్ధి రేటు రెండు శాతం తక్కువగానే ఉంటుందని ప్రపంచ బ్యాంకు చెప్తోంది.

**1.7:** **అమెరికా, ఇ.యు. దేశాల ఉద్దీపన ప్యాకేజిలు**: అమెరికాలో, ఇ.యు.దేశాలలో ప్రకటించిన ప్యాకేజీల వలన ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటాయన్న అంచనాలపై ప్రధానంగా ఆధారపడి అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ సంపద వృద్ధి గురించి ఆశాజనకమైన అంచనాలను

వేస్తున్నాయి. అమెరికా 1.9 లక్షల కోట్ల డాలర్ల (1.9 ట్రిలియన్ డాలర్లు) ప్యాకేజిని ప్రకటించింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు తన బడ్జెట్ నుండి 1.8 లక్షల కోట్ల యూరోల (2.2 ట్రిలియన్ డాలర్లు) ప్యాకేజిని అమలు చేయడానికి అంగీకరించింది. ఈ ప్యాకేజిల వలన శ్రామిక వర్గానికి, మధ్యతరగతులకు కలిగే ప్రయోజనాలు చాలా పరిమితంగా ఉండగా, బడా వ్యాపారులకు, ద్రవ్య పెట్టుబడికి వరాలను కురిపించింది. తద్వారా లాభాలను గరిష్టంగా పెంచాలనే నయా ఉదారవాద ఎజెండాను మరో అడుగు ముందుకు తీసుకుపోయింది. మహమ్మారి మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన ఉద్దీపన పథకాల మొత్తం విలువ 16.9 ట్రిలియన్ల డాలర్లు ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇందులో సుమారు 86 శాతం సంపన్న దేశాలలోనే అమలు జరిగింది. ఆర్థిక వ్యవస్థలకు అప్పులు, అడ్వాన్సుల రూపంలో కేటాయించిందే ఎక్కువ కాగా, ప్రజలకు ప్రత్యక్షంగా అందినది చాలా తక్కువ. ఇందుకు అవసరమైన వనరులను సమీకరించడానికి ప్రధానంగా ప్రభుత్వ బాండ్ల రూపంలో, స్టాక్ మార్కెట్‌లో మారకం అయ్యే ఇతర రూపాలలో ప్రయత్నించారు. దీనివలన స్టాక్‌మార్కెట్‌లలో వేడి పెరిగి ఇంతకుముందెన్నడూ లేనంతగా పుంజుకున్నాయి.

**1.8: పెరుగుతున్న అసమానతలు:** ఉద్దీపన పథకాలకు అవసరమైన నిధులను సమీకరించే క్రమం స్టాక్ మార్కెట్ ఒక్కసారి పెరగడానికి దారి తీయడంతో అసమానతలు జుగుప్సాకరమైన రీతిలో పెరిగిపోయాయి. జూలై 2020 నాటికి ప్రపంచ శత కోటీశ్వరుల సంపద 10.2 లక్షల కోట్ల డాలర్లకు (10.2 ట్రిలియన్ డాలర్లు) పెరిగి తారాస్థాయిని అందుకుంది. గత ఏడాదిలో అత్యంత సంపన్నులైన 10 మంది వ్యక్తుల సంపద 41,300 కోట్ల డాలర్ల (413 బిలియన్ డాలర్లు) మేరకు అదనంగా పెరిగింది. 2021లో ఐరాస మానవతా సహాయం కోసం విజ్ఞప్తి చేసిన మొత్తం విలువ కన్నా ఇది 11 రెట్లు ఎక్కువ. కోవిడ్ వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసే బడా ఫార్మా గుత్తాధిపతుల్లో 9 మంది కొత్తగా శతకోటీశ్వరులయ్యారు. సంపద కేంద్రీకరణ ఈ విధంగా భరించరాని స్థాయికి చేరుకోవడం అనేది పెట్టుబడిదారీ విధానపు దోపిడీ స్వభావంలోనే ఉంది. కంపెనీలపై 15 శాతం గ్లోబల్ మినిమమ్ టాక్స్ విధించడానికి 136 దేశాలు

అంగీకరించాయి. అయితే ఇది అమలులోకి రావడం, బడా కార్పొరేట్లు, అతి సంపన్నులు పన్నులు ఎగవేయకుండా నిరోధించగలగడం అనేది సందేహాస్పదమైన విషయంగా ఉంది.

**1.9:** **అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి:** అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనం కింద అమలు జరుగుతున్న నయా ఉదారవాద విధానం ఆదాయాల్లోనూ, సంపదల్లోనూ అసమానతలు పెరిగిపోడానికి దారి తీసింది. లాభాలను గరిష్టంగా సాధించడం అనే తన లక్ష్యాన్ని నయా ఉదారవాదం గట్టిపరుచుకుందని ఇది సూచిస్తున్నది. ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం చూపించడం నయా ఉదారవాద విధానానికి చేతకాదని రుజువైనట్టు 22వ మహాసభ పేర్కొంది. నిజానికి ఆ నయా ఉదారవాదం సూచించిన విధానాలు, చర్యల వల్లనే ఈ సంక్షోభం తలెత్తిందని కూడా ఆ మహాసభ పేర్కొంది. కేవలం లాభాలను గరిష్టంగా సాధించడం పైనే దృష్టి పెట్టడం వలన ఈ సంక్షోభాన్ని అది మరింత తీవ్రతరం చేస్తున్నది. అంతేకాక, ప్రపంచవ్యాప్తంగా మహమ్మారి వలన ఉత్పన్నమైన పరిస్థితిని సైతం ఉపయోగించుకుని మరింత గట్టిగా తన విధానాలను అమలు చేయడానికి పూనుకుంటున్నది. అది రూపొందించిన ఉద్దీపన పథకాలు సంపన్నులను మరింత సంపన్నులుగా చేసేందుకే ఉపయోగపడ్డాయి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆర్థిక వ్యవస్థపై పట్టు సాధించడంతో పాటు అనేక దేశాల్లో నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలుచేసే రాజకీయ శక్తులను ప్రభావితం చేయగలుగుతున్నది.

## పెరుగుతున్న ప్రజల కడగళ్లు

**1.10:** ఒకవైపు కరోనా మహమ్మారి, ఇంకోవైపు ప్రపంచ ఆర్థిక మాంద్యం కలిసి అత్యధిక శాతం ప్రజానీకం జీవితాలపై వినాశకర ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. పెట్టుబడిదారీ ఆర్థిక దోపిడీ తీవ్రతరం కావడంతో ప్రపంచంలో ఆకలి తీవ్రత పెరుగుతోంది, పేదరికపు తీవ్రత పెరుగుతోంది, నిరుద్యోగం శరవేగంగా పరుగులు తీస్తోంది, అత్యధిక శాతం పిల్లలు ప్రపంచంలో విద్య, వైద్యావకాశాలకు దూరమైపోతున్నారు.

**1.11:** **పెరుగుతున్న ఆకలి:** ప్రతీ నిముషం ప్రపంచంలో 11 మంది ఆకలితో

మరణిస్తున్నారని ఆక్స్‌ఫాం అంచనా వేసింది. ప్రపంచ జనాభాలో పదవవంతు అంటే 81.1 కోట్లమంది(811మిలియన్లు) పోషకాహారలేమితో బాధపడుతున్నారని, 15 కోట్ల మంది (150 మిలియన్లు) పిల్లలు ఎదుగుదల లేకుండా గిడసబారిపోతున్నారని, 4.5 కోట్లమంది (45 మిలియన్లు) ఎన్నటికీ తిరిగి సాధారణ స్థాయికి రాలేని స్థితిలో ఉన్నారని 2020 నాటి పరిస్థితిపై యునిసెఫ్ (అంతర్జాతీయ శిశు ఎమర్జెన్సీ నిధి) అంచనా వేసింది. ఆ ముందటి ఏడు కన్నా గత ఏడాది 18 కోట్ల మంది (180 మిలియన్లు) అదనంగా కోలుకోలేని ఆకలి బారిన పడ్డారని, ప్రపంచ జనాభాలో 30 శాతం, అంటే 237 కోట్లమంది (2.37 బిలియన్లు) సరైన ఆహారం పొందలేని దుస్థితిలో ఉన్నారని, ఆ నివేదిక తెలిపింది. గత ఒక్క ఏడాదిలోనే వీరి సంఖ్య 32 కోట్లమేర (320 మిలియన్లు) అదనంగా పెరిగింది.

**1.12: పేదరికం :** 2021 చివరికి నిరుపేదలుగా జీవించేవారి సంఖ్య 74.5 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. ఒక ఏడాదిలో 10 కోట్లమంది (100 మిలియన్లు) నిరుపేదలు పెరిగారు. మహిళలు ఉపాధి కోల్పోయిన కారణంగా 2020లో నష్టపోయిన ఆదాయం 80,000 కోట్ల డాలర్ల వరకూ (800 బిలియన్లు) ఉంటుంది. 2021లో మరో 4.7 కోట్లమంది (47 మిలియన్లు) మహిళలు నిరుపేదరికపు స్థాయికి నెట్టబడనున్నారు.

**1.13: నిరుద్యోగం:** 2019లో 18.7 కోట్లమంది (187 మిలియన్లు) నిరుద్యోగులుగా ఉంటే, వారి సంఖ్య అమాంతం పెరిగిపోయి 2022 నాటికి 20.5 కోట్లు (205 మిలియన్లు) కానుంది. ప్రపంచ సంక్షోభం కారణంగా 2020లో ఉపాధి అవకాశాల కన్నా అదనంగా ఉపాధి కావలసినవారు 7.5 కోట్లమంది (75 మిలియన్లు) అధికంగా ఉంటారని ఐఎల్‌వో (అంతర్జాతీయ కార్మిక సంస్థ) అంచనా వేసింది. 2020లో పని గంటలు 8.8 శాతం తగ్గిపోయాయి. ఇది 25.5 కోట్ల (255 మిలియన్లు) పూర్తికాలం ఉద్యోగాలు కోల్పోయినదానితో సమానం. 2019లో మహిళల ఉపాధి 3.9 శాతం తగ్గితే, 2020లో 5 శాతం తగ్గింది. వయోజనుల్లో ఉపాధి 2020లో 3.7 శాతం తగ్గితే యువజనులలో 8.7 శాతం తగ్గింది. కోవిడ్‌కు పూర్వమే నిరుద్యోగం స్థాయి, తక్కువ స్థాయి పనులలో చేరడం, పని గంటలు తగ్గిపోవడం,

హీనమైన పని పరిస్థితులు చాలా ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు వాటికి తోడు అదనంగా నిరుద్యోగం, పనిగంటలు తగ్గిపోవడం ఇంకా పెరిగింది.

**1.14:** డిజిటల్ టెక్నాలజీ వస్తున్న పెద్ద పెద్ద నూతన మార్పులు, పెద్ద ఎత్తున డేటా సమీకరణ ఇప్పటికే వివిధ రంగాలలోని ఉత్పత్తి ప్రక్రియలపై ప్రభావం చూపుతున్నాయి. కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్) ఇప్పటికే వివిధ ఉత్పత్తి కార్యకలాపాలలో ఇముడ్చుకోబడి, వివిధ రంగాలలో ఉద్యోగాలపై ప్రభావం చూపుతున్నది. వర్ధమాన దేశాలలో మూడింట రెండువంతుల ఉద్యోగాలపై ఆటోమేషన్ ప్రభావం పడే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించకపోయినట్లయితే నిరుద్యోగం పరిస్థితి మరింత తీవ్రమవుతుంది.

**1.15: తీవ్రమైన దోపిడీ:** గరిష్టంగా లాభాలను ఆర్జించాలనే నయా ఉదారవాద సూత్రం అమలు వలన పెట్టుబడిదారీ సంక్షోభం దీర్ఘకాలంపాటు కొనసాగుతుంది. శ్రామిక ప్రజలను ఆర్థికంగా మరింత తీవ్రంగా దోచుకోడానికి పూనుకోవడంతో దేశీయంగా కొనుగోలుశక్తి పడిపోతుంది. అది వృద్ధి పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అమెరికా, ఇటలీ, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో 2008 నుండీ కొనసాగుతున్న సంక్షోభం, ఆర్థిక మందగమనం కారణంగా నిజవేతనాలు దిగజారుతున్నాయి. నిజవేతనాలలో పెరుగుదల 14.3 శాతం ఉండగా శ్రామిక ఉత్పాదకతలో పెరుగుదల 21.8 శాతం ఉంది. ఇది ఈ శతాబ్దపు తొలి రెండు దశాబ్దాలలోనూ కనిపించే స్థితి. 2008 సంక్షోభం అనంతరం అమలు జరిపిన పొదుపు చర్యలే దీనికి కారణం. సుమారు 400 కోట్లమంది (4 బిలియన్లు) శ్రామిక ప్రజల్లో 70 శాతం ప్రజలు సామాజిక భద్రతను పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కోల్పోయారు. 2019, 2020 సంవత్సరాల మధ్య కాలంలో ఉద్యోగాలు కోల్పోవడం పెరుగుతున్న కారణంగా ప్రపంచ శ్రామికుల ఆదాయాల్లో 10.7 శాతం, అంటే 3.5 ట్రిలియన్ డాలర్లు తగ్గిపోయింది. 2021లో ఈ పరిస్థితి ఇంకా దిగజారింది. ఈ విధంగా దోపిడీ అంతకంతకూ తీవ్రతరం కావడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థకు, దాని కొల్లగొట్టే స్వభావానికి ఉన్న లక్షణం మాత్రమే.

**1.16: విద్యావకాశాలను కోల్పోవడం:** కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచంలోని బాల, బాలికలలో 90 శాతం మంది చదువులు మధ్యలో నిలిచిపోయాయని యునెస్కో (ఐక్యరాజ్య సమితి విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ) అంచనా వేసింది. మే 2021 నాటికి 26 దేశాల్లో పాఠశాలలు పూర్తిగా మూతబడివుండగా, మరో 55 దేశాలలో పాక్షికంగానే నడుస్తున్నాయి. ఇక చదువు కొనసాగించలేమన్న నిస్పృహతో విద్యార్థులు పనుల్లో కుదురుకుంటున్నారు. ఆయా దేశాల్లో అమలౌతున్న చట్టాల ప్రకారం ఉచిత విద్యకు, లేక సబ్సిడీతో అందించే విద్యకు దూరమవుతున్నారు. దీనిని బట్టి చదువుకు దూరం కావడం ఏదో తాత్కాలికమైన ఆటంకం కాదని, అర్ధంతరంగా చదువుకు ముగింపు పలకడమేనని స్పష్టం అవుతోంది. మహమ్మారి కాలంలో ఆన్‌లైన్ చదువులు విద్యారంగంలో 'డిజిటల్ విభజన'ను మరింత పెంచాయి.

## మితవాద రాజకీయాలవైపు మొగ్గు

**1.17:** ప్రపంచవ్యాప్తంగా ప్రతీఘాత శక్తులు, వాటి ఉద్యమాలు పుంజుకోవడం మనం 21వ మహాసభనాటికే గమనించాం. 22వ మహాసభ నాటికి ప్రపంచవ్యాప్తంగా రాజకీయాలలో మితవాదం వైపు మొగ్గు మరింతగా కొనసాగింది. ప్రస్తుతం మహమ్మారి, దానితో ముడిపడిన ఆరోగ్య అత్యవసర పరిస్థితుల ప్రభావంతో ఆర్థిక సంక్షోభం మరింత ముదిరిపోతున్న నేపథ్యంలో మితవాదం వైపు మొగ్గే ధోరణి ఇంకా కొనసాగుతోంది.

**1.18:** పార్టీ 22వ మహాసభ రాజకీయ తీర్మానం ఈ విధంగా చెప్పింది: "ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతున్న కొద్దీ ప్రజలలో నానాటికీ వెల్లువెత్తే అసంతృప్తిని ఎవరు అదుపు చేయగలరనే దానిపై రాజకీయ పోరాటం తెరపైకి వస్తుంది. వామపక్ష, అభ్యుదయవాదులను ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా ముందుకు రానీయకుండా నిలువరించి, ప్రజలలో ఉన్న అసంతృప్తిని తమవైపు మలచుకుని రాజకీయ మితవాద శక్తులు ముందుకొస్తున్నాయి." (పేరా 1.14)

**1.19:** శ్రామిక ప్రజలు సంఘటితమై ఐక్యంగా నిరసనలు తెలిపే క్రమం బలపడకుండా మితవాద శక్తులు విచ్ఛిన్నానికి పూనుకుంటాయి. భావోద్వేగపు ఆవేశాలను రెచ్చగొట్టడం, విచ్ఛిన్నకర పిలుపులను ప్రోత్సహించడం, జాతి దురహంకారాన్ని, విదేశీయులయెడల విద్వేషాలను, భయాలను రెచ్చగొట్టడం; మత చీలికలు, ఛాందసవాదము, సంకుచిత తత్వం వంటి ధోరణులను ప్రోత్సహిస్తాయి. తద్వారా తీవ్రమౌతున్న దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కాకుండా విచ్ఛిన్నం చేయడానికి పూనుకుంటాయి.

**1.20:** **ప్రతిగా సరితూగే ధోరణులు :** అయితే, ఈ మితవాద రాజకీయ మొగ్గుపై పోరాడేందుకు ప్రతిగా, కొన్ని ధోరణులు సరితూగేలా కూడా పెరుగుతున్నాయి. దీనిని బొలీవియా, వెనిజులా, నికరాగ్వా, పెరూ, చిలీ వంటి లాటిన్ అమెరికా దేశాలలో స్పష్టంగా చూడవచ్చు. అమెరికాలో ట్రంప్ ఓటమికి దోహదం చేసిన వాటిలో "నల్లవారి జీవితాలకూ విలువ ఉంది" (బ్లాక్ లైవ్స్ మేటర్) నిరసనలు కూడా ఉన్నాయి. 1959 తర్వాత మళ్ళీ ఇప్పుడు అయిదు స్కాండినేవియన్ దేశాలలోనూ (డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఐస్లాండ్) ప్రభుత్వాలు సోషల్ డెమాక్రటిక్ లేదా మధ్యేవాద–వామపక్ష శక్తుల చేతుల్లో ఉన్నాయి.

## పెరుగుతున్న నిరసనలు

**1.21:** మహమ్మారి విజృంభణకు పూర్వమే నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి, దానితోబాటు అమలులోకి వచ్చిన పొదుపు చర్యలకు, తీవ్రమైన దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిఘటన పెరగడం 22వ మహాసభ అనంతర కాలంలో చూస్తాం. అదేవిధంగా, మహమ్మారి కాలంలో ప్రజలు అనుభవించిన హీనస్థితికి, లాక్‌డౌన్లకు, ప్రజాసంక్షేమానికి అరకొర చర్యలు మాత్రమే చేపట్టడానికి వ్యతిరేకంగా కూడా ప్రతిఘటన పెరిగింది. ఒకపక్క మహమ్మారి కొనసాగుతున్నా, ప్రపంచంలో పలు చోట్ల సమ్మెలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. జార్జి ఫ్లాయిడ్ హత్యకు వ్యతిరేకంగా 'నల్లజాతివారివీ ప్రాణాలే' అనే నినాదంతో అమెరికాలోను, ఇంకా ఇతర దేశాలలోను విస్తారంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. భద్రత లేని పరిస్థితులకు వ్యతిరేకంగాను, మెరుగైన సదుపాయాల కోసం అమెరికాలో

కార్మికవర్గ సమ్మెలు తగు మోతాదులో జరిగాయి. ఇటువంటి నిరసనలు ప్రస్ఫుటంగా లాటిన్ అమెరికా దేశాల్లో ఎక్కువగా జరిగాయి. అర్జెంటీనా, బ్రెజిల్, కొలంబియా, చిలీ, ఈక్వెడార్, మెక్సికో, ఉరుగ్వే దేశాల్లో శ్రామిక ప్రజలు సమ్మెలను, భారీ ప్రదర్శనలను నిర్వహించారు.

**1.22:** యూరప్‌లో పారిశ్రామిక కార్మికులు, సేవారంగాల్లో పనిచేసే డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య కార్మికులు, ఉపాధ్యాయులు తదితరులు సమ్మె చేశారు. ప్రపంచస్థాయి భారీ సంస్థ అమెజాన్ తన సంస్థలో యూనియన్లను నిషేధించినా, అనేక దేశాల్లో ఆ సంస్థలో పని చేసే కార్మికులు సమ్మె చేశారు. మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని, జీతాలను పెంచాలని, ఇతర సాంఘిక సంక్షేమ చర్యలను చేపట్టాలని, పొదుపు చర్యల ఫలితంగాను, మహమ్మారి కారణంగాను ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల నుండి ఊరట కల్పించాలని ఆ పోరాటాలలో వారు డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలలో తెచ్చిన సంస్కరణలకు, పెరిగిన పన్ను భారాలకు వ్యతిరేకంగా "ఎల్లో వెస్ట్స్ " అనే సమరశీల ఉద్యమం **ఫ్రాన్స్‌లో** జరిగింది. కార్మిక చట్టాలలో మార్పులను, వేతనాలు, పెన్షన్‌లలో కోతలను, పెరిగిన పని గంటలను వ్యతిరేకిస్తూ పలు దేశాలలో నిరసనలు చేపట్టారు. కార్మికుల పోరాటాల ఫలితంగా **పోర్చుగల్** వంటి దేశాలలో "వర్క్ ఫ్రం హోం" నిబంధనలపై చట్టం చేయవలసి వచ్చింది. **గ్రీస్‌లో** భారీ సమ్మెలు జరిగాయి. రైతులు, మహిళలు, పర్యావరణ ఉద్యమకారులు, విద్యార్థులు, యువజనులు కార్మికులు చేపట్టిన ఈ పోరాటాలను బలపరచడమే కాకుండా వాటిలో చురుకుగా పాల్గొన్నారు. ఇది ఒక ముఖ్యమైన పరిణామం. అనేక దేశాల్లో, ఈ నిరసన కార్యక్రమాల ప్రభావం అక్కడి ఎన్నికలపై బలంగా పడి, అభ్యుదయ శక్తులకు, మితవాదేతర శక్తులకు ప్రయోజనం కలిగింది.

## ప్రపంచంలో ఒక ప్రధాన శక్తిగా చైనా ఎదుగుదల

**1.23:** కరోనా మహమ్మారిని అదుపు చేయడంలోను, తన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడంలోను చైనా ప్రభావవంతంగా వ్యవహరించింది. ప్రపంచంలోని రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని అది గట్టిపరచుకుంది. 2021 జూలైలో చైనా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ

ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఆ సందర్భంగా తాను పెట్టుకున్న రెండు లక్ష్యాలలో ఒకదానిని చేరుకున్నట్లు ప్రకటించింది. 2020 నాటికల్లా చైనాను ఒక మోస్తరు సంపన్నవంతమైన సమాజంగా అభివృద్ధి చేయడం, ఆరోగ్యకరమైన వృద్ధిరేటు సాధించడం, ప్రజల ఆదాయాలు, విద్య, ఆరోగ్యం, జీవన పరిస్థితులలో మెరుగుదల సాధించడం అనేదే ఆ లక్ష్యం.

**1.24:** దేశంలో నిష్ట దారిద్ర్యం అనేది లేకుండా నిర్మూలించగలిగామని 2021 ఫిబ్రవరిలో అధికారికంగా చైనా ప్రకటించింది. ప్రపంచ పేదరికంలో 70 శాతానికి పైగా తగ్గించడంలో చైనా ప్రధాన భూమిక పోషించిందని ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ పేదరికపు అంచనాల నివేదిక తెలిపింది. తన జిడిపి (స్థూల దేశీయ ఉత్పత్తి) వార్షిక వృద్ధి రేటు లక్ష్యం 6 శాతం కాగా, 2021 మొదటి మూడు త్రైమాసికాలలోను 9.89 వృద్ధిని చైనా సాధించింది. 2006 నుండీ, ప్రతి ఏటా ప్రపంచం సాధిస్తున్న సగటు ఆర్థిక వృద్ధిలో 30 శాతం పైగా చైనాయే సాధించింది.

**1.25:** **అమెరికా-చైనా ఘర్షణలు**: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చైనా ప్రభావాన్ని చూసి అమెరికా అప్రమత్తమైంది. ఆ విధమైన పెరుగుదల తన ప్రపంచ ఆధిపత్యానికి ఒక సవాలు కాగలదని అమెరికా భావిస్తున్నది. చైనా నిలకడగా సాధిస్తున్న ఆర్థిక శక్తితో, కోవిడ్ మహమ్మారిని సమర్థవంతంగా అదుపు చేయగలగడంతో, తన ఆర్థిక వ్యవస్థను తక్కిన ప్రపంచానికి తెరవడంతో, అది తన ప్రపంచ ఆధిపత్యానికి అంతకంతకూ పెనుముప్పుగా తయారవుతున్నట్టు అమెరికా భావిస్తోంది. చైనాను కేవలం అదుపు చేయడానికే కాదు, ఒంటరిపాటు చేయడానికి కూడా అమెరికా వరుసగా కొన్ని చర్యలు చేపట్టింది. చైనాను వ్యూహాత్మక శత్రువుగా వర్గీకరించింది. ఆర్థికపరమైన, వాణిజ్యపరమైన చర్యలతో చైనా ఆర్థిక వ్యవస్థను బలహీనపరచాలని ప్రయత్నిస్తున్నది. హాంకాంగ్‌లో తలెత్తిన నిరసనలను చూపించి ప్రజాస్వామ్య సమస్యగా దానిని లేవనెత్తుతున్నది. జిన్‌జియాంగ్ రాష్ట్రంలో మానవహక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ చర్చ రేపుతోంది. చైనా చేపట్టిన 'ఒకే చైనా విధానం' దెబ్బతినడానికి తోడ్పడేలా తైవాన్‌ను సైనికపరంగా సాయుధం చేస్తున్నది. దక్షిణ చైనా సముద్రం మీద నిర్నిరోధమైన అవకాశాన్ని తనకు

కల్పించాలని కోరుతోంది. చైనా సైబర్ యుద్ధానికి పాల్పడుతోందంటూ ఆరోపణలను గుప్పిస్తోంది.

**1.26:** ఒక సైనిక, వ్యూహాత్మక కూటమిగా క్వాడ్ (అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఇండియా) ఏర్పడిన అనంతరం, ఇంకో సైనిక రక్షణ కూటమిని ఆకస్ (ఆస్ట్రేలియా–బ్రిటన్–అమెరికా) పేరుతో ఏర్పాటు చేసి ఇండో–పసిఫిక్ సముద్రజలాల్లో చైనా ప్రభావాన్ని, ఉనికిని తగ్గించడానికి పూనుకుంటున్నది. ఈ దేశాల ఉమ్మడి సైన్యాల ఉనికితో, ఉమ్మడి సైనికపాటవ ప్రదర్శనలతో, వివిధ తరహాల 'యుద్ధ క్రీడల'తో అమెరికన్ సామ్రాజ్యవాదం చైనాను ఒంటరిపాటు చేయడానికి ప్రయత్నిస్తోంది.

**1.27:** ట్రంప్ ప్రభుత్వ కాలంలో చైనాపై విధించిన ఆంక్షలను బైడెన్ ప్రభుత్వ కాలంలో కూడా అమెరికా కొనసాగిస్తోంది. దాని పర్యవసానంగా 2018, 2020ల మధ్య చైనా నుంచి అమెరికాకు దిగుమతులు, ద్వైపాక్షిక సేవారంగ వ్యాపారం పడిపోయాయి. అయినప్పటికీ, 2020లో 65,950 కోట్ల (659.5 బిలియన్లు) డాలర్ల వ్యాపారంతో, అమెరికాకు అతి పెద్ద వ్యాపార భాగస్వామిగా చైనా ఉంది. ఉభయదేశాల నడుమ రుణాలు, పెట్టుబడులు ముడిపడిపోయినందున చైనాతో వ్యాపారం చేయకుండా అమెరికా తప్పించుకోలేదు. శాస్త్ర, సాంకేతిక పరిశోధనల విషయంలో తన ఆధిక్యతను నిలుపుకోడానికి, ఈ రంగంలో చైనా సాధిస్తున్న విస్తరణకు అడ్డుకట్ట వేయాలని అమెరికా నానా యత్నాలూ సాగిస్తోంది. 5–జి నెట్‌వర్క్ వ్యాపారంలో చైనాకు పాత్ర లేకుండా చేయాలని ప్రయత్నించడం ఇందులో భాగమే.

**1.28:** ప్రపంచం మొత్తం మీద చైనాను ఒంటరిపాటు చేయాలనే తన ప్రయత్నంలో భాగంగా జి7, ఇ.యు., నాటో మిత్రులను అమెరికా కూడగడుతోంది. 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్' పేరుతో, ప్రపంచ వాణిజ్యాన్ని పెంపొందించడానికి దోహదం చేసే ఒక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టును చైనా చేపట్టి, అందులో 150కి పైగా దేశాలను చేర్చింది. దానిని దెబ్బ తీయడానికి అమెరికా చొరవచేసి జి7 దేశాల ద్వారా ఒక పోటీ పథకాన్ని ప్రకటింపజేసింది. 'బిల్డ్ బ్యాక్ బెటర్ వరల్డ్' అనేది ఆ

పథకం పేరు. నాటో శిఖరాగ్ర సమావేశంలో అమెరికా ప్రభావంతో, చైనా నుండి తమ భద్రతకు ముప్పు ఉందంటూ ఒక ప్రకటనను జారీ చేశారు. అమెరికా, కెనడా, బ్రిటన్‌లతోపాటు, ఇయు కూటమి కూడా చైనాలో మానవ హక్కుల విషయంలోను, చైనా దౌత్య అధికారులపై ఆంక్షలు విధించడంలోను కలిసి వ్యవహరిస్తోంది. అయితే, ఆర్థిక వాణిజ్య అంశాలలో అమెరికాతో కలిసి వ్యవహరించడానికి పూర్తిగా సిద్ధంగా లేదు. చైనా నుండి విడగొట్టుకోడానికి జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ ఉత్సాహం చూపడం లేదు. ఇయు దేశాలు చైనాపై మానవ హక్కుల విషయంలో విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా ఇయుకు చెందిన కొన్ని సంస్థలు, వ్యక్తుల మీద చైనా ఆంక్షలు విధించడంతో ఇయు వాణిజ్య మండలి అదిరిపడింది. అమెరికా, రష్యా శిఖరాగ్ర సమావేశంలో రష్యా, చైనాల నడుమ ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని చీలగొట్టడానికి అమెరికా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

**1.29:** సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి నడుమ నెలకొన్న కేంద్ర వైరుధ్యం మీద అమెరికా–చైనా ఘర్షణలు ప్రభావాన్ని చూపగలవు.

## చైనా - రష్యాల భాగస్వామ్యం

**1.30:** ఇటీవల కాలంలో చైనా, రష్యాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత లోతుగా బలపడింది. అమెరికా–నాటో కూటమికి, రష్యాకు మధ్య ఉక్రెయిన్ విషయంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనాను ఒంటరిపాటు చేయాలనే అమెరికా ప్రయత్నాల పూర్వరంగంలో, 2021 డిసెంబర్‌లో సి జిన్ పింగ్, పుతిన్‌ల మధ్య వర్చ్యువల్ సమావేశం జరిగింది. 2021–25 కాలంలో రష్యా, చైనాల నడుమ మరింతగా సైనిక సహకారం బలపడేందుకు వీలుగా 2021 నవంబర్‌లో జరిగిన ఉభయ దేశాల సమావేశంలో అందుకు సంబంధించిన రోడ్‌మ్యాప్ పై ఇరు దేశాల రక్షణ మంత్రులూ సంతకాలు చేశారు. అమెరికా నాయకత్వంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న కూటమికి దీటుగా ఒక వ్యూహాత్మక ప్రతిశక్తిగా చైనా, రష్యాల మధ్య బలపడిన వ్యూహాత్మక సంబంధాలు ఉపకరించగలవు.

## ఉక్రెయిన్‌లో ఘర్షణ

**1.31:** రష్యాకు, పశ్చిమ దేశాల కూటమి నాటోకు (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) నడుమ ఘర్షణ బద్దలవడానికి ఒక అంశంగా ఉక్రెయిన్ ఉంది. సోవియట్ యూనియన్ పతనం అయినప్పటి నుంచీ, నాటో తూర్పువైపుగా విస్తరించాలని పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. పాత తూర్పు యూరప్ దేశాలన్నీ ఇప్పుడు ఇయులో, నాటోలో భాగంగా ఉన్నాయి. తన దేశంలో భాగంగా ఒక రిపబ్లిక్‌గా గతంలో ఉండిన ఉక్రెయిన్‌ను నాటో పరిధిలోకి తేవడాన్ని రష్యా చాలా గట్టిగా వ్యతిరేకిస్తోంది. క్రిమియాను స్వాధీనం చేసుకోవడం, తూర్పు ఉక్రెయిన్ ప్రాంతంలోని డాన్‌బాస్ ప్రాంతంలో ఘర్షణలు ఈ తగువు పర్యవసానమే.

**1.32:** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధాన్ని తక్షణం నిలిపి వేయాలి. వివాదాంశాలను చర్చలు, సంప్రతింపులు ద్వారా పరిష్కరించుకోవాలి. అమెరికా, జి 7, ఐరోపా యూనియన్లు రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించాయి. రష్యా దీనికి ప్రతీకారంగా డాలరుతో అనుసంధానాన్ని తెంచివేసుకున్నది. వివిధ దేశాలకు ఇంధనాన్ని రూబుల్ చెల్లింపుల ద్వారా సరఫరా చేస్తున్నది. అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

## ప్రపంచంలో ప్రధాన సామాజిక వైరుధ్యాలు

**1.33:** అమెరికా, చైనాల నడుమ పెరుగుతున్న ఘర్షణ, క్యూబా, ఉత్తర కొరియాల యెడల అమెరికన్ సామ్రాజ్యవాదం కొనసాగిస్తున్న దూకుడు వైఖరి సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి నడుమ ఉన్న కేంద్ర వైరుధ్యం తీవ్రం కావడం మీద ప్రభావం చూపుతాయి.

**1.34:** సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యాల విషయంలో, సామ్రాజ్యవాద దేశాల కూటమిలోని దేశాలు ఒకదానినొకటి అంటిపెట్టుకుని ఉన్న పరిస్థితి, ట్రంప్ ప్రభుత్వ విధానాల కారణంగా దెబ్బ తింటోందని 22వ పార్టీ మహాసభ గుర్తించింది. ఇప్పుడు బైడెన్ ప్రభుత్వం యూరోపియన్ మిత్రులను, నాటో మిత్రులను అందరినీ రష్యాకు, చైనాకు వ్యతిరేకంగా

కూడగట్టడానికి సకల ప్రయత్నాలనూ చేస్తున్నప్పటికీ వాటి నడుమ విభేదాలు ఇప్పటికీ నెలకొనివున్నాయి.

**1.35:** అమెరికన్ సామ్రాజ్యవాదం లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలలో దూకుడుగా జోక్యం చేసుకోవడం పెరుగుతూండడంతో, సామ్రాజ్యవాదానికి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నడుమ వైరుధ్యం కూడా పెరుగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల రుణభారం భరించలేని స్థాయికి చేరుతోంది. అయినా, గ్లోబల్ వార్మింగ్ విషయంలో సంపన్న దేశాలు తమ వంతు చారిత్రిక బాధ్యతను చేపట్టడానికి నిరాకరిస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అనుకూలంగా ఉండే పద్ధతులను అమలు చేయడానికి తిరస్కరిస్తున్నాయి.

**1.36:** శ్రమకు – పెట్టుబడికి మధ్య పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే మౌలిక వైరుధ్యం తీవ్రతరమౌతూ కార్మిక వర్గపు హక్కులమీద, శ్రామిక ప్రజలమీద మరింత పెద్దఎత్తున దాడులకు దారి తీస్తోంది. పొదుపు చర్యల పేరుతో, ఉద్యోగాలు కోల్పోవడంతో; కార్మికుల స్థానే నూతన సాంకేతికతను తీసుకురావడంతో దోపిడీ మరింత తీవ్రమౌతోంది. ఈ దాడులకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగిస్తున్న ప్రతిఘటన కూడా పెరుగుతోంది.

## అమెరికన్ సామ్రాజ్యవాదం దూకుడు

**1.37:** తన ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించడం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచంలో పలుచోట్ల దూకుడుగా తల దూర్చుతోంది. 2020లో అమెరికా సైనిక వ్యయం 77,800 కోట్ల డాలర్లకు చేరిందని అంచనా. ఇది 2019లో చేసిన వ్యయం కన్నా 4.4 శాతం అధికం. అమెరికా సైనిక వ్యయాన్ని పెంచడం వరుసగా ఇది మూడో ఏడాది. ఐతే, చాలా చోట్ల సామ్రాజ్యవాదం మద్దతుతో నడిచే ప్రభుత్వాలకు ప్రతిఘటన కూడా పెరుగుతోంది. అమెరికన్ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేస్తోంది.

## లాటిన్ అమెరికా

**1.38:** 22వ పార్టీ మహాసభ అనంతర కాలంలో లాటిన్ అమెరికా, మితవాదశక్తుల ఎదురుదాడిని చవిచూసింది. **బ్రెజిల్**లో పచ్చి మితవాద అభ్యర్థి అయిన జైర్ బోల్సనారో 2018 అధ్యక్ష ఎన్నికలలో గెలుపొంది,

ఒక మితవాద నిరంకుశ ప్రభుత్వాన్ని ఏర్పరిచాడు. **బొలీవియా**లో 2019 ఎన్నికలలో 'సోషలిజం కోసం ఉద్యమం' (ఎంఎఎస్) కు చెందిన (వామపక్ష) ఇవో మొరేల్స్ గెలిచినప్పటికీ, అమెరికా దన్నుతో జరిగిన కుట్ర ఫలితంగా మొరేల్స్ ఆ దేశాన్ని విడిచిపెట్టవలసివచ్చింది. **హోండూరస్** ఎన్నికలలో భారీ రిగ్గింగ్ జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ అమెరికా జోక్యం చేసుకుని పాత అధ్యక్షుడినే మళ్ళీ పీఠంపై కూచోబెట్టింది. **వెనిజులా**లోని నికొలస్ మదురో ప్రభుత్వాన్ని కూలదోయడానికి అక్కడి మితవాద శక్తులు అమెరికా ప్రోద్బలంతో అనేకసార్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

**1.39:** ఇందుకు భిన్నంగా, ప్రజా పలుకుబడి కలిగిన, వామపక్ష శక్తులు నిరంకుశత్వానికి, మితవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్నాయి. దీని వలన వామపక్షాలు తిరిగి పునాదిని సాధించుకుని పురోగమిస్తున్నాయి. **అర్జెంటీనా**లో అధికారంలో ఉండిన మితవాదపక్ష అధ్యక్షుడు 2019 ఎన్నికలలో ఒక పెరోనిస్టు అభ్యర్థి చేతుల్లో ఓటమిపాలయ్యాడు. **బొలీవియాలో** మితవాద కుట్రలను తిప్పికొట్టే ఎదురుదాడి అత్యంత ప్రముఖమైనది. ఇక్కడ 2020 అక్టోబర్‌లో ఎంఎఎస్ అభ్యర్థి అధ్యక్ష ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందాడు. విద్రోహపూరితంగా గద్దెనెక్కిన గత ప్రభుత్వం అమలు చేసిన తిరోగమన విధానాలన్నింటినీ తిరగదోడారు. ఆ తర్వాత వామపక్ష అభ్యర్థులు, వామపక్ష–మధ్యేవాద అభ్యర్థులు **పెరూ**లో, **హోండురాస్**లో గెలుపొందారు. (ఈ రెండు దేశాలకూ గతంలో నిరంకుశ ప్రభుత్వాలు, కుట్రలతో కూలదోయడాలు వంటి చరిత్ర ఉంది)

**1.40:** **చిలీ**లో, డిసెంబర్ 2021లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో వామపక్షకూటమి అభ్యర్థి గాబ్రియెల్ బోరిచ్ గెలుపు ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలుస్తుంది. ఆ దేశంలో రాజ్యాంగాన్ని మార్చడానికి, రాజ్యాంగసభను ఎన్నుకోడానికి జరిగిన ఉద్యమంలో వామపక్షాలు అభ్యుదయ శక్తులు ప్రధాన భూమిక పోషించిన నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. అభ్యుదయ శక్తుల విజయ పరంపరకు భిన్నంగా ఒక్క ఈక్వెడార్‌లో మాత్రమే మితవాద అభ్యర్థి అధ్యక్షపదవికి ఎన్నికయ్యారు.

**1.41:** **బ్రెజిల్**లో, వినాశకర పాలన సాగిస్తున్న బోల్సనారో ప్రభుత్వానికి

ఎదురౌతున్న నిరసనలు బహుళ ప్రజాదరణను పొందుతున్నాయి. మాజీ అధ్యక్షుడు లూలా పై మోపిన అవినీతి ఆరోపణలు తప్పుడువని తేలిపోవడంతో 2022లో జరగబోయే అధ్యక్ష ఎన్నికలలో బోల్సనారో, లూలా నుండి గట్టి పోటీనే ఎదుర్కోవలసి వస్తుంది. లూలా గనుక విజయం సాధిస్తే దాని ప్రభావం అమెరికా మద్దతుతో వ్యవహరిస్తున్న మితవాద శక్తులపై పోరాటానికి పెద్ద ఊపునిస్తుంది. అమెరికన్ తొత్తులుగా ఉండే మితవాద శక్తులకు కోటగా చాలా కాలంగా ఉన్న కొలంబియాలో, వామపక్షాల నాయకత్వంలో కార్మికవర్గ పోరాటాలు భారీఎత్తున జరుగుతున్నాయి. 2022 అధ్యక్ష ఎన్నికలలో ఇవి పెద్ద సవాలునే విసరగలుగుతాయి.

**1.42:** **వెనిజులాలో**, మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బైట నుండి ఆంక్షలు విధించడం, విదేశాలలో ఉన్న ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా లాక్కోవడం, సాయుధ మూకలను ప్రోత్సహించడం; సాంఘిక, ఆర్థిక రంగాల్లో అశాంతిని రేపడం వంటి చర్యల ద్వారా అమెరికా ప్రోద్బలంతో మితవాద శక్తులు సాగిస్తున్న వికృత యుద్ధాన్ని వెనిజులా చాలా వీరోచితంగా తిప్పికొడుతూ వస్తున్నది. ఆహారం, ఇంధనం, నిత్యావసర సరుకుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ; ప్రజాదరణ బలంతో ఐక్యతను కాపాడుకుంటూ ఆ కుట్రలను ఎదుర్కొన్నారు. 2021 నవంబర్‌లో రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలలో ఎలాగైనా అశాంతిని సృష్టించాలన్న ప్రయత్నాలను తిప్పికొట్టి, పాలక యునైటెడ్ సోషలిస్టు పార్టీ (పిఎస్‌యువి) 23 గవర్నర్ పదవులకు గాను 19 చోట్ల గెలుపు సాధించింది.

## పశ్చిమాసియా

**1.43:** పాలస్తీనా పై, ఇరాన్ విషయంలో కయ్యానికి కాలు దువ్వే వైఖరిని ఇజ్రాయిల్ కొనసాగించడం పశ్చిమాసియాలో కనపడే ప్రధాన ధోరణి. ట్రంప్ ప్రభుత్వం జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించడానికి అంగీకరించడం, వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ చట్టవిరుద్ధంగా చేసిన ఆక్రమణలను ఆమోదించడంతో మరింత ధైర్యం తెచ్చుకుని నెతన్యాహు ప్రభుత్వం తూర్పు జెరూసలేంలో, అల్–అక్సా మసీదు వద్ద తాజాగా కవ్వింపు చర్యలకు దిగింది. గాజా ప్రాంతంలో మరో దాడికి పాల్పడింది. అరబ్ దేశాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మొరాకో, బహ్రెయిన్, సూడాన్

నాలుగింటినీ ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు నెలకొల్పుకొనేందుకు అంగీకరింపజేయడం ద్వారా ఇజ్రాయిల్ దౌత్య విజయానికి అమెరికా దోహదం చేసింది.

**1.44:** అణు ఒప్పందం నుండి ట్రంప్ ప్రభుత్వం ఏకపక్షంగా వైదొలగిన అనంతరం, ఇరాన్ పై ఆంక్షలను మళ్ళీ విధించింది. బైడెన్ అధ్యక్ష పదవి చేపట్టాక, అణు ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు చర్చలు జరుగుతున్నా, ఇంతవరకూ వాటిలో పురోగతి లేదు. ఆంక్షలను ఎత్తివేయడానికి అమెరికా సుముఖత చూపకపోవడం ప్రధాన ఆటంకంగా ఉంది. కొత్త అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ నాయకత్వంలో ఇరాన్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. చైనాతో వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే విధంగా, ఇరాన్ 25 సంవత్సరాల వ్యూహాత్మక ఒప్పందాన్ని చేసుకుంది.

**1.45:** గత మూడు దశాబ్దాలలో అత్యంత దారుణమైన సామ్రాజ్యవాద దాడులను, ఆక్రమణలను పశ్చిమాసియా ప్రాంతం చవిచూసింది. ముందు ఇరాక్, అనంతరం లిబియా, ఆ తర్వాత సిరియా. అమెరికన్ సైన్యాల ఉపసంహరణ తర్వాత, ఇరాక్ ఇప్పటికీ విభిన్న మూకల అంతఃకలహాలతో, ఆల్‌ఖైదా, ఐఎస్ఐఎస్‌లతో దీర్ఘ పోరాటాలతో నిమగ్నమై ఇప్పటికీ సుస్థిరతకు దూరంగానే ఉంది. లిబియాలో సంవత్సరాల తరబడి అంతర్యుద్ధం కొనసాగింది. అక్కడ పరస్పర శత్రు వైఖరితో ఉండే సాయుధ ముఠాల ఆధిపత్యం ఉన్న ప్రమాదకర నేపధ్యంలో శాంతిని నెలకొల్పి, ఐక్యంగా మనగలిగే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. సిరియాలోని ప్రభుత్వాన్ని అస్థిరపరచి కూలదోయాలన్న ప్రయత్నాలు విఫలమై, ఏడేళ్ళపాటు వినాశకరమైన అంతర్యుద్ధం కొనసాగాక, అసద్ ప్రభుత్వం తన పట్టు పెంచుకుంది. టర్కీ సరిహద్దుల్లో ఉన్న ఒకే ఒక రాష్ట్రం మాత్రం ఇంకా ఉగ్రవాద తిరుగుబాటుదారుల చేతుల్లో ఉంది.

**1.46:** ఈ మూడు దేశాలు, వాటితోబాటు ఆ ప్రాంతంలోని ఇతర దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. లెబనాన్ ఆర్థికంగా కుప్పకూలే క్రమంలో ఉన్నది.

## ఆఫ్రికా

**1.47:** ఆఫ్రికాలో కొన్నిచోట్ల పని చేస్తున్న సాయుధ ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులపై పోరాడే పేరుతో, ఆఫ్రికా ఖండంలో విస్తృతంగా పెరుగుతున్న చైనా ప్రభావాన్ని తిప్పికొట్టడానికి, 'ఆఫ్రికామ్' పేరుతో అమెరికా, ఆ ఖండంలో తన సైనికశక్తిని పెంచింది. ఇవి 15 దేశాలలో 29 సైనిక స్థావరాలలో మోహరించిన ప్రత్యేక సైనిక దళాలు. ప్రధానంగా పశ్చిమాన సహేలియన్ ప్రాంతంలోను, తూర్పున 'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' ప్రాంతం లోను ఇవి కేంద్రీకరించి ఉన్నాయి. ఇవి గాక పశ్చిమ ఆఫ్రికాలో ఇప్పటికే వివిధ దేశాలలో ఫ్రెంచి బలగాలు మోహరించివున్నాయి.

## సోషలిస్టు దేశాలు-అమెరికన్ సామ్రాజ్యవాదపు శత్రుపూరిత చర్యలు

**1.48:** **సోషలిస్టు క్యూబా**ను అస్థిరపరచాలని, కరోనా మహమ్మారి సంక్షోభాన్ని ఒక అవకాశంగా తీసుకుని, అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రయత్నిస్తోంది. ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆర్థిక దిగ్బంధనాన్ని మరింతగా పెంచింది. క్యూబాతో ఆర్థిక సంబంధాలు పెట్టుకుంటే ఏ దేశంపైన అయినా ఆంక్షలు విధిస్తానని బెదిరిస్తోంది. సోషలిజానికి, కమ్యూనిస్ట్ పార్టీకి వ్యతిరేకంగా తిరగబడాలని కొన్ని తరగతుల క్యూబన్ ప్రజలను రెచ్చగొడుతోంది. అమెరికా అమలు చేస్తున్న దిగ్బంధనం వలన ఆర్థికంగా కడగండ్లపాలైన క్యూబాలోని పరిస్థితిని ఉపయోగించి విప్లవ ప్రతీఘాత శక్తులను ప్రోత్సహిస్తోంది. అయితే ఈ ప్రయత్నాలు విఫలమైనాయి. మరోసారి క్యూబా, ఉత్తర కొరియా దేశాలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలంటూ అమెరికా ముద్ర వేసింది. అణ్వాయుధాలుగల కొరియన్ ద్వీపకల్పం దగ్గర అమెరికా రెచ్చగొట్టే విధంగా సైనిక విన్యాసాలను చేపడుతోంది. ఉత్తర కొరియా మీద విధించిన ఆంక్షలను ఎత్తివేయడానికి అమెరికా నిరాకరించడంతో, అమెరికా–ఉత్తరకొరియాల మధ్య చర్చలు విఫలమయ్యాయి.

## దక్షిణాసియా దేశాలు

**1.49:** ఇరవై ఏళ్ళ యుద్ధానికి ముగింపుగా అమెరికన్ సైన్యాలు అత్యంత అవమానకరమైన రీతిలో ఆఫ్ఘనిస్తాన్ నుండి వెనక్కి పోవడం

ఈ ప్రాంతంలోని అతి ముఖ్యమైన పరిణామం. ఇది ప్రపంచవ్యాప్త ప్రభావం చూపగలదు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఇది ఒక ఎదురుదెబ్బ. అమెరికా–నాటో సైనిక బలగాలు ఉపసంహరింపబడడంతో అష్రఫ్ ఘనీ ప్రభుత్వం కుప్పకూలి, 2021 ఆగస్టులో తాలిబాన్ ఆ దేశాన్ని స్వాధీనపరుచుకుంది. తాలిబాన్ల గత ప్రభుత్వంతో ఉన్న అనుభవాల దృష్ట్యా, మళ్ళీ అదే ప్రభుత్వం రావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. రష్యా, చైనా, ఇరాన్, మధ్య ఆసియా దేశాలు ఆఫ్ఘనిస్తాన్‌తో సరిహద్దులు కలిగి వున్నాయి. తాలిబాన్‌తో ఈ దేశాలు, వేర్వేరు స్థాయిలలో సంప్రదింపులు నెరపుతున్నాయి. తొలి నుంచీ నికరంగా తాలిబాన్‌ను బలపరుస్తున్న పాకిస్తాన్, తాలిబాన్ ప్రభుత్వం అంతర్జాతీయంగా సంబంధాలను ఏర్పరచుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నది. ఆఫ్ఘన్ పరిణామాల విషయంలో ఒంటరిపాటైన భారతదేశం, మానవతా దృక్పథంతో సహాయం అందిస్తూ, ఆ దేశంతో సంబంధాలను తిరిగి ఏర్పరచుకోడానికి ప్రయత్నిస్తోంది.

**1.50:** ఆఫ్ఘనిస్తాన్ తీవ్రమైన ఆహార సంక్షోభంలో పడిపోయింది. ఐక్య రాజ్యసమితి సహాయ కార్యాలయం అక్కడి ప్రజలకు ఆహారం సరఫరా చేయాలంటే 440 కోట్ల డాలర్లు కావాలంటూ ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఒక్క దేశం కోసం అతి పెద్ద నిధి సేకరణకు పూనుకున్నది. అఫ్ఘనిస్తాన్‌లో 97 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువకు పడిపోతారని యుఎన్‌డిపి అంచనా వేసింది. ఇది ఒక పెద్ద మానవతా సంక్షోభానికి దారితీస్తుందని చెప్పింది.

**1.51:** సార్క్ (దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సంస్థ) సభ్యదేశాలు ఎనిమిదింట్లో ఐదు దేశాలు, చైనా చొరవతో ఏర్పడిన దక్షిణాసియా వేదికలో చేరడం చూస్తే, ఈ పరిణామాలలో భారతదేశం ఒంటరిపాటైన మరో సందర్భం మనకు కనిపిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక – ఇవీ ఆ అయిదు దేశాలు. 2014 నుండీ సార్క్ శిఖరాగ్ర సమావేశం ఒక్కటి కూడా జరగలేదు. 2016 సార్క్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి భారతదేశం నిరాకరించింది. సార్క్‌ను పునరుద్ధరించడం పట్ల భారతదేశానికి శ్రద్ధలేనట్లు కనపడుతోంది. దానికి బదులు బంగాళాఖాతం తీరాన్ని ఆనుకుని ఉన్న ఏడు దేశాలతో కూడిన

"బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టొరల్, టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (బిఐఎంఎస్‌టిఇసి)" పట్ల మొగ్గు చూపుతోంది.

## భారతదేశపు ఇరుగు, పొరుగు దేశాలు

**1.52:** పార్టీ 22వ మహాసభ అనంతర కాలంలో దక్షిణాసియా దేశాలలో నియంతృత్వం, మతతత్వం, ఛాందసవాదం మరింతగా పెరగడం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది. మన ఇరుగు పొరుగు దేశాలు మైనారిటీ మతాల, జాతుల ప్రజలు మెజారిటీకి ప్రతినిధులమని చెప్పుకునే శక్తుల నుండి దాడులను ఎదుర్కొంటున్నాయి.

**1.53:** **బంగ్లాదేశ్:** దక్షిణాసియాలోని ఇతర దేశాలకన్నా ఈ మధ్య కాలంలో బంగ్లాదేశ్ ఆర్థిక కార్యకలాపాలు, జిడిపి వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నాయి. మానవాభివృద్ధి సూచికలలో గణనీయంగా మెరుగుదల ఉండి, అన్నింటా భారతదేశంకన్నా పై స్థాయిలో ఉంది. ఇటీవల కాలంలో దుర్గాపూజ ఉత్సవాల సందర్భంగా హిందూ మైనారిటీలపై అక్కడ జరిగిన దాడులు ఛాందసవాద శక్తులు అక్కడ ఏ విధంగా సమస్యలను సృష్టిస్తున్నాయో తెలియజేస్తున్నాయి.

**1.54:** **పాకిస్తాన్:** ఒక గుర్తించదగిన పరిణామం పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అవిశ్వాసతీర్మానంలో ఓడిపోవడం, సుప్రీం కోర్టు జోక్యంతో రాజీనామా చేయడం. ప్రతిపక్ష నాయకుడు షెబాజ్ షరీఫ్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

**1.55:** ఆర్థిక పరిస్థితులు ఆందోళనకరంగా మారడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయింది. కోవిడ్ మహమ్మారి సంక్షోభాన్ని మరింత తీవ్రం చేసింది. ఆహారవస్తువుల ధరలు అధికంగా ఉండడం (2021లో మొదటి 9 మాసాల్లో సగటున 18 శాతం పెరిగాయి), నిరుద్యోగం ప్రజల నిస్పృహకు కారణమయ్యాయి. ప్రధానికి, సైనిక దళాధిపతికి నడుమ సంబంధాలు కూడా ఒత్తిడికి లోనయ్యాయి. దేశ సరిహద్దుల్లోని గిరిజన ప్రాంతాల్లో పాకిస్తానీ తాలిబాన్లు సాగిస్తున్న ఉగ్రవాద దాడులు దేశాన్ని పీడిస్తున్నాయి.

ఇస్లామిస్టు ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఎ-లబ్బైక్ క్రూరమైన పద్ధతుల్లో నిరసనలను చేపడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లకు తలొగ్గేటట్లు చేయగలుగుతున్నది. ఉగ్రవాద మూకల కార్యకలాపాలు భారతదేశానికి వ్యతిరేకంగా సాగుతున్నాయి. ఒకపక్క తమ దేశమే– మత ఛాందసవాదం, ఉగ్రవాదం కారణంగా కష్టాలపాలౌతున్నప్పటికీ, ఇంకోపక్క అక్కడ అధికారులు భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్న ముఠాలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఆ దేశంలో, అన్నింటా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించే సైన్యం ఉన్నందున, అక్కడ ప్రజాస్వామ్యం బలపడడానికి ఆటంకం అవుతోంది. నిరంకుశ పెరగడానికి తోడ్పడుతోంది.

**1.56:** **శ్రీలంక:** నవంబర్ 2020లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహింద రాజపక్స నాయకత్వంలోని శ్రీలంక పీపుల్స్ ఫ్రీడం అలయెన్స్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. దాంతో రాజపక్సె సోదరులు నలుగురూ ప్రభుత్వ పదవులను చేజిక్కించుకుని ఆ కుటుంబం పట్టును గట్టిపరచుకున్నట్లయింది. అధ్యక్షుడు రాజపక్సె నాయకత్వంలో సైన్యం లోను, ప్రభుత్వ పదవుల్లోను పట్టు కలిగివున్న నిరంకుశ ప్రభుత్వం ఏర్పాటు జరిగింది. ఈ ప్రభుత్వం సింహళ, బౌద్ధ జాతీయవాదం మీద ఆధారపడివుంది. అది తమిళ, ముస్లిం మైనారిటీల పట్ల శత్రు ధోరణితో ఉంది. రాజపక్సె ప్రభుత్వ ఆర్థిక విధానాలు ఆర్థిక సంక్షోభానికి దారి తీశాయి. వ్యవసాయ ఉత్పత్తి దిగువకు పడిపోయింది. తీవ్రమైన విదేశీమారకద్రవ్య సంక్షోభం ఏర్పడింది. ఆహార కొరత, ద్రవ్యోల్బణం ప్రజల జీవన పరిస్థితులను దారుణంగా దెబ్బతీశాయి. శ్రీలంక ఆర్థిక పరిస్థితి కుప్పకూలినట్లే. 5,100 కోట్ల డాలర్ల విదేశీ రుణాన్ని చెల్లించలేనని చేతులెత్తేసింది. కఠినమైన పునర్వ్యవస్థీకరణ షరతులతో కూడిన ఐఎంఎఫ్ రుణం కోసం సంప్రతింపులు జరుపుతున్నది. ఇది దేశ ఆర్థిక సార్వభౌమాధిపత్యాన్ని దెబ్బతీస్తుంది. ప్రజలపై మరిన్ని భారాలను మోపుతుంది.

**1.57:** అంతర్యుద్ధ సమయంలో జరిగిన యుద్ధ నేరాలపై స్వతంత్ర విచారణతో ముందుకు సాగడానికి ప్రభుత్వం నిరాకరించింది. ఉత్తర, తూర్పు రాష్ట్రాలకు అధికారాలను అప్పగించడానికి అవసరమైన చర్యలను చేపట్టే

సూచనలేవీ కానరావడం లేదు. శ్రీలంక రాజ్యాంగంలోని 13ఎ అధికరణను పూర్తి చిత్తశుద్ధితో ఆ ప్రభుత్వం అమలు చేసేలా భారత ప్రభుత్వం తన ప్రయత్నాలను కొనసాగించాల్సి వుంది.

**1.58:** **నేపాల్:** నేపాల్‌లోని రెండు కమ్యూనిస్ట్ పార్టీలూ- కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యునైటెడ్ మార్క్సిస్ట్ - లెనినిస్ట్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్ సెంటర్) విలీనమై నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎన్‌సిపి) అనే ఒక పార్టీగా ఐక్యం అయ్యాయి. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఎన్‌సిపి బ్రహ్మాండమైన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పరచింది. కాని, అనతికాలంలోనే పార్టీలోని అంతర్గత ముఠా తగువుల ప్రభావం ప్రభుత్వం మీద పడింది. ప్రధానమంత్రి కె.పి ఓలి నాయకత్వంలోని ముఠా మైనారిటీలో పడిపోయింది. పార్లమెంటును రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అనంతరం ఎన్‌సిపి లోని పార్లమెంట్ సభ్యులలో ఒక భాగం మద్దతు ఉపసంహరించుకోవడంతో ఓలి ప్రభుత్వం రాజీనామా చేయక తప్పలేదు. సిపిఎన్-యుఎంఎల్ ముఠాకు చెందిన సభ్యుల మద్దతుతో నేపాలీ కాంగ్రెస్ పార్టీ నేత షేర్ బహదుర్ దేవ్‌బా నాయకతంలో మరో ప్రభుత్వం ఏర్పడింది.

**1.59:** ఎన్‌సిపిలో వచ్చిన చీలిక, ఓలి ప్రభుత్వ పతనం నేపాల్ లోని వామపక్ష ఉద్యమానికి ఒక ఎదురుదెబ్బ. మితవాద శక్తుల జోక్యానికి ఇది దారి తెరిచింది. మతాన్ని, రాజకీయాలను కలగలిపే ధోరణి పెరుగుతోంది. ప్రజాతంత్రయుతంగా ఆమోదించిన నేపాల్ రాజ్యాంగంలోని లౌకిక సూత్రాలకు దీని వలన ముప్పు వాటిల్లగలదు.

**1.60:** **మయన్మార్:** అక్కడ ప్రజల్లో పలుకుబడి కలిగి ఎన్నికైన ప్రభుత్వాన్ని ఫిబ్రవరి 2021లో క్రూరమైన మిలిటరీ కుట్ర ద్వారా కూలదోశారు. దానికి నిరసనగా దేశవ్యాప్తంగా పదుల వేల సంఖ్యలో ప్రజలు ఆందోళనలకు దిగారు. శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తున్న ప్రజలపై మిలటరీ ప్రభుత్వం పాశవికంగా నిర్బంధానికి పాల్పడి వందలాది మందిని పొట్టన పెట్టుకుంది. వందల సంఖ్యలో జైళ్ళలోకి నెట్టింది. ఒక బూటకపు విచారణ జరిపి అంగ్ సాన్ సూకీకి రెండేళ్ళ

జైలు శిక్ష విధించింది. భవిష్యత్తులో ఆమెను ఎన్నికలలో పాల్గొనడానికి అనర్హురాలిగా చేయడానికే ఈ ఎత్తుగడ అని తెలుస్తూనే వుంది.

**1.61:** అక్కడ సైన్యంలోని ఉన్నతాధికారులకు వ్యాపార వర్గాలతో బంధం బలంగా ఉంది. తమ స్వంత వ్యాపార ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం, ఆ వర్గం ప్రభుత్వం మీద పూర్తి అధికారాన్ని చెలాయించాలని చూస్తోంది. మతము, జాతిపరమైన గ్రూపులు మెజారిటీ బౌద్ధ ప్రజానీకపు ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. రోహింగ్యాలపై సాగిన ఊచకోతతో, వారు దిక్కు తోచని స్థితిలో శరణార్థులుగా భారతదేశంతో సహా పొరుగు దేశాలకు వలసలు పోయారు. సుమారు 9 లక్షల మంది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌లో కిక్కిరిసిన శరణార్థ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. శరణార్థుల దుస్థితి ఒక తీవ్రమైన మానవతా సంక్షోభం.

**1.62:** తీవ్ర నిర్బంధం సాగుతుండడంతో, నిరసనకారులలో యువజనులు దేశపు ఉత్తర ప్రాంతంలో తిరుగుబాట్లు సాగిస్తున్న ఆయా జాతుల గ్రూపులతో చేతులు కలిపారు. వారికి సాయుధ శిక్షణ లభిస్తోంది. ఏసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సంస్థ), ఐక్యరాజ్యసమితి చేసిన ప్రయత్నాలకు ఇంతవరకూ అక్కడి మిలిటరీ పాలక కూటమి నుండి ఎటువంటి సానుకూల స్పందనా లేదు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం, మిలిటరీ పాలన అంతం కోసం పోరాడుతున్న మయన్మార్ దేశ ప్రజలకు సంఘీభావం తెలియజేయడం ముఖ్యం.

### పర్యావరణ మార్పుల ప్రమాదం

**1.63:** పార్టీ 22వ మహాసభ అనంతర కాలంలో, భూ ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగి వాతావరణ మార్పులకు దారి తీస్తోంది. అడ్డూ, ఆపూ లేకుండా ప్రకృతి వనరులను పెట్టుబడిదారీ వ్యవస్థ కొల్లగొట్టడంతో ప్రస్తుత వినాశకర పరిస్థితికి దారి తీసింది. అందుచేత పర్యావరణ మార్పు ఒక వర్గ సమస్య. పర్యావరణ మార్పుపై "ఇంటర్ గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపిసిసి)" 2021లో ఆగస్ట్ ఇచ్చిన తాజా (ఆరవ) అంచనా నివేదిక – పర్యావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత

పెరిగిందని, దానివలన పర్యావరణ సంక్షోభం ఏర్పడిందని, ఇది “నిర్ద్వంద్వంగా మానవ కార్యాచరణల కారణంగానే సంభవించిందని” మొదటిసారి పేర్కొంది. పారిశ్రామిక శకం నాటికన్నా, ఇప్పుడు భూతల ఉష్ణోగ్రతలు సగటున 1.1 డిగ్రీల సెంటీగ్రేడ్ మేరకు అధికంగా పెరిగాయని నివేదిక తెలిపింది. 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ కన్నా మించి పెరగకూడదని గ్లాస్గోలో జరిగిన కాప్26 సదస్సు నిర్దేశించుకున్న లక్ష్యం ఇంకెంతో దూరం లేదని స్పష్టం అవుతోంది. 2022 ఫిబ్రవరిలో ఐపిసిసి తన ఆరవ అంచనాలో 2025కల్లా కర్బన ఉద్గారాలు గరిష్ట స్థాయికి చేరుకొని, ఆ తర్వాత ప్రపంచ లక్ష్యాన్ని చేరుకునేందుకు తగ్గుతూ రావాలని, లేకపోతే వినాశకర పరిణామాలు సంభవిస్తాయని హెచ్చరించింది. పెరిగిపోతున్న భూతల ఉష్ణోగ్రతలతో ఒక భయానక పరిస్థితివైపు మన ప్రపంచం అడుగులు వేస్తున్నది.

**1.64:** ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ పర్యావరణంపై తీవ్రంగా, భయం గొలిపే స్థాయిలో ప్రభావం కలిగించిన దుర్ఘటనలు మనం చూశాం. ముఖ్యంగా ఉత్తరార్ధ భూగోళంలో ఇవి ఎక్కువగా జరిగాయి. ఈ స్థాయిలోనే, ఈ విధంగా ఉన్నప్పుడు ఇక ఉష్ణోగ్రతలు 1.5- 2 సెంటిగ్రేడ్ డిగ్రీలు అదనంగా పెరిగితే ఇంకెంత స్థాయిలో ఉత్పాతాలు జరగబోతాయో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి. ఇటువంటి వైపరీత్యాలు ఉష్ణ ప్రాంతాలలోని అభివృద్ధి చెందుతున్న దేశాలపై మాత్రమే ప్రభావం చూపుతాయని ఇంతవరకూ భావిస్తూవచ్చిన యూరప్‌ను, ఉత్తర అమెరికా ఖండాన్ని - 2021 వేసవిలో సంభవించిన పర్యావరణ వైపరీత్యాలు దిగ్భ్రమకు గురిచేశాయి. భారతదేశంలో, ఏటా వచ్చే వర్షాలు ఈ మారు విపరీతంగా కురిసి కొండచరియలు జారిపడడం, బురద ప్రవాహాలు సంభవించడం, వరదలు, పట్టణాల ముంపులు వంటివి ఎక్కువగా జరిగాయి.

**1.65:** అయితే, పర్యావరణ సంక్షోభం తీవ్రత ఏ విధంగా ఉండబోతోందో ఇంత సూటిగా గుర్తు చేసిన ఈ దుర్ఘటనలేవీ గ్లాస్గోలో జరిగిన కాప్ 26 సదస్సు వైఖరిలో గణనీయమైన మార్పు వచ్చే విధంగా ప్రభావాన్ని చూపలేకపోయాయి. 2030 నాటికి ప్రపంచ కర్బన ఉద్గారాల(ఎమిషన్స్) స్థాయి 50 శాతం తగ్గాల్సివుండగా, వాస్తవానికి అవి 16 శాతం పెరగనున్నాయి. దీనిని పరిష్కరించాల్సింది పోయి అమెరికా మొత్తం

లక్ష్యాలనే మార్చివేసింది. 2050 నాటికి ఉద్గారాలను "నికరంగా సున్నా" స్థాయికి తీసుకురావాలన్న లక్ష్యాన్ని అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలనన్నింటినీ కలగలిపి వాటి ఆమోదానికి దూకుడుగా ప్రయత్నించింది. "నికరంగా సున్నా" ఉద్గారాలు అంటే వెలువడిన ఉద్గారాలనన్నింటినీ అడవులు, సముద్రాలు పీల్చుకునేట్టు చూడడం. మరింత దీర్ఘకాలికమైన ఈ లక్ష్యం మీద అమెరికా దృష్టి కేంద్రీకరించడంతో కీలకమైన 2030 లక్ష్యం వైపు నుండి అనేక దేశాలు పక్కకుపోయాయి. అంతేకాక. పర్యావరణ రక్షణ కర్తవ్యం అన్ని దేశాలకూ ఉమ్మడిగా ఉన్నా, దానిని నెరవేర్చే బాధ్యత తరతమ తేడాలతో ఉంటుంది అన్న 'సమన్యాయ సూత్రం' (కామన్ బట్ డిఫరెన్షియేటెడ్ రెస్పాన్సిబిలిటీ– సిబిడిఆర్) దెబ్బ తింది.

**1.66:** కాప్ 26 నుండి ఇటువంటి నిరాశాజనకమైన ఫలితం వచ్చేలా చూడడానికి అమెరికా, దాని మిత్రులు ఇతర మార్గాల ద్వారా కూడా ప్రయత్నించారు. 12 సంవత్సరాల క్రితం కోపెన్‌హాగన్‌లో ప్రకటించి, అట్టహాసంగా ప్రచారం చేసుకున్న 10,000 కోట్ల డాలర్ల వార్షిక సహాయం కాస్తా ఇప్పుడు యథాలాపంగా మూడు సంవత్సరాలపాటు వాయిదా వేశారు. అభివృద్ధి చెందిన దేశాలు పర్యావరణ ప్రమాదాలకు ఎక్కువగా గురయ్యే దేశాలకు అందించాలని ప్రకటించిన సహాయం అది. అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు పర్యావరణ రక్షణ నిధులను ప్రైవేటు రంగానికి అప్పగించాలని ఒత్తిడి చేస్తున్నాయి. శిఖరాగ్ర సమావేశంలో బొగ్గు వినియోగాన్ని క్రమంగా పూర్తిగా విడనాడాలన్న హడావుడి ఎక్కువగా జరిగింది. కాని, పెట్రోలియం విషయంలో, "కొరగాని" సబ్సిడీలను రద్దు చేయాలని చాలా మెత్తగా ప్రస్తావించడం మినహా చాలావరకు మౌనమే వహించాయి. కర్బన రహిత ఆర్థిక వ్యవస్థవైపు మార్పు చెందడానికి తాము మరింత ఎక్కువ వ్యవధి తీసుకోవచ్చునని అమెరికా, దాని నాయకత్వంలోని ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు భావిస్తున్నాయని స్పష్టమవుతోంది. అదే సమయంలో ఉద్గారాలను తగ్గించే భారాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల మీద ఎక్కువగా మోపడానికి ఒత్తిడి విపరీతంగా పెంచుతున్నారు.

**1.67:** భూ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం ఉత్పత్తి శక్తుల సంక్షోభాన్ని సూచిస్తుంది. బడుగు దేశాల్లోని వందల కోట్ల ప్రజానీకపు మనుగడ ప్రమాదంలో

పడకుండా ఉండాలంటే ఈ సంక్షోభాన్ని సమన్యాయం ప్రాతిపదికన పరిష్కరించాలి. కాప్ 26 ప్రపంచ సమన్యాయం కోసం జరిగే పోరాటం తీవ్రతరం అవడానికి సంకేతంగా ఉంది. ఈ పోరాటం దీర్ఘకాలికమైనది.

## కమ్యూనిస్టుల మధ్య అంతర్జాతీయ సహకారం

**1.68:** మితవాదం వైపు మొగ్గు, ప్రతీఘాత సిద్ధాంతాల పెరుగుదల, తెగల–జాతీయ వాదాలకు (ఎథ్నో–నేషనలిజమ్స్) వ్యతిరేకంగా పోరాడడానికి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్ట్, వామపక్ష, అభ్యుదయ శక్తుల మధ్య సహకారం అవసరం. కమ్యూనిస్ట్, వర్కర్స్ పార్టీల సమావేశాలు క్రమం తప్పకుండా జరగడం అనుభవాలను పరస్పరం కలబోసుకోడానికి, ప్రధానమైన సామాజిక–ఆర్థిక సవాళ్ళను ఎదుర్కోడానికి ఒక ఉమ్మడి అవగాహనకు రావడానికి తోడ్పడతాయి. కలిసి పని చేయడానికి, పరస్పరం సహకరించుకోడానికి జరిగే ఈ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయవలసిన అవసరం ఉంది. నానాటికీ మరింత లోతుగా పెరుగుతున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో, కోవిడ్ మహమ్మారిని సైతం శ్రామిక ప్రజలమీద దాడులను మరింత పెంచడానికి ఒక సాధనంగా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న వైనాన్ని గమనించినప్పుడు ఈ ప్రయత్నాల ప్రాధాన్యత మరింత పెరిగింది.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంఘీభావాన్ని బలపరచాలి

**1.69:** అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలలో స్పందన కలిగించే విధంగా ప్రచారాన్ని సిపిఐ(ఎం) చేపడుతుంది. బిజెపి ప్రభుత్వం అన్ని విధాలా అమెరికాకు పూర్తిగా లొంగిపోవడానికి వ్యతిరేకంగా సిపిఐ(ఎం) ప్రజలను సమీకరిస్తుంది.

**1.70:** ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాను, దక్షిణాసియాలో తన వ్యూహాత్మక ప్రయోజనాలను నెరవేర్చుకోడానికి అమెరికా దూకుడుగా వ్యవహరిస్తూ, చేసుకుంటున్న జోక్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను సిపిఐ(ఎం) బలపరుస్తుంది.

**1.71:** తమ పట్ల ఇజ్రాయిల్ ప్రదర్శిస్తున్న తెంపరితనానికి వ్యతిరేకంగా,

చట్టవిరుద్ధంగా తమ భూ భాగాలను ఆక్రమించుకోడానికి వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలు సాగిస్తున్న పోరాటానికి పూర్తి సంఘీభావాన్ని సిపిఐ(ఎం) పునరుద్ఘాటిస్తోంది. పలు ఐరాస భద్రతామండలి తీర్మానాలలో ప్రకటించిన విధంగా 'తూర్పు జెరుసలేం' రాజధానిగా తమ మాతృదేశం కలిగివుండే హక్కు పాలస్తీనా విషయంలో అమలు జరగాలి.

**1.72:** పెరుగుతున్న అమెరికా– ఇజ్రాయిల్ – ఇండియా కూటమి వ్యవహారాన్ని, దానిని మరింత ముందుకు తీసుకుపోతున్న బిజెపి ప్రభుత్వ వైఖరిని సిపిఐ(ఎం) గట్టిగా వ్యతిరేకిస్తుంది.

**1.73:** చైనా, వియత్నాం, ఉత్తర కొరియా, క్యూబా, లావోస్ ఈ అన్ని సోషలిస్టు దేశాలతోను తన సంఘీభావాన్ని సిపిఐ(ఎం) ప్రకటిస్తోంది. తమ తమ దేశాల్లో, సోషలిజాన్ని బలపరచుకునే వారి ప్రయత్నాలను పూర్తిగా బలపరుస్తోంది. వాటికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదం పన్నుతున్న కుట్రలను ఓడించడానికి ఆ దేశాలు చేసే ప్రయత్నాలకు తన సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.

**1.74:** అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లాటిన్ అమెరికాలో, ముఖ్యంగా వెనిజులాలో జరుగుతున్న పోరాటాలకు సిపిఐ(ఎం) తన సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.

**1.75:** ప్రభుత్వాలు గాని, విడివిడి ముఠాలుగాని ప్రోత్సహించే అన్ని రకాల, అన్ని రూపాల ఉగ్రవాదాల పట్ల సిపిఐ(ఎం) తన గట్టి వ్యతిరేకతను కొనసాగిస్తుంది.

**1.76:** నయా ఫాసిస్టు శక్తులను, ఛాందసవాదాన్ని, మత విద్వేషాన్ని, తెగల వేర్పాటువాద ధోరణులను, మూఢ నమ్మకాలను, ప్రతీఘాత శక్తులను ఎదిరించే అన్ని శక్తుల పోరాటాల పట్ల సిపిఐ(ఎం) తన సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది.

**1.77:** ప్రపంచవ్యాప్తంగా, వామపక్ష విప్లవోద్యమాలతో తన సంబంధాలను సిపిఐ(ఎం) దృఢపరచుకుంటుంది.

**1.78:** సామ్రాజ్యవాదం మీద, అది వ్యక్తమయ్యే అన్ని రూపాలమీద, నయా

ఉదారవాదం మీద, ప్రపంచపు పర్యావరణాన్ని ప్రమాదకరంగా దిగజార్చడం మీద, విశ్వ పర్యావరణ సమన్యాయం కోసం ప్రపంచంలో జరిగే అన్ని పోరాటాలకూ సిపిఐ(ఎం) సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది.

**1.79:** సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే వివిధ తరగతుల ప్రజల పోరాటాలన్నింటినీ ఒక దగ్గరకు చేర్చేందుకు, తద్వారా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని నిర్మించేందుకు జరిగే ప్రయత్నాలకు సిపిఐ(ఎం) తన వంతు తోడ్పాటు అందించడానికి పూనుకుంటుంది.

# జాతీయ పరిస్థితి

**2.1:** పార్టీ 22వ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం అప్పటి జాతీయ రాజకీయ పరిస్థితులను ఈ విధంగా అంచనా వేసింది:

"దాదాపు నాలుగేళ్ళ మోడీ ప్రభుత్వం మితవాద, నిరంకుశ-మతతత్వ పాలనను ముందుకు తెచ్చింది. నయా ఉదారవాద విధానాలను మరింత తీవ్రంగా అమలు చేయడం, దాని పర్యవసానంగా శ్రామిక ప్రజలపై అన్ని వైపుల నుంచీ దాడులు చేయడం, దేశ లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థకు ప్రమాదం కలిగించే మైనార్టీలు, దళితులపై ఆర్ఎస్ఎస్ దాడులు, వీటితోపాటు హిందూత్వ ఎజెండాను అమలు జరిపేందుకు తీవ్ర ప్రయత్నాలు చేయడం, ఫాసిస్టు దాడులకు పాల్పడడం, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలపరచడం, దానికి జూనియర్ భాగస్వామి పాత్రను పోషించడం, నిరంకుశ పాలనకు రూపకల్పన చేస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకాలు కల్పించడం, రాజ్యాంగ సంస్థలను బలహీనపరచడం, ప్రజాతంత్ర హక్కులను నాశనం చేయటం వంటివి ఈ పాలన స్వభావంగా ఉంది. (పేరా 2.1)

**2.2:** అప్పటి నుండీ, పైన తెలిపిన మితవాద దాడి మరింత ఉధృతమౌతూవుంది. అయితే, మోడీ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ సంఖ్యలో సీట్లు, మరింత ఎక్కువ శాతం ఓట్లు గెలుచుకుని మళ్ళీ అధికారాన్ని చేపట్టిన అనంతరం ఫాసిస్టు స్వభావంగల ఆర్ఎస్ఎస్ యొక్క 'హిందుత్వ'

మతోన్మాద ఎజండాను మరింత దూకుడుగా అమలు చేయడం జరుగుతోంది. 2019 అనంతర కాలంలో, మన ముందు పరిణామాలు మన పార్టీ కార్యక్రమంలో పేర్కొన్న దానికి అనుగుణంగానే జరుగుతున్నాయి.

"భారతీయ జనతా పార్టీ విచ్ఛిన్నకర మతోన్మాద కార్యక్రమం కలిగిన అభివృద్ధి నిరోధక పార్టీ. ఇతర మతాల పట్ల ద్వేషం, అసహనం, పచ్చి జాతీయ దురభిమానం – దాని అభివృద్ధి నిరోధక సారానికి ప్రాతిపదిక. ఫాసిస్టు తరహా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మార్గదర్శకత్వంలో, ప్రాబల్యంలో పనిచేసే బి.జె.పి. అధికారంలో ఉంటే రాజ్యాధికారం, రాజ్యాంగయంత్రం ఆర్.ఎస్.ఎస్.కు అందుబాటులోకి వస్తాయి. 'హిందూత్వ సిద్ధాంతం, హిందూ రాష్ట్ర స్థాపన' లక్ష్యంతో పునరుద్ధరణ వాదాన్ని పెంపొందిస్తోంది. భారతదేశ మిశ్రమ సంస్కృతిని తోసిపుచ్చుతుంది. (పార్టీ కార్యక్రమం పేరా 7.14 నుంచి)

"మతోన్మాద, ఫాసిస్టు ఆర్.ఎస్.ఎస్. నాయకత్వంలోని కూటమి పెరుగుదల వల్ల, కేంద్రంలో అది అధికారం చేపట్టడం వల్ల లౌకిక పునాదులకు ముప్పు భయానకంగా పెరిగింది. రాజ్యాంగయంత్రం, పాలనా యంత్రాంగం, విద్యా వ్యవస్థ, మీడియా సంస్థలన్నింటినీ మతతత్వపూరితం చేసేందుకు పథకం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మెజారిటీ మతోన్మాదం పెరుగుదల మైనారిటీ మతోన్మాద శక్తుల పెరుగుదలకు దారితీసి జాతీయ సమైక్యతకు ప్రమాదం తెస్తుంది. బి.జె.పి.కి, దాని మతతత్వ కార్యక్రమానికి, బడా బూర్జువా వర్గంలోని కొన్ని సెక్షన్లు మద్దతునివ్వడం; దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వంపై తీవ్ర పర్యవసానాలకు దారి తీస్తుంది." (పార్టీ కార్యక్రమం పేరా 5.7 నుంచి)

"జాతి ఆర్థిక, రాజకీయ పాలనా జీవితంలో మతం చొరబాటు ఏ రూపంలో ఉన్నా అందుకు వ్యతిరేకంగా పార్టీ పోరాడుతుంది. సంస్కృతి, విద్యా రంగాలలో సమాజంలో లౌకిక, ప్రజాస్వామ్య సూత్రాలను నిలబెడుతుంది. మతతత్వం ప్రాతిపదికన ఫాసిస్టు ధోరణులు బలం పుంజుకునే ప్రమాదాన్ని అన్ని స్థాయిల్లో తీవ్రంగా ఎదుర్కోవాలి." (పార్టీ కార్యక్రమం పేరా 5.8 నుంచి)

**2.3:** మతోన్మాదం, తీవ్ర జాతీయ దురభిమానం ప్రాతిపదికన తన ప్రచారాన్ని

రచించడంలో బిజెపి విజయం పొందింది. ప్రజల జీవనోపాధి సమస్యలపైన, ఆ కాలంలో పెరుగుతున్న ప్రజాపోరాటాలపైన ఎన్నికల్లో చర్చ జరగకుండా పక్కకు మళ్ళించడంలో జయప్రదం అయింది. ఇందుకోసం పుల్వామా ఉగ్రవాద దాడి ఘటనను, తదనంతరం జరిగిన బాలాకోట్ వైమానిక దాడులను ఉపయోగించుకుంది.

**2.4:** సామాజిక–తెగల తేడాలను గణనీయమైన మేరకు అధిగమిస్తూ, ఎక్కువ ప్రభావం చూపగల "హిందూ అస్థిత్వాన్ని" సృష్టించడంలో బిజెపి జయప్రదం అయింది. దానికి, సూక్ష్మ స్థాయిలో కులాల ప్రాతిపదికన సమీకరణలు తోడయ్యాయి. భారీగా ధనబలాన్ని, మీడియాపై, సోషల్ మీడియాపై అదుపును ఉపయోగించి; బిజెపి ఎన్నికల ఫలితాలను ఆర్ఎస్ఎస్ గణనీయంగా ప్రభావితం చేయగలిగింది. 'ఎన్నికల బాండ్లు' తో సహా పలు మార్గాలలో బిజెపి తన ధన బలాన్ని పెంచుకుంది. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగడానికి కావలసిన 'సమాన ప్రాతిపదిక' నిరాకరించబడింది.

**2.5:** భారతదేశంలో రాజకీయాలు మరింతగా మితవాదం వైపు మొగ్గుతున్నట్లు, ఫాసిస్టు తరహా ధోరణులు పెరుగుతున్నట్లు 2019 ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి.

## 2019 అనంతర బిజెపి ప్రభుత్వం

**2.6:** రెండోసారి అధికారం చేపట్టగానే, బిజెపి ప్రభుత్వం జమ్ము, కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసింది. రాజ్యాంగంలో జమ్ము, కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన 370, 35–ఎ అధికరణలను రద్దు చేసింది. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పరచింది. జమ్ము, కాశ్మీర్ రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగినా, అప్పటికి అధ్యక్ష పాలనలో ఉన్న ఆ రాష్ట్రంలో అసెంబ్లీకి ఎన్నికలు జరగలేదు. ఈ పరిస్థితి, పార్లమెంటులో బిజెపి కుటిల వ్యూహం అమలు జరిగేందుకు వీలు కల్పించింది. అసెంబ్లీకి ఎన్నికలు జరగనందువలన, ఎన్నికైన అసెంబ్లీ ఆమోదానికి బదులు, గవర్నర్ ఆమోదంతో సరిపెట్టారు.

**2.7:** దీని తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) చేసింది. జాతీయ జనాభా రిజిస్టరు(ఎన్‌పిఆర్) తయారు చేయడంతోబాటు జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌సిఆర్) కూడా తయారు చేయనున్నట్లు ప్రకటించారు. ఇది

పచ్చి రాజ్యాంగ వ్యతిరేక చర్య. రాజ్యాంగం పౌరసత్వానికి, మతానికి ముడిపెట్ట లేదు. కాని సిఎఎ, ఇతర మతాలవారికి పౌరసత్వమిచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తూ, ముస్లిం మతస్థులను మాత్రమే మినహాయించింది. ఈ అడ్డగోలు రాజ్యాంగ వ్యతిరేక చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు సుప్రీం కోర్టులో గత మూడేళ్ళుగా పెండింగులో ఉన్నాయి.

**2.8:** భారత రిపబ్లిక్ స్వభావాన్ని మార్చివేయడానికి ఒక పథకం ప్రకారం ప్రయత్నాలు సాగుతున్నాయి. లౌకిక ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన అనే నాలుగు రాజ్యాంగపు మూల స్థంభాలపై నేడు దాడి జరుగుతోంది.

## ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడం

**2.9** 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత నయా–ఉదారవాద సంస్కరణల అమలు మరింత వేగం పుంజుకుంది. ఆర్థిక సార్వభౌమత్వాన్ని ధ్వంసం చేయడం బహువిధాలుగా మొదలైంది. ఇది సాధారణ ప్రైవేటీకరణ, కార్పొరేట్లకు పన్ను రాయితీలు లాంటి వాటిని మించిపోయింది. ఆర్థిక స్వావలంబనకు ఆధారంగా నిలిచిన ప్రభుత్వరంగాన్ని ప్రత్యేకించి రక్షణ రంగంలో దెబ్బతీయడం కొనసాగుతున్నది. ఇదంతా కూడ భారత ఆర్థికరంగాన్ని పరాధీన స్థాయికి దిగజార్చే ప్రమాదకర బాట పట్టింది.

**2.10** జాతీయ సంపదను, ఆర్థిక వ్యవస్థను లూటీ చేయడం, ధ్వంసం చేయడం తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నది. కోట్లాది ప్రజల జీవన భృతి నిర్మూలించబడుతున్నది. ఆర్థిక వ్యవస్థ శాశ్వత మందగమనంలోకి, సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్నది.

**2.11** **ఆర్థిక మాంద్యం:** మహమ్మారికంటే ముందుగానే మందగమనంలోకి జారుకున్న ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఆర్థిక మాంద్యంలోకి నెట్టివేయబడింది. 2020–21 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో ఆర్థికాభివృద్ధి 16 శాతం దిగజారింది. ఈ ఆర్థిక సంవత్సరం (2021–22) మొదటి అర్ధ భాగంలో ఆర్థిక వ్యవస్థ 14 శాతం పుంజుకుంది. అంటే ఆర్థిక

వ్యవస్థ నేటికీ మహమ్మారి ముందరి స్థాయికి చేరుకోలేదు. మహమ్మారి ముందరి సంవత్సరం 2019-20లో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) రు.71,28,238 కోట్లు ఉంటే, 2021-22 నాటికి అది రు. 68,11,471 కోట్లకు అంటే 4.4 శాతం పడిపోయింది.

**2.12** భారత దేశం తన ఆర్థిక ప్రాతిపదికను కోల్పోతున్నది. 2017-18 చివరి త్రైమాసిక నుండి 2019-20 చివరి త్రైమాసిక వరకు ఈ తొమ్మిది త్రైమాసికల్లో ఆర్థిక పెరుగుదల రేటు 8.2 శాతం నుండి 3.1 శాతానికి తీవ్రంగా పడిపోయింది.

**2.13** మహమ్మారికి ముందు ఆర్థిక పెరుగుదల పడిపోవడానికి మధ్యకాలిక, స్వల్పకాలిక అంశాలు రెండూ కారణం. మధ్యకాలిక అంశాలలో రెండు బాగా కనిపిస్తాయి. ఒకటి, ఆర్థిక పెరుగుదలను ముందుకు నెట్టడానికి ప్రభుత్వం తన వద్ద ఉన్న ద్రవ్య వెసులుబాటును వినియోగించడానికి నిరాకరించడం. ప్రైవేటు పెట్టుబడిదారులను ప్రోత్సహించేందుకు పన్ను 'సంస్కరణ' చేపట్టడం ప్రభుత్వ నయా-ఉదారవాద ద్రవ్యవిధానంలో భాగం. ఇది పన్ను ఆదాయాలు స్తంభించిపోవడానికి, లేదా క్షీణించడానికి దారితీసింది. అయినప్పటికీ, ఫైనాన్స్ పెట్టుబడిని సంతృప్తి పరచడానికి ద్రవ్య లోటు అదుపులో ఉంచబడింది. దీని ఫలితం ద్రవ్య ఉద్దీపన బలహీనపడటం, లేదా లేకుండాపోవడం.

**2.14** ఫలితంగా ఏర్పడిన **ప్రభుత్వ వ్యయ తగ్గింపు** జిడిపి మందగమనాన్ని మరింత క్షీణింపచేసింది. 2020-21 మొదటి అర్ధ భాగంలో 19 శాతం పడిపోయిన ప్రైవేటు తుది వినియోగం, 2021-22 మొదటి అర్ధ భాగంలో 14 శాతం మాత్రమే పెరిగింది. 2020-21లో 28 శాతం పడిపోయిన స్థూల పెట్టుబడి సమీకరణ తిరిగి అప్పటి స్థాయికి మాత్రమే చేరుకుంది. దీనంతటికీ వెనుక ఉన్నది 2020-21లో 6 శాతం పడిపోయిన ప్రభుత్వ వ్యయం, 2021-22 మొదటి అర్ధ భాగంలో 1 శాతం మాత్రమే పెరగడం.

**2.15** 2020-21లో మహమ్మారి తారా స్థాయిలో ఉన్నపుడు ప్రభుత్వం తన ఆరోగ్య రంగ వ్యయాన్ని పెంచాల్సి ఉండింది. ఈ అంటు వ్యాధి బారినపడ్డవారికి, లాక్‌డౌన్‌లో దెబ్బతిన్నవారికి నేరుగా నగదు సహాయం అందించవలసి ఉంది. ఆర్థిక మెరుగుదల వేగం పుంజుకునేలా చేయడానికి ప్రభుత్వం చొరవతో కూడిన క్రియాశీల ద్రవ్య విధానాన్ని

అనుసరించాల్సి ఉంది. కాని 2021-22 బడ్జెట్ మాత్రం ప్రభుత్వ ద్రవ్య సనాతనత్వ కొనసాగింపునే ప్రతిబింబించింది. జిడిపి 14.4 శాతం పెరుగుతుందని అంచనా వేస్తూ, ప్రభుత్వ వ్యయం మాత్రం 9.5 శాతం మాత్రమే పెంచబడింది.

**2.16** దీని భారం వ్యవసాయరంగానికి, గ్రామీణ రంగానికి కేటాయింపులపైన, సామాజిక సేవలకు, సామాజిక భద్రతకు కేటాయింపులపైన అసమానంగా పడింది. పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ, వాటాల విక్రయం జరిగినప్పటికీ ఉపాధి పథకాలకు, ఐసిడిఎస్‌కు, ఆహార భద్రతకు, విద్య, వైద్యానికి వాగ్దానం చేసిన దానికన్నా తక్కువ కేటాయింపులు చేయబడినాయి. ఇది పేద ప్రజల కష్టాలు పెరగడానికి, బ్రతుకులు మరింత దుర్భరం కావడానికి దారి తీసింది.

**2.17** **వ్యవసాయ రంగ దుస్థితి:** అతి దారుణంగా దెబ్బతిన్నది వ్యవసాయ రంగం. ఇది ఉత్పత్తి స్థాయి స్వల్పంగా ఉండటం మూలంగా కాదు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పడిపోవడం వల్లనే ఈ పరిస్థితి. ఇలా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడానికి కారణం, గిరాకీ తగినంతగా ఉండకపోవడం, గిట్టుబాటు కాని కనీస మద్దతు ధరలు, ఇలాంటి తగ్గిన కనీస ధరల ప్రకారం అయినా సేకరణ తగినంతగా లేకపోవడం. దీనితో పాటు, సంస్కరణల్లో భాగంగా యూజర్ చార్జీలు పెరిగిపోవడం, అనేక వ్యవసాయ ఇన్‌పుట్లపై సబ్సిడీలు తగ్గించడం ఉత్పత్తి ఖర్చు పెరిగిపోవడానికి దారి తీసింది. ఫలితంగా వ్యవసాయరంగం గిట్టుబాటు కాకుండా పోయింది. గ్రామీణ రుణ భారం కొండలా పెరిగిపోయింది. అది రైతుల ఆత్మహత్యలకు దారితీసింది. ఈ నేపథ్యంలో రైతాంగ నిరసనలు విస్తృతమయ్యాయి.

**2.18** **ప్రజలపై మరిన్ని భారాలు:** ఈ పరిస్థితిలో పేదలను ఆదుకునేందుకు ఉద్దేశించబడిన వ్యయం తగ్గించబడింది. గ్రామీణ ఉపాధి పథకానికి 2020-21 లో బడ్జెట్‌లో కేటాయించింది రు. 61,500 కోట్లు, సవరించిన అంచనా ప్రకారం రు. 1,10,000 కోట్లు. 2019-20లో వాస్తవంగా ఖర్చు చేసింది రు. 71,687 కోట్లు. శ్రామికులకు జీవన భృతి లేకుండా పోవడం, వలస కార్మికులు కూడ గ్రామీణ ప్రాంతాలకు చేరుకోవడంతో ఈ పథకానికి డిమాండు అధికం కావడంతో కేటాయింపులు

పెంచబడినాయి. కాని మహమ్మారి దుష్ప్రభావాలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ 2021-22 బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయించింది రు. 73,000 కోట్లు మాత్రమే. ఉపాధి పనులకు డిమాండు అధికమైతే కేటాయించినదానికన్నా ఎక్కువ ఖర్చుపెట్టబడుతుందని వాగ్దానం చేయబడింది. డిసెంబరు మొదటికే బడ్జెట్‌లో కేటాయించబడిన నిధులు ఖర్చుయిపోయాయి. వాస్తవానికి 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమకు కేటాయించిన దానికి మించి ఖర్చుపెట్టాయి. కానీ 2021 డిసెంబరులో అదనపు గ్రాంట్ల కోసం సప్లిమెంటరీ డిమాండ్ ద్వారా కేటాయించింది కేవలం రు. 25,000 కోట్లు మాత్రమే. కానీ అవసరమైన మొత్తం దీనికి రెట్టింపు ఉంటుంది.

**2.19** నిరుద్యోగం, దారిద్ర్యం, **ఆర్థిక అసమానతలు** ఆందోళనకరమైన రీతిలో పెరిగాయి. అయినప్పటికీ ఆర్థిక మందగమనం పట్ల ప్రభుత్వం స్పందించిన తీరు ఆదాయం, సంపదలలో అసమానతలు మరింత పెరగడానికే కారణమైంది. ఇదే సమయంలో బడా ఆశ్రిత కార్పొరేట్ గ్రూపులు తీసుకున్న పారు బకాయిలు పెద్ద పెద్ద మొత్తాలలో రద్దు చేయబడినాయి. బ్యాంకులకు పన్ను చెల్లింపుదార్ల డబ్బు నుండి పునఃపెట్టుబడి సమకూర్చబడింది. బకాయి పడ్డ వాణిజ్య గ్రూపులకు ఇలాంటి వరాలు కొనసాగించబడుతూనే ఉన్నాయి. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడు సంవత్సరాలలో రు. 10.72 కోట్ల బడా కార్పొరేట్ల రుణాలు రద్దుచేయబడినాయి. దివాళా కోడ్ ప్రొసీజర్ల ద్వారా ఉద్దేశపూర్వక రుణబకాయిలు చట్టబద్ధం చేయబడినాయి.

**2.20** ఇది కాకుండా, 13 కంపెనీలు తీసుకున్న రు. 4.5 లక్షల కోట్ల రుణాలు 'భారీ తగ్గింపు'లతో 'సెటిల్' చేయబడినాయి. రు. 4.5 లక్షల కోట్లకు గాను రు. 1.61 లక్షల కోట్లు తీసుకోబడినాయి. ఈ విధంగా బ్యాంకులు రు. 2.85 లక్షల కోట్లు నష్టపోయాయి. ఇలా ఆశ్రిత పెట్టుబడిదారులకు సమర్పించడానికి బ్యాంకులలో ప్రజలు పొదుపు చేసుకున్న మొత్తాలు వినియోగించబడినాయి.

**2.21** ఇవి కాకుండా కార్పొరేట్లకు అనేక పన్ను రాయితీలు కల్పించబడినాయి. ఫలితంగా 2018-19లో రు. 11.36 లక్షల కోట్లు ఉన్న ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు 2019-20 చివరి నాటికి రు10.49 లక్షల కోట్లకు

అంటే 8 శాతం తగ్గిపోయాయి. గిరాకీ మాంద్య పరిస్థితులలో ఇలాంటి తగ్గుదల 2019 సెప్టెంబరులో ప్రకటించబడిన పన్ను రాయితీల మూలంగా జరిగింది.

**2.22** ఇలాంటి **'ఉద్దీపన',** పన్ను ప్రోత్సాహకాలను, మినహాయింపులను వినియోగించుకోని దేశీయ కంపెనీల కార్పొరేట్ పన్ను రేటును 30 శాతం నుండి భారీగా 22 శాతానికి తగ్గించింది. 2019 అక్టోబరు 1న, ఆ తర్వాత స్థాపించబడిన దేశీయ తయారీ కంపెనీలు ప్రోత్సాహకాలను గానీ, మినహాయింపులను గాని వినియోగించుకోనంత వరకు 15 శాతం కార్పొరేట్ పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ప్రోత్సాహకాలు, మినహాయింపులు వినియోగించుకునే కంపెనీలకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (ఎంఏటి) 18.5 శాతం నుండి 15 శాతానికి తగ్గించబడింది. కార్పొరేట్లకు ఇలాంటి భారీ వరాల మూలంగా ప్రత్యక్ష పన్నుల పెరుగుదల నిలిచిపోయింది.

**2.22** **కార్పొరేట్, మతోన్మాద బంధం:** మోడీ పాలనా కాలంలో కొట్టొచ్చినట్లు కనిపించే ఒక లక్షణం కొన్ని ఎంపిక చేయబడిన బడా కార్పొరేట్లు, రాజ్యం మిలాఖత్ అవడం.

**2.24** ఈ బంధం యొక్క ఫలితం శిఖరాగ్రాన ఉన్న అతి కొద్ది మందికి ఆదాయాలు బదిలీకావడం. 'ది ఎకానమిస్ట్' అంచనా ప్రకారం ముఖేష్ అంబానీ నికర సంపద 2016-20 మధ్య కాలంలో 350 శాతం పెరిగింది. ఇదే సమయంలో గౌతం ఆదాని నికర సంపద 750 శాతం పెరిగింది. 2020-21లో ముఖేష్ అంబానీ నికర సంపద రు.7.18 లక్షల కోట్లు, గౌతం ఆదాని నికర సంపద రు.5.06 లక్షల కోట్లు. ఈ కాలంలో ఇతర శతకోటీశ్వరుల, వారి కుటుంబాల సంపద కూడ బాగా పెరిగింది. ఆక్స్‌ఫాం ఇండియా అంచనా ప్రకారం శిఖరాగ్రాన ఉన్న పది మంది దేశ సంపదలో 57 శాతాన్ని అదుపు చేస్తున్నాయి. క్రింది స్థాయి సగం మంది ఆదాయాలు 13 శాతం మాత్రమే.

**2.25** **జాతి సంపద లూటీ:** కేంద్రం చేపట్టిన ఈ కొద్ది వ్యయం కూడ దేశ సంపదను విక్రయించడం ద్వారానే జరుగుతున్నది. నూతన పెట్టుబడులు ప్రధానంగా రెండు మార్గాల ద్వారా జరుగుతున్నాయి. అవి, ప్రభుత్వరంగ

వాటాలను విక్రయించడం, లేదా నగదీకరణ లేదా జాతి ఆస్తులను విక్రయించడం. ఇలా ఆస్తులను అమ్మివేయడం రెవిన్యూను పెంచుకోవడానికి అనే దాన్ని అభిమానపాత్రమైన కార్పొరేట్ సంస్థలకు విలువైన ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కట్టబెట్టడానికి సాకుగా వినియోగించుకుంటున్నారు. 2021–22లో వాటాల విక్రయం ద్వారా రు. 1.75 లక్షల కోట్లు అంచనా నిర్ణయించుకోవడంతో, కొన్ని అత్యుత్తమమైన ప్రభుత్వ రంగ సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు విక్రయానికి సిద్ధం చేయబడినాయి. ఇక్కడ మూడు అంశాలున్నాయి: వాటాలను విక్రయించడం, అత్యధిక వాటాలను అమ్మివేయడం, ప్రభుత్వరంగ ఫైనాన్స్ సంస్థలను ప్రైవేటీకరించడం. ఎల్ఐసిలో వాటాల విక్రయంతో పాటు ప్రభుత్వరంగ బ్యాంకులను, జిఐసిని ప్రైవేటీకరించడం. 'ప్రభుత్వ ఆస్తులను 'నగదీకరించడం' దీనికి తోడైంది. జాతీయ నగదీకరణ పథకం రు.6 లక్షల కోట్ల విలువైన భూమిని, రైలు మార్గాలను, రైల్వే స్టేషన్లను, విమానాశ్రయాలు, ఓడరేవులను, ఇంధన పైప్‌లైన్లను, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించడానికి ప్రతిపాదించింది. పెట్టుబడి వ్యయాన్ని పెంచడానికి పన్నులను పెంచడానికి బదులు ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకున్నది.

**2.26** మోడీ ప్రభుత్వం నయా–ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేయడం వల్లనే ఆర్థిక మాంద్యం అని స్పష్టమవుతున్నది. మహమ్మారి, లాక్‌డౌన్‌లు పరిస్థితిని మరింత అధ్వాన్నం మాత్రమే చేశాయి.

## కోవిడ్‌ను ఎదుర్కొనడంలో నేరపూరిత తప్పిదం

2.27 కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనడంలో మోడీ ప్రభుత్వం నేరపూరితంగా వ్యవహరించింది. అది అనుసరించిన అశాస్త్రీయ తప్పుడు పద్ధతి ప్రజల కోవిడ్ కష్టాలను పెంచింది, మరణాలను అధికం చేసింది. 2020 మార్చిలో ఒక ప్రణాళిక లేకుండా, హడావిడిగా ప్రకటించిన పూర్తి లాక్‌డౌన్ ఆర్థిక జీవనాన్ని విచ్ఛిన్నం చేసింది. లక్షలాది వలస కార్మికులు తమ స్వగ్రామాలకు వందల మైళ్లు కాలినడకన వెళ్ళాల్సి వచ్చింది. వ్యాక్సిన్‌లను పెద్ద ఎత్తున సేకరించడానికి, ఉత్పత్తి చేయడానికి సన్నాహాలు చేయకపోవడంతో వ్యాక్సిన్ కొరత ఏర్పడింది. ప్రభుత్వరంగ ఔషధ

కంపెనీలు వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం అనుమతించలేదు. జనవరి 2021న కోవిడ్‌పై విజయం సాధించామని ప్రభుత్వం తప్పుడు ప్రకటన చేసింది. ఆ విధంగా దేశప్రజానీకానికి 2021 మార్చిలో వచ్చిన రెండవ వేవ్ సమయంలో రక్షణ లేకుండా చేసింది. ఆక్సిజన్ కొరత, బెడ్ల కొరత మూలంగా లక్షలాది మంది చనిపోయారు. ఈ మరణాల్లో చాల నమోదు కూడ కాలేదు. గంగా నదిలో శవాలు తేలియాడటమే ఈ ఘోరకలికి, మోడీ ప్రభుత్వం కోవిడ్ పట్ల వ్యవహరించిన నేరపూరిత తీరుకు దృష్టాంతం.

**2.28** దుస్థితిలో ఉన్న ప్రజానీకాన్ని ఆదుకోవడానికి నగదు సబ్సిడీలు అందించడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ప్రకటించిన ద్రవ్య ఉద్దీపన కూడ జి-20 దేశాలన్నింటిలోకి అత్యల్పం. దీనిలో ప్రభుత్వ వ్యయం అతిస్వల్పంగా ఉంది. మొత్తంగా ఈ ప్రజారోగ్య అత్యవసర సమయంలో వ్యవహరించిన తీరులో మోడీ ప్రభుత్వం తన నేరపూరిత, అమానుష స్వభావాన్ని బయటపెట్టుకుంది.

## ప్రజల జీవనం మీద, జీవన భృతి మీద దాడులు

**2.29** ప్రజల జీవన భృతులను దెబ్బతీయడం మహమ్మారి కంటే చాల ముందుగానే మొదలైంది. ఆ దాడులను తీవ్రతరం చేయడానికి మహమ్మారి వినియోగించుకోబడింది. ఫలితంగా జీవనభృతులను దెబ్బతీయడం మరింత పెరిగిపోయింది.

**2.30** **పెరుగుతున్న దారిద్ర్యం:** మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి భారతదేశంలో పేదలను లెక్కించడం నిలిచిపోయింది. ప్రపంచ బ్యాంకు లెక్కల ఆధారంగా (తలసరి దినసరి ఆదాయం 2 డాలర్లు, లేదా దానికి సమానమైన కొనుగోలు శక్తి) పిఇడబ్ల్యు పరిశోధనా కేంద్రం భారత దేశంలో పేదల సంఖ్యను అంచనా వేసింది. ఈ అంచనాల ప్రకారం మహమ్మారికి ముందు సంవత్సరంలో భారత దేశంలో పెరిగిన పేదల సంఖ్య 6 కోట్లు ఉంటే, మహమ్మారి కారణంగా ఉధృతమైన ఆర్థిక మాంద్య సంవత్సరంలో ఒక్కసారిగా రెట్టింపుకు పైగా 13.6 కోట్లకు పెరిగింది. అంటే భారత దేశం 45 సంవత్సరాల తర్వాత 'విస్తృత పేదరిక దేశ' ఘనతను మళ్ళీ సాధించింది.

**2.31** అంతేకాకుండా, 2021 ముగిసే నాటికి 15 కోట్ల నుండి 19.9 కోట్ల వరకు అదనంగా పేదరికంలోకి దిగజారిపోతారని అంచనా. మహమ్మారి సమయంలో మొత్తం ప్రపంచం మీద పేదరికంలోకి దిగిజారిన జనాభాలో ఒక్క భారత దేశంలోనే 60 శాతం మంది ఉన్నారు. నీతి ఆయోగ్ బహుముఖ పేదరిక సూచీ అంచనాల ప్రకారం బీహారు జనాభాలో 51.91 శాతం మంది పేదరికంలో ఉన్నారు. దాని తర్వాతి స్థానాలను వరుసగా జార్ఖండ్ (42.16 శాతం), ఉత్తర ప్రదేశ్ (37.79 శాతం), మధ్య ప్రదేశ్ (36.65 శాతం), మేఘాలయ, అస్సాం రెండూ (32.67 శాతం) ఆక్రమించాయి.

**2.32** **పెరిగిపోతున్న నిరుద్యోగం:** 2021 నవంబరు ఒక్క మాసంలోనే 68 లక్షల మంది వేతన జీవులు ఉద్యోగాలు కోల్పోయారు. భారత దేశపు పట్టణ ప్రాంతాలలో దాదాపు 9 కోట్ల మంది నిరుద్యోగులున్నారు. పట్టణ ప్రాంతాల యువతలో 23 శాతం మంది నిరుద్యోగులే.

**2.33** భారతీయులలో ఉద్యోగాలున్న వారి సంఖ్య 2013లో 44 కోట్లు ఉంటే, 2016 నాటికి అది 41 కోట్లకు తగ్గిపోయింది. 2017 నాటికి 40 కోట్లకు తగ్గగా, 2021 నాటికి మరింతగా 38 కోట్లకు పడిపోయింది. అయితే ఇదే సమయంలో పనిచేయగలిగిన వారి సంఖ్య 79 కోట్ల నుండి 106 కోట్లకు పెరిగిపోయింది. పని దొరకదని నిర్ణయించుకున్న కోట్లాది మంది పనిని వెతకడం ఆపివేసి, తిరిగి గ్రామాల బాట పట్టారు. లాక్‌డౌన్ మూలంగాను, మూసివేతల మూలంగాను బ్రతికేందుకు గ్రామాల బాటపట్టిన వలస కార్మికులు అందరికన్నా ఎక్కువ కష్టాలను అనుభవించారు. శ్రామికుల భాగస్వామ్య రేటు మహమ్మారికి ముందు 43 శాతం ఉంటే, తర్వాత 40 శాతానికి పడిపోయింది. యుఎన్‌డిపి లెక్కల ప్రకారం శ్రామిక శక్తిలో మహిళలు 2013లో 36 శాతం ఉంటే, 2016 నాటికి 23 శాతానికి పడిపోయింది. మహమ్మారి, లాక్‌డౌన్‌లకు ముందు ఇది మరింతగా 18 శాతానికి పడిపోయింది. 2021 ఫిబ్రవరిలో ఇది కేవలం 9.24 శాతం మాత్రమే.

**2.34** **పెరిగిపోతున్న ఆకలి:** 2021 ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం 116 దేశాలలో భారత్ స్థానం 101. గత ఏడాది స్థానం 94. భారత దేశం

నేడు 'తీవ్రస్థాయిలో ఆకలి కలిగిన' దేశాలలో చేరింది. ఎత్తుకు తగిన బరువు కన్నా తక్కువ బరువు కలిగిన బాలలు అత్యధిక సంఖ్యలో నున్న దేశాలలో భారత్ చేరింది. మన దేశంలో బాలలలో పౌష్టికాహార లోపం, శిశుమరణాల రేటు ఆందోళనకర స్థాయిలో పెరుతున్నదని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే- 5 తేల్చింది. అయినప్పటికీ, మధ్యాహ్న భోజన పథకానికి కేటాయించే నామమాత్రపు మొత్తాలు సైతం 2014-2021 మధ్య కాలంలో దారుణంగా 32.3 శాతం తగ్గించబడినాయి. దీన్నంతటినీ మించి, మహమ్మారి కాలంలో మధ్యాహ్న భోజనపథకాన్ని ఉపసంహరించుకున్నారు. ఐసిడిఎస్‌కు కేటాయించిన నిధులలో 2018-19లో 44 శాతం మాత్రమే ఖర్చుపెట్టబడినాయి. 40 కోట్ల మంది అర్హులైన ప్రజానీకం ప్రజాపంపిణీ వెలుపల ఉంచబడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేయబడుతున్నది.

**2.35** **నడ్డి విరిచే ధరల పెరుగుదల:** కోవిడ్ సమయం అంతటిలోనూ ప్రజలు విపరీతమైన కష్టాల్లో ఉండగానే, పెట్రోలు, డీజిల్ ధరలు దాదాపు ప్రతి రోజు పెంచబడినాయి. పెట్రోలు, డీజిల్ ధరలు ఇంతకు ముందెన్నడూ లేనంతగా లీటరు రు.100కు చేరుకునేంత వరకు పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజ్ పన్నులను, సర్‌చార్జీలను, సెస్సులను ప్రభుత్వం పెంచుతూనే ఉంది. 2016-21 మధ్య కాలంలో దీని మూలంగా రు.8.02 లక్షల కోట్ల భారీ మొత్తం ప్రభుత్వానికి జమ అయిందని ఆర్థిక మంత్రి పార్లమెంటుకు తెలియచేశారు. చివరికి ప్రజా ఒత్తిడి మూలంగా నవంబరు 2021లో పెట్రోలు, డీజిల్‌పై సుంకాలు స్వల్పంగా తగ్గించబడినాయి. అయినప్పటికీ ఇదేమీ పెరిగిపోతున్న వాటి ధరలను నివారించలేకపోయింది. పెట్రోలియం ఉత్పత్తులపై సర్‌చార్జీలను, సెస్సులను కేంద్రం రద్దు చేయాలి, పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలను తగ్గించాలి.

**2.36** ఇదే సమయంలో వంటగ్యాస్ సిలిండర్ ధరలు రు.900 నుండి రు.1000 వరకు దారుణంగా పెంచబడినాయి. 2021 జనవరి నుండి సబ్సిడీమీద సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ ధరలు రు.205 పెంచబడినాయి. వంట గ్యాస్‌కు సబ్సిడీ చెల్లించడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. పైపుల ద్వారా సరఫరా చేసే గ్యాస్, సిఎన్‌జి గ్యాస్ ధరలు కూడ పెంచబడినాయి.

**2.37** ఈ విధంగా ఇంధన ధరల పెరుగుదల మూలంగా రవాణా, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణ పెరుగుదల వలయం ఆరంభమైంది. నవంబరు 2021లో టోకు ధరల సూచీ గత 30 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. ఆహారం, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు గత 12 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయి.

### లౌకికతత్వంపై దాడి

**2.38** మన రాజ్యాంగంలో పొందుపరచబడిన లౌకిక సూత్రాలు తీవ్రమైన దాడికి గురవుతున్నాయి. జాతీయ టెలివిజన్ ప్రసారాల్లోనూ, ఎన్ఆర్ఐలకు అందించబడిన ప్రసారాల్లోనూ అయోధ్యలో ఆలయ నిర్మాణ ఆరంభం, కాశీ విశ్వనాథ్ గంగా కారిడార్ పథకం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలుగా చూపించబడినాయి. ప్రభుత్వం ఎలాంటి మత కార్యకలాపాలకైనా దూరంగా ఉండాలన్న సూత్రానికి పూర్తిగా తిలోదకాలివ్వబడ్డాయి. మోడీ ప్రభుత్వం భారతదేశాన్ని హిందూత్వ రాజ్యం దిశగా తీసుకువెళుతున్నదన్న వాస్తవాన్ని ఇది సూచిస్తున్నది.

**2.39** బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ముస్లిములు లక్ష్యంగా విద్వేష, దౌర్జన్య పూరిత దారుణమైన ప్రచారం, దాడి కొనసాగుతున్నది. మతోన్మాద దాడుల కొనసాగింపునకు సాయుధ గుంపులను ప్రోత్సహిస్తున్నారు. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన మతోన్మాద హింసాకాండ ముందస్తు ప్రణాళికతో జరిగిన సంఘటిత దాడి. ఈ దాడులకు పాల్పడిన వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. కేంద్ర మంత్రులతో సహా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినవారిపైన ఎలాంటి చర్య తీసుకోలేదు. ఈ హింసాకాండకు గురైన వారికి న్యాయం చేయడానికి బదులు, వారిపైనే కేసులు బనాయించి విచారణ చేపట్టారు. హరిద్వార్‌లో ధర్మ సంసద్ పేరుతో జరిగిన దానిలో ముస్లిములపై పెద్ద ఎత్తున దాడులకు పాల్పడాలని విభ్రాంతికరంగా పిలుపునిచ్చారు.

**2.40** మత విభజనను తీవ్రతరం చేసే లక్ష్యంతో బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తెస్తున్నాయి. బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు గోవధను, ఇతర

పశువుల వధను పూర్తిగా నిషేధిస్తూ వరుసగా చట్టాలను తీసుకు వచ్చాయి. పశువుల వాణిజ్యం, మాంస వాణిజ్యంలో ఉన్న ముస్లిములను దెబ్బతీసే ఉద్దేశంతో ఈ చట్టాలు తెచ్చాయి. దీని తర్వాత మత మార్పిడులను నిరోధించాలని, 'లవ్ జీహాద్'ను అడ్డుకోవాలని ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో, ఇటీవల తాజాగా కర్ణాటకలో చట్టాలు తెచ్చాయి.

**2.41** ఈ చట్టాలను మైనారిటీలలో అమాయకులను లక్ష్యంగా చేసుకొని వినియోగిస్తున్నారు. వారిపై భౌతికంగా దాడులు చేయడానికి, కేసులు బనాయించి విచారణలు చేపట్టడానికి వినియోగిస్తున్నారు. అతి బలహీనమైన ఆరోపణలతో రాజద్రోహం కేసులు బనాయిస్తున్నారు. విద్వేష, దౌర్జన్య ప్రచారాలు సర్వసాధారణంగా మారాయి. వాటికి చట్టపరమైన అనుమతి కూడ లభిస్తున్నది.

## పెరిగిపోతున్న నియంతృత్వం

**2.42** **ప్రజాతంత్ర హక్కులు, పౌర హక్కులు :** సరైన అభియోగాలు మోపకుండానే ఉపా/ రాజద్రోహం/నాసా చట్టాలను వందలాది మందిని నిర్బంధించడానికి విచక్షణారహితంగా వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా లక్ష్యంగా పెట్టుకున్న ముస్లిం మైనారిటీలపైనే ఈ రాక్షస చట్టాలను వినియోగించడం లేదు. ప్రభుత్వంపై నిరసన తెలిపే, ప్రభుత్వంతో అంగీకరించని, భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే జర్నలిస్టులపైన కూడ వినియోగిస్తున్నారు. భిన్నాభిప్రాయాన్ని జాతి వ్యతిరేకంగా పరిగణిస్తున్నారు. సిఏఏ (పౌరసత్వ చట్ట) వ్యతిరేక కార్యకర్తల పైన, ప్రత్యేకించి యువత పైన, ఢిల్లీ మతకొట్లాటలకు గురైనవారిపైన, వారికి సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచిన వారిపైన ఈ భయంకర చట్టాల క్రింద కేసులు బనాయిస్తున్నారు. కృత్రిమంగా అల్లబడిన భీమా– కోరేగావ్ కేసులో 16 మంది మేధావులు, సామాజిక కార్యకర్తలపై ఉపా చట్టం క్రింద కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధించారు. వీరిలో ఫాదర్ స్టాన్ స్వామి జైలు నిర్బంధంలోనే మరణించారు. మిగిలినవారిలో ఇద్దరు మినహా అందరూ జైళ్ళలోనే మగ్గుతున్నారు. 2015–2018 మధ్యలో ఉపా కేసులు

పెట్టడం 72 శాతం అధికం అయింది. కాని వీరిలో నేరస్థులుగా రుజువైన వారు కేవలం 2 శాతం మాత్రమే.

**2.43** మొత్తంగా నిరంకుశత్వం పటిష్టపడుతున్నది. రాజ్యాంగపరమైన హామీలు తుంగలో తొక్కబడుతున్నాయి. ప్రజాతంత్ర, పౌర హక్కులపై దాడులు జరుగుతున్నాయి.

## నిఘా రాజ్య నిర్మాణం

**2.44** మోడీ ప్రభుత్వం నిఘా రాజ్య చట్రాన్ని అభివృద్ధి చేసింది. అది పౌరుల ప్రైవసీ లోకి నిరంతరం చొరబడుతున్నది.

**2.45** ప్రస్తుతమున్న డిజిటల్ నిఘా చట్రం ద్వారా అనేక ప్రభుత్వ సంస్థలకు మన డిజిటల్ సమాచారం అందుబాటులోకి వచ్చింది. టెలికం నిఘా కోసం కేంద్ర పర్యవేక్షక వ్యవస్థ, నెట్‌వర్క్ ట్రాఫిక్ ఎనాలిసిస్ (నెట్రా), సమాచార ప్రాతిపదికపై జాతీయ నిఘా గ్రిడ్, డిఎన్ఏ కలిగిన సమీకృత శిక్షావ్యవస్థ (ఐసిజెఎస్), ముఖ గుర్తింపు (ఫేసియల్ రికగ్నిషన్), జియో మెట్రిక్స్, ఐడెండిటీ సమాచారం ఈ నిఘా చట్రంలో ఉన్నాయి. ఇటీవల పార్లమెంటు క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) బిల్లు 2022ను ఆమోదించింది. దీని ప్రకారం కేవలం క్రిమినల్ ఆరోపణలపై శిక్షించబడినవారివే కాకుండా అరెస్టు అయిన వారందరి బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరిస్తారు.

**2.46** ప్రభుత్వం కూడా అనేక యాప్స్, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల సమాచారాన్ని సేకరిస్తున్నది. పన్ను చెల్లింపు పత్రాలు దాఖలు చేయడం, ఆధార్ లాంటి డిజిటల్ సమాచారాన్ని అనుసంధానం చేసుకొన్న రేషన్ కార్డ్ ద్వారా రేషన్ అందించడం లాంటి ప్రభుత్వ సేవల సమయంలో ఈ సమాచారం రాబట్టబడుతున్నది. ప్రభుత్వం ఇలా సేకరిస్తున్న సమాచారం చట్టబద్ధమా కాదా, ఉద్దేశించబడిన దాని కోసమే వినియోగించబడతుందా, దుర్వినియోగం చేయబడదా లాంటి రక్షణలు

లేకుండానే ఇదంతా చేస్తున్నారు. ఇలాంటి రక్షణలు లేకపోవడమే కాదు, తాను సేకరించిన సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు వ్యాపార ప్రయోజనాల కోసం వినియోగించుకునేందుకు అందుబాటులో ఉంచాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇలాంటి డిజిటల్ వేదికలు, యాప్స్ ద్వారా సేకరించే సమాచారం, ప్రస్తుతం ఉనికిలో ఉన్న నిఘా వ్యవస్థ ద్వారా సేకరించే సమాచారం కలుపుకొంటే ఇది పౌరుల ప్రైవసీ పైన, పౌర హక్కులపైన గణనీయమైన దాడి. ప్రైవసీ అనేది పౌరుల ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు చెప్పింది. అయినప్పటికీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ ప్రాసెస్ చేసిన వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లు 2019 ముసాయిదాలో పౌరులపై చట్టవిరుద్ధమైన నిఘా, సేకరించిన సమాచారాన్ని తప్పుగా వినియోగించడం లాంటి వాటి నుండి రక్షణను పొందుపరచలేదు. ప్రభుత్వం అతిగా వ్యవహరించకుండా చట్టపరమైన రక్షణ వ్యవస్థ ఉండాలని శ్రీకృష్ణ కమిషన్ చెప్పింది. అయినప్పటికీ, ఈ ప్రతిపాదిత బిల్లు ప్రభుత్వ ఏజెన్సీలకు పూర్తి మినహాయింపునిస్తూ వాటికి విశేషమైన అధికారాలను కట్టబెడుతున్నది.

**2.47** పౌరుల ప్రాథమిక హక్కులకు, ప్రైవసీకి ఎలాంటి ప్రమాదం పొంచి ఉన్నదో పెగసస్ నిఘా పరికరాల వినియోగ ఉదంతం స్పష్టం చేస్తున్నది. ప్రతిపక్ష నేతల, జర్నలిస్టుల, సామాజిక కార్యకర్తల ఫోన్లు ఈ పెగసస్ పరికరం ద్వారా హ్యాక్ చేయబడినాయి. తాను పెగసస్ పరికరాలను వినియోగించానని సుప్రీం కోర్టు ముందు అంగీకరించేందుకు ప్రభుత్వం నిరాకరించింది. పెగసస్‌ను సరఫరా చేసిన ఇజ్రాయల్ కంపెనీ ఎన్ఎస్ఓ తాను కేవలం ప్రభుత్వాలకు మాత్రమే ఆ పరికరాన్ని విక్రయిస్తానని పదే పదే చెప్పినా ప్రభుత్వం సుప్రీం కోర్టు ముందు అలా వ్యవహరించింది. భారత దేశంలో పెగసస్ నిఘా పరికరం వినియోగించబడిందా లేదా అన్నదాన్ని తేల్చడానికి సుప్రీం కోర్టు ఒక కమిటీని నియమించింది.

**2.48** సమాచార రక్షణ ముసాయిదా బిల్లు నుండి ప్రభుత్వ ఏజెన్సీలకు ప్రతిపాదిత మినహాయింపు, పౌరుల ప్రాథమిక హక్కులను ప్రమాదంలోకి నెట్టివేసి, ఒక నిఘా వ్యవస్థను నెలకొల్పేందుకు ప్రభుత్వం సాహసించేలా చేస్తుంది. పూర్తి స్థాయి వ్యక్తిగత సమాచార పరిరక్షణ హక్కు చట్టం కోసం,

చట్టవిరుద్ధమైన ప్రభుత్వ నిఘాను అంతం చేయాలన్న దానికోసం పోరాటాన్ని రానున్న రోజుల్లో కొనసాగించాల్సి ఉంటుంది.

## ఫెడరలిజాన్ని దెబ్బతీయడం

**2.49** ఈ కాలంలో విద్య, రాజకీయ, ద్రవ్య, సామాజిక, సాంస్కృతిక – ఇలా అన్ని రంగాలలోను ఫెడరలిజంపై నిరంతరం దాడులు జరిగాయి.

**2.50** గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు అన్ని రాజ్యాంగ సంప్రదాయాలనూ ఉల్లంఘించి వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలలో వారు బిజెపి ఎజెండాను ముందుకు తీసుకుపోయేవారిగా ప్రవర్తిస్తున్నారు.

**2.51** రాష్ట్రాల జాబితాలోనూ, ఉమ్మడి జాబితాలోనూ రాజ్యాంగం పొందుపరిచిన అంశాలపై తన పరిధిని అతిక్రమించి కేంద్రమే నేరుగా చట్టాలు చేస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నది. విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. కాని జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఇపి) రాష్ట్ర ప్రభుత్వాలతో ఎలాంటి సంప్రతింపులు జరపకుండా కేంద్రమే ఏకపక్షంగా ప్రకటించింది. అదే విధంగా మూడు అభివృద్ధి నిరోధక వ్యవసాయ చట్టాలను కేంద్రమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరపకుండా తీసుకొచ్చింది. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అనేక కేంద్ర ప్రాయోజిత పథకాలను ఇలాగే కేంద్రం ఏకపక్షంగా ప్రవేశపెడుతున్నది. సహకార సంఘాలు పూర్తిగా రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశం. కాని కేంద్రం సహకార మంత్రిత్వ శాఖ ఒకదానిని ఏర్పాటు చేసి రాష్ట్రాల హక్కులపై బరితెగించి దాడి చేసింది.

**2.52** సాంస్కృతిక రంగంలో రాష్ట్రాల స్వయంప్రతిపత్తి నిరంతరం కుదించబడుతున్నది. రాజ్యాంగం 8వ షెడ్యూలులో పొందుపరిచిన జాతీయ భాషలన్నింటికీ సమానప్రతిపత్తి ఇవ్వకుండా కేంద్రం హిందీని ఉద్దేశపూర్వకంగా ప్రోత్సహిస్తున్నది.

**2.53** **ద్రవ్య ఫెడరలిజం:** వస్తు సేవల పన్ను (జిఎస్టి)ని అమలు చేయడం ద్వారా బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల ద్రవ్య స్వతంత్రతను తీవ్రంగా

కుదిస్తున్నది. దీని మూలంగా రాష్ట్రాలు తమ పన్ను విధింపు అధికారాలను కోల్పోవడమే కాదు, జిఎస్‌టికి ఎదుగుబొదుగు లేకపోవడంతో పెద్ద ఎత్తున రెవిన్యూను కోల్పోతున్నాయి. గత సారి రాష్ట్రాల ఎన్నికలు జరిగినపుడు రెవిన్యూ ఆదాయాన్ని తటస్థ స్థాయి కన్నా దిగువకు చేర్చే విధంగా జిఎస్‌టి రేట్లు తీవ్రంగా తగ్గించడినాయి. రాష్ట్రాలకు జిఎస్‌టి పరిహారం కేంద్రం ఎప్పుడూ సకాలంలో చెల్లించడం లేదు. బకాయిలు ఎల్లప్పుడూ కొనసాగుతున్నాయి. పరిహారం చెల్లించే ఐదు సంత్సరాల గడువు 2022తో ముగుస్తుంది. దాన్ని పొడిగించాలన్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదు. చాల రాష్ట్రాలు రెవిన్యూ సంక్షోభంలో కూరుకుపోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

**2.54** కేంద్రం సెస్సులు, సర్‌చార్జీల మీద ఆధారపడటంతో పరోక్ష పన్నుల్లో రాష్ట్రాలకు న్యాయంగా రావలసిన వాటా రావడం లేదు. కేంద్రం రాష్ట్రాలకు పన్ను రాబడి పంచి ఇచ్చే విభజిత మొత్తం పరిధిలోకి సెస్‌లు, సర్‌చార్జీలు రావు. విభజిత మొత్తంలో ఉంటే రాష్ట్రాలకు 42 శాతం వాటా లభిస్తుంది. ఇలా రాష్ట్రాలకు రావలసిన పన్ను వాటాను ఎగవేసే పద్ధతి ఎంత మాత్రం అంగీకారం కాదు.

**2.55** ప్రణాళికా సంఘాన్ని నిర్మూలించడంతో కొత్త ప్రాజెక్టులకు పెద్ద మొత్తాలలో నిధులు మంజూరు చేయడం పూర్తిగా కేంద్ర ఆర్థిక శాఖ విచక్షణాధికార పరిధిలోకి వచ్చింది. ఈ శాఖకు ఒక ప్రణాళిక కాని, సమ న్యాయం కాని లేకపోవడంతో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్రాల పరిధిలో ఉన్న అంశాలపై కూడ రాష్ట్రాలతో ఎలాంటి సంప్రతింపులు జరపకుండానే కేంద్రం స్వేచ్ఛావాణిజ్యం లాంటి అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది.

**2.56** ఫెదరిలిజంపై జరిగే దాడులను ప్రతిఘటించేందుకు, రాష్ట్రాల హక్కులను పరిరక్షించేందుకు బిజెపియేతర పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర ప్రజాతంత్ర శక్తులను కలుపుకొని సమైక్యంగా పోరాటం చేయాలి. మన రాజ్యాంగ మౌలిక స్వభావమైన ఫెడరలిజం పరిరక్షణ అనేది నిరంకుశ కేంద్రీకరణకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఒక భాగం.

## మహిళల స్థాయి మరింత అధ్వానం

**2.57** ఆర్థిక దుస్థితి ప్రభావానికి మహిళలు గురవుతున్నారు. మహిళలు అత్యధికంగా పనిచేసే అసంఘటిత రంగంలో పనులు లేకపోవడంతో తమ ఆదాయాన్ని కోల్పోతున్నారు. మెజారిటీ గ్రామీణ మహిళలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకంలో కోతలు మహిళలను దెబ్బతీస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక లింగ వ్యత్యాసం ఉన్న దేశాలలో భారత్ ఒకటి. కూలీ పనులు, వేతన ఉద్యోగాలు ఎంతో అవసరం ఉన్న సమయంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో మహిళలు శ్రామిక శక్తి నుండి వెలుపలికి నెట్టివేయబడుతున్నారు. ఇదే సమయంలో మరో వైపున ఇంట్లోను, కుటుంబ సంస్థలలోను మహిళలు చెల్లింపులు లేని శ్రమ చేయడం బాగా పెరిగి పోయింది. ఈ పితృస్వామ్య సమాజంలో కుటుంబ నిర్వహణ భారం మహిళలపైనే అధికంగా మోపబడుతున్నది. కాని పెరుగుతున్న ధరలు, మంచినీరు, విద్యుత్తు లాంటి సేవలకు యూజర్ చార్జీలు పెరగడంతో మహిళలు కుటుంబం గడవడానికి తమ అవసరాలను పక్కన పెట్టాల్సి వస్తున్నది. ప్రత్యేకించి ఒంటరి మహిళ కుటుంబాల, మహిళలు నిర్వహించే కుటుంబాల పరిస్థితి మరింత అధ్వానమైంది. కేంద్ర ప్రభుత్వ విధానాల నుండి ఇలాంటి మహిళలకు ఎలాంటి సహాయం అందడం లేదు. మహిళలు కుటుంబాల్ని గడపడానికి తమవద్ద ఉన్న నామమాత్రపు వస్తువులను తాకట్టు పెడుతున్నారు. వారు రక్తం పీల్చే వడ్డీ వ్యాపారుల నుండి, మైక్రో ఫైనాన్స్ సంస్థల నుండి అధిక వడ్డీలకు అప్పులు తేవాల్సి వస్తున్నది. విద్యాబోధన నిలిచి పోవడం బాలికలను తీవ్రంగా దెబ్బతీసింది. బాల్యవివాహాలు అధికమయ్యాయి. స్త్రీ, పురుషుల మధ్య విద్యాస్థాయిలో వ్యత్యాసం మరింత పెరిగింది.

**2.58** మహిళలపైన, బాలికలపైన లైంగిక హింసాకాండ ఈ కాలంలో విపరీతంగా పెరిగింది. కొన్ని కేసుల్లో అత్యంత ఆటవికమైన క్రూరత్వం చోటు చేసుకుంటున్నది. ఈ మహమ్మారి కాలంలో మహిళలపై గృహహింస కూడా పెరిగింది. చాల కేసుల్లో లైంగిక హింసకు గురైన వారినే నిందించడం, అవమాన పరచడం జరుగుతున్నది. ఈ నేరాలను సమర్థించుకోవడానికి కొందరు బిజెపి నేతలు చేస్తున్న అభ్యంతరకరమైన ప్రకటనలు బాధితులను మరింత వేదనకు గురిచేస్తున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలలో నాసిరకపు దర్యాప్తు పద్ధతులు, అతి తక్కువ కేసుల్లో నేరం రుజువు కావడం జరుగుతున్నది. దిగ్భ్రాంతికరమైన విషయమేమంటే

లైంగిక హింసకు గురైన వారి పునరావాసం కోసం కేటాయించబడిన నిధులు దుర్వినియోగం కావడం, లేదా మురిగిపోవడం జరుగుతున్నది.

**2.59** పితృస్వామ్య, మతతత్వ, కులతత్వ ఆచారాలను ప్రోత్సహించే, మహిళలను ఇంటి పనులకే బంధించే అభివృద్ధి నిరోధక మనువాద సిద్ధాంతాలను బిజెపి, ఆరెస్సెస్, వాటి అనుబంధ సంస్థలు చురుగ్గా ప్రోత్సహిస్తున్నాయి. ఈ వైఖరులు బలవంతపు జనాభా విధానాలు రుద్దడంలో ప్రతిబింబిస్తున్నాయి. మహిళలకు తమ శరీరాలపై హక్కులను నిరాకరిస్తున్నారు. సెక్షన్ 498 ఎలాంటి మహిళలకు రక్షణ కల్పించే లౌకిక చట్టాలను బలహీనపరుస్తున్నారు. మహిళలు ఎంచుకునే స్వేచ్ఛపై దాడి చేస్తున్నారు. తమకు నచ్చిన వివాహం చేసుకునే స్వేచ్ఛపై అత్యంత దౌర్జన్యపూరితమైన ప్రచారదాడి నిర్వహిస్తున్నారు. కులదురహంకార హత్యలను సమర్థించే సంస్కృతికి మద్దతు కల్పిస్తున్నారు. ఆరోగ్యకారణాలు చూపి బాలికల వివాహ కనిష్ట వయసును 18 నుండి 21 సంవత్సరాలకు పెంచడం ఏ మాత్రం సరికాదు. 18 ఏళ్లు నిండిన మహిళ చట్టపరంగా వయోజనురాలిగా పరిగణించబడుతుంది. కాని వివాహ వయసుకు సంబంధించి మాత్రం ఆమెను కౌమారదశలో ఉన్న స్త్రీ అని చెప్పడం వైరుధ్యంతో కూడుకున్నది. తన జీవిత గమనాన్ని నిర్ణయించుకునేందుకు స్త్రీకున్న హక్కును ఇది కాలరాయడమే. ఆరోగ్య సమస్యలను నివారించడానికి, తగిన పోషణ లభించేలా చూసి మాతాశిశు మరణాలను తగ్గించాలి. ఈ కాలంలో ప్రత్యేకించి మైనారిటీ, దళిత మహిళలు తీవ్రంగా దాడులకు, వేధింపులకు గురయ్యారు. మహిళా సమానత్వంపై బిజెపి–ఆరెస్సెస్‌ల సిద్ధాంతాలు, ఆచరణలను ఎదుర్కోవడంతో, నేడు మహిళల సమానత్వం కోసం జరిపే పోరాటం నేరుగా సంబంధం కలిగి ఉంది.

## సామాజిక న్యాయంపై దాడులు

**2.60** సామాజికంగా అణచివేతకు గురవుతున్న ప్రజానీకానికి సమానత్వం కోసం, రాజ్యాంగం కల్పించిన హామీలను అమలు చేయకపోగా, సామాజికన్యాయ లక్ష్యాన్ని సాధించకపోగా వారినే మరిన్ని అన్యాయాలకు, వివక్షతలకు గురిచేస్తున్నారు.

**2.61** **దళితులు:** అనేక బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధ, మనువాద ఎజెండాను దూకుడుగా అమలు చేయడంతో దళితుల పరిస్థితి గత మహాసభ నాటికన్నా ఈ నాటికి మరింత దిగజారింది. దళితులు నేటికీ విద్య, ఉపాధి, జీవనభృతి అవకాశాలకు దూరం చేయబడుతున్నారు. ఎస్సి విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇచ్చేందుకు అవసరమైన నిధుల్లో వాటాను భరించేందుకు కేంద్రం తిరస్కరిస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రభుత్వ శాఖల్లో రిక్రూట్‌మెంట్లపై నిషేధం లాంటివి ఉపాధి ఆవకాశాలను తగ్గిస్తున్నాయి. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం చట్టం చేసేందుకు ఎలాంటి కృషి జరగడంలేదు.

**2.62** ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులపై దాడులు అనేక రెట్లు పెరిగాయి. దళిత మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. హత్రాస్ ఘటనలో నేరాన్ని కప్పిపెట్టడానికి, బాధిత కుటుంబాన్ని అణచివేయడానికి బిజెపి ప్రభుత్వం తన అధికారాన్ని ఎలా వినియోగించిందీ గమనిస్తే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. ఒక వైపున దళితులపై దాడుల సంఖ్య పెరుగుతూ ఉంటే, నేరస్థులుగా నిర్ధారించబడిన వారి సంఖ్య మాత్రం పెరగడం లేదు. పలు దళిత సంఘాలు పెద్దఎత్తున పోరాటం, ప్రతిఘటన జరపడంతో ఎస్‌సీ, ఎస్‌టీలపై దాడులను నివారించే చట్టాన్ని నీరుగారుస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వమ్ము చేసేందుకు ప్రభుత్వం చట్టం చేయాల్సి వచ్చింది.

**2.63** **ఆదివాసీలు:** ఆదివాసులను ఏకీకృత హిందూమతంలో ఇముడ్చుకోవడానికి ఆరెస్సెస్ తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. బిజెపి పాలిత రాష్ట్రాలలో ఆదివాసీలలో ఉన్న క్రైస్తవులపై అంతకంతకూ అధికంగా దాడులు జరుగుతున్నాయి. బిజెపి ప్రభుత్వం అటవీ హక్కుల చట్టంలోని కొన్ని నిబంధనలను నీరుగార్చి, ఆదివాసీలకు న్యాయంగా దక్కవలసిన వాటాను నిరాకరిస్తున్నది. అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీల కోర్కెలను అన్యాయంగా తిరస్కరిస్తున్నారు. గ్రామసభల్లో ఆదివాసీలు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశాన్ని తొలగించిన ప్రభుత్వం కార్పొరేట్ దోపిడీని అనుమతిస్తున్నది. అడవులను వాణిజ్యపరం చేస్తున్నారు, ప్రైవేటీకరిస్తున్నారు, సైనికీకరణ సైతం కావిస్తున్నారు.

ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాల అటవీ భూములను మళ్ళిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో కనుగొనబడిన అపారమైన ఖనిజ సంపదను కార్పొరేట్లు దోపిడీ చేయడానికి అనుమతిస్తున్నారు. ఈ విధానాల ఫలితంగా ఆదివాసీల తొలగింపు బాగా పెరిగింది. రైతులకుద్దేశించిన పథకాలేవీ ఆదివాసీ రైతులకు అందడం లేదు. మైనర్ అటవీ ఉత్పత్తుల సేకరణకు కనీస మద్దతు ధర చెల్లించడానికి కేటాయించిన నిధులు నామమాత్రంగా ఉంటున్నాయి.

**2.64** వలస కార్మికుల్లో ఎక్కువ మంది ఆదివాసీలు ఉన్నారు. మహమ్మారి సమయంలో వలస కార్మికుల సమస్యలను పట్టించకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలం చెందడంతో ఆదివాసీలపై తీవ్రమైన ప్రభావం పడింది. 95 శాతానికి పైగా ఆదివాసీ విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య పొందడానికి అవకాశాలు లేవు. ఒక్క కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మినహా దేశంలో మరే ప్రభుత్వం ఆదివాసీ విద్యార్థులు తమ చట్టబద్ధమైన విద్యా హక్కును పొందడానికి ఏర్పాట్లు చేయలేదు. ఆదివాసీ విద్యార్థులకు క్రమబద్ధంగా స్కాలర్‌షిప్పుల నిధులు విడుదల చేయడంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. నయా–ఉదారవాద విధానాల ఫలితంగా ఆదివాసీ యువతకు ఉద్యోగావకాశాలు లభించడం లేదు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదు. వివక్షత ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల లోని ఆదివాసీలకు ప్రమోషన్లు నిరాకరించబడుతున్నాయి.

**2.65** **ఓబిసీలు:** 2021 సాధారణ జనాభా లెక్కలతో పాటు కులగణన కూడ చేపట్టాలన్న డిమాండును బిజెపి ప్రభుత్వం తన పాక్షిక ప్రయోజనాల రీత్యా తిరస్కరిస్తున్నది. ఓబిసీలకు సంబంధించి సమాచారం లేదు. అందుచేత ఓబిసీలలోని వివిధ తరగతుల కచ్చితమైన సంఖ్య తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఏ కులాన్ని ఓబిసీగా పరిగణించాలో నిర్ణయించే అధికారాన్ని భారత రాష్ట్రపతికి కట్టబెడుతూ కేంద్రం చట్టం తీసుకువచ్చింది. ఇది మన ఫెడరల్ వ్యవస్థపై దాడి చేయడమే. రిజర్వేషన్ల కోసం ఓబిసీలను నిర్ణయించే రాష్ట్రాలకున్న హక్కును ఇది హరిస్తున్నది. ప్రజా ఒత్తిడి మూలంగా సుప్రీం కోర్టు వివరణను సరిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించాల్సి వచ్చింది.

**2.66 వికలాంగులు:** కోవిడ్ 19 వికలాంగుల జీవనాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఆహారాన్ని పొందడం, ప్రాణరక్షక ఆరోగ్య సంరక్షణను పొందడం, ఉద్యోగాలు లేకపోవడం మొదలైనవన్నీ వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు. వికాలంగ విద్యార్థుల్లో ఎక్కువ మందికి నాణ్యమైన విద్య అందడం లేదు. వికలాంగ మహిళలపైన, బాలికలపైన అత్యాచారాలు, అవమానాలు అధికమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రు. 1,000ల నామమాత్రపు ఎక్స్‌గ్రేషియా సైతం 3.8 శాతం వికలాంగులకు మాత్రమే అందుతున్నది.

**2.67** వికలాంగుల హక్కుల చట్టం 2016లోని నిబంధనలను నీరుగార్చడానికి ప్రభుత్వం తెచ్చిన ప్రతిపాదనలను తీవ్రమైన ప్రతిఘటన మూలంగా ఉపసంహరించుకోవలసి వచ్చింది. అయినప్పటికీ, వికలాంగులకు సంబంధించిన వివిధ సంస్థలను విలీనం చేసే ప్రయత్నం మాత్రం వికలాంగుల పునరావాస సేవలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. వికలాంగులకు నిధుల కేటాయింపుల్లో కోతలు ఆర్‌పిడి చట్టంలో పొందుపరచబడిన హక్కులు వాస్తవరూపం ధరించే క్రమాన్ని అడ్డుకుంటాయి. బడ్జెట్ మద్దతు లేకపోవడం మానసిక ఆరోగ్య పరిరక్షణ చట్టం 2017 విషయంలో కూడ అవరోధంగా పరిణమిస్తుంది.

**2.68 లింగపరమైన మైనారిటీలు:** లింగ మార్పిడి వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం 2020 ని ఈ తరగతి ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా సవరించాల్సిన అవసరం ఉంది. వీరికి ఓబిసి కోటా నుండి రిజర్వేషన్లను కేటాయించే నిర్ణయంసరైంది కాదు. వీరికి సమాంతరంగా ప్రత్యేక రిజర్వేషన్లు ఉండాలి. అద్దెగర్భ (నియంత్రణ) చట్టం 2020, సహాయక పునరుత్పత్తి సాంకేతికత (నియంత్రణ) బిల్లు 2021 ఎల్‌జిబిటిక్యుఐ తరగతుల వారికి తల్లిదండ్రులయ్యే హక్కును నిరాకరిస్తున్నాయి. ఒకే లింగ వ్యక్తుల మధ్య సెక్స్ సంబంధాలు నేరం కాదని సుప్రీం కోర్టు చెప్పినప్పటికీ లైంగికపరమైన మైనారిటీలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

## రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయడం

**2.69** **పార్లమెంటు:** బిజెపి తన 'మెజారిటీ దౌర్జన్యాన్ని' ప్రయోగించే వేదికగా పార్లమెంటు అంతకంతకూ మారిపోతున్నది. పార్లమెంటరీ కమిటీల పరిశీలనలు లాంటి పద్ధతులు, పార్లమెంటరీ ప్రొసీజర్లు లేకుండానే చట్టాలు చేయడుతున్నాయి. అత్యధిక చట్టాలు ఎలాంటి చర్చ లేకుండానే గందరగోళాల మధ్యనే చేయబడుతున్నాయి. బలహీనమైన కారణాలతో 12 మంది ప్రతిపక్ష రాజ్యసభ సభ్యులను పార్లమెంటు 2021 శీతాకాల సమావేశాల పూర్తి కాలం సస్పెండ్ చేశారు. దీనితో బిజెపికి ఎగువసభలో కావలసినంత మెజారిటీ లభించింది. ఇలాంటి శిక్షాచర్యలతో ప్రతిపక్ష ఎంపీల నోళ్ళు నొక్కడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజాసమస్యలపై పార్లమెంటులో చర్చ జరగకుండా నిరాకరిస్తున్నారు.

**2.70** పార్లమెంటు పట్ల తన జవాబుదారీతనం నుండి మోడీ ప్రభుత్వం తప్పుకుంటున్నది. ప్రజల సార్వభౌమత్వాన్ని అమలు చేయడానికి మన రాజ్యాంగ యంత్రంలో పార్లమెంటు కీలకమైన అనుసంధానం. ప్రభుత్వం పార్లమెంటుకు జవాబుదారీగా ఉండాలి, చట్టసభ (ఎంపీలు) ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. పార్లమెంటు తన విధులను నిర్వర్తించకపోయినట్లయితే, ఈ అనుసంధానం విచ్ఛిన్నం అవుతుంది, ప్రజల సార్వభౌమత్వం దెబ్బతీయబడుతుంది.

**2.71** **న్యాయవ్యవస్థ:** చాల సందర్భాలలో కోర్టు తీర్పులు న్యాయం వైపు కాకుండా ప్రభుత్వం వైపుకే ఎక్కువ మొగ్గుతో ఉంటున్నాయి. సుప్రీం కోర్టు అయోధ్య వివాదంపై తీర్పు చెప్పింది. కాని ఆ తీర్పు న్యాయాన్ని ఆవిష్కరించేదిగా లేదు. రాజ్యాంగం 370 అధికరణాన్ని రద్దు చేయడం, 35ఎ ను రద్దుచేయడం, జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేయడం, సిఎఎ, ఎన్నికల బాండ్లు లాంటి పలు కీలక అంశాలపై ప్రభుత్వం చేసిన చట్టాల రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ వేసిన కేసులు దాదాపు గత 3 సంవత్సరాలుగా కోర్టుల వద్ద పెండింగులోనే ఉన్నాయి.

**2.72** **ఎన్నికల కమిషన్:** 'స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా' ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగం ప్రకారం నియమించబడిన సంస్థ ఎన్నికల

కమిషన్. అభ్యర్థులు అందరూ సమాన స్థాయిలో పోటీపడేలా హామీ కల్పించడం ఎన్నికల కమిషన్ విధి. కాని ఎన్నికల కమిషన్ న్యాయబద్ధంగా వ్యవహరించకుండా పాలకపార్టీకి ఎక్కువ అనుకూలంగా వ్యవహరిస్తున్నదనే భావన అంతకంతకూ బలపడుతున్నది. ఎన్నికల నిధుల సేకరణలో పారదర్శకతను ఎన్నికల బాండ్లు నీరుగారుస్తాయని ఎన్నికల కమిషన్ మొదట తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. కాని ఆ తర్వాత ఎన్నికల కమిషన్ తన వైఖరిని పలుచన చేసుకుంది. ఈ బాండ్లలో దాదాపు 80 శాతాన్ని బిజెపియే నగదుగా మార్చుకొంది. దీని మూలంగా ఎన్నికల్లో బిజెపి అపారమైన ధన బలాన్ని ప్రదర్శించింది. స్వేచ్ఛాయుతమైన, నాయబద్ధమైన ఎన్నికల నిర్వహణకు, ప్రజాస్వామ్యానికి కీలకమైన సమాన స్థాయి పోటీని ఇది దెబ్బతీసింది. తాజాగా ఓటర్ గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయడం రహస్య ఓటింగ్ అనే ఓటరు హక్కును ఉల్లంఘిస్తుంది.

**2.73** **స్వతంత్ర దర్యాప్తు సంస్థలు:** కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఈ రెండూ కూడ ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకొని పాలక పార్టీ రాజకీయ అంగాలుగా పనిచేస్తున్నాయి.

**2.74** ఉదాహరణకు ఇడి దాడులు (అధికారికంగా వీటిని సోదా, స్వాధీనం అని పిలుస్తారు) 2013లో కేవలం 62 జరిగితే, 2019 నాటికి అవి పది రెట్లకు పైగా 670కి పెరిగాయి. మార్చి 2011 నుండి జనవరి 2020 మధ్యలో ఇడి 1569 దర్యాప్తులకు సంబంధించి మొత్తం 17,000 దాడులు చేసింది. అయినప్పటికీ కేవలం 9లో మాత్రమే అక్రమాలకు పాల్పడినట్లు రుజువైంది. అవి కూడ చాల స్వల్పమైన కేసులు. ఈ దాడులు, దర్యాప్తులనేవి కేవలం ప్రభుత్వాన్ని వ్యతిరేకించే, అసమ్మతి తెలియచేసే వారిని వేధించడానికి ఉద్దేశించబడినవని స్పష్టమవుతుంది.

**2.75** ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలకు వ్యతిరేకంగా సిబిఐ పాత్ర అత్యధిక స్థాయికి చేరింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, జార్ఖండ్, మహరాష్ట్ర, కేరళ, చత్తీస్‌ఘర్, మిజోరాం లాంటి 9 రాష్ట్ర ప్రభుత్వాలు తమతో సంప్రతించకుండా సిబిఐ దర్యాప్తు చేస్తున్నదని ఆ దర్యాప్తును అనుమతించకపోవడమే దీనికి నిదర్శనం.

2.76 తమకు అనుకూలంగా వార్తలను, సమాచారాన్ని అందించే విధంగా బిజెపి, దాని ప్రభుత్వం మీడియా సంస్థలను అదుపు చేస్తున్నాయి. ప్రధానంగా కార్పొరేట్ సంస్థల ఆధీనంలోనే మీడియా సంస్థలు ఉన్నాయి. గౌరవప్రదమైన కొన్ని మినహాయింపులున్నప్పటికీ, మీడియాను ప్రజలు 'గోడీ మీడియా' అని చెప్పుకుంటున్నారు.

2.77 బిజెపి, దాని ప్రభుత్వ ఎజెండాను మీడియా ప్రచారం చేసే విధంగా, ప్రజల కష్టాల వాస్తవాలను కప్పిపుచ్చే విధంగా, ప్రధాని మోడీ భజన చేసే విధంగా చేసేందుకు ప్రభుత్వం బెదిరింపులతో సహా వివిధ పద్ధతులను అనుసరిస్తున్నది.

2.78 అన్ని రకాల భిన్నాభిప్రాయాలు, ప్రజలకు సంబంధించిన వాస్తవాలు, వారి జీవితాలు, కష్టాలకు సంబంధించిన విరుద్ధ అభిప్రాయాలను జాతి వ్యతిరేకంగా పరిగణిస్తున్నారు. ఉపా, రాజద్రోహం లాంటి రాక్షస చట్టాల క్రింద జర్నలిస్టులను విచక్షణారహితంగా అరెస్టులు చేస్తున్నారు.

2.79 **రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడం:** ఎన్నికల బాండ్ల స్కీము ఎన్నికల నిధి సేకరణలో పెద్ద ఎత్తున గోప్యంతతో కూడిన, పారదర్శకత లేని పద్ధతులకు తెరతీసింది. దాదాపు 80 శాతం పైగా ఎన్నికల బాండ్లను బిజెపియే నగదుగా మార్చుకుంది. ఈ విధంగా 2018-19లో రు.1450 కోట్లు, 2019-20లో రు.2,555 కోట్లు, మొత్తం విక్రయించిన ఎన్నికల బాండ్లలో 76 శాతం బిజెపి స్వంతం చేసుకుంది. ఇప్పటివరకు విక్రయించిన బాండ్ల విలువ రు.7,380.64 కోట్లు.

2.80 మహమ్మారి మొదలైన వెంటనే పిఎం కేర్స్ పేరుతో ఒక కొత్త నిధిని ఆరంభించింది. ఈ నిధికి ట్రస్టీలు ప్రధాన మంత్రి, సీనియర్ క్యాబినెట్ మంత్రులు. దీన్ని నిర్వహించేది ప్రభుత్వ యంత్రాంగం. అయినప్పటికీ దాన్ని ప్రైవేటు నిధి అని చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ నిధికి ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని ఆధికారిక ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధికి అందించే విరాళాలపై ఎటువంటి పన్నులు లేకుండా ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. కార్పొరేట్లు తమ చట్టబద్ధమైన సామాజిక బాధ్యతా నిధి నుండి విరాళాలివ్వడానికి అనుమతిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలు కూడా పెద్ద మొత్తాలలో

విరాళాలివ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం పాత్ర ఇంత ఉన్నప్పటికీ అది ప్రైవేటు నిధిగానే ఉండి పోయింది. దానికి ఆడిటింగ్ లేదు, జవాబుదారీ తనం లేదు, పారదర్శకత లేదు. ఈ నిధి ద్వారా ఎంత మొత్తం వసూలు చేశారు, దాన్ని ఎలా ఖర్చు పెట్టారు అన్నదంతా రహస్యంగానే మిగిలిపోయింది.

**2.81** కార్పొరేట్ సంస్థలకు అవి అందించిన రాజకీయ నిధులకు బదులుగా రాయితీలు కట్టబెట్టడం మోడీ ప్రభుత్వం అనుసరించిన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు ప్రధాన లక్షణం. గడచిన ఏడేళ్ల కాలంలో ఈ ఆశ్రిత పెట్టుబడిదారీ సంస్థలు తీసుకున్న రూ. 10.72 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికలకు హామీ కల్పించే విధంగా అభ్యర్థులందరూ సమాన స్థాయిలో పోటీపడాలనే సూత్రాన్ని ఈ విధంగా లభించిన ధనబలంతో బిజెపి వమ్ము చేస్తున్నది.

## జమ్ము-కాశ్మీర్

**2.82** 2019 ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మోడీ ప్రభుత్వం తీసుకున్న మొదటి చర్య రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని, 35ఎ అధికరణాన్ని రద్దు చేయడం, జమ్ము-కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసి దాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేయడం. ఈ విధంగా ఆరెస్సెస్ ఎజెండాను బిజెపి ప్రభుత్వం అమలుచేసింది. ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రాన్ని లక్ష్యంగా పెట్టుకొని, విలీన ఒప్పందంలో భాగంగా ఆ రాష్ట్రానికి లభించిన ప్రత్యేక హోదాను రద్దు చేయాలన్న ఆరెస్సెస్ దీర్ఘకాలిక డిమాండ్‌ను బిజెపి ప్రభుత్వం నెరవేర్చింది. 2019లో జమ్ము-కాశ్మీర్‌లో పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. అయితే రద్దుచేయబడిన అసెంబ్లీకి మాత్రం ఎన్నికలు జరపలేదు. రాష్ట్ర సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేసినా ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం ఉండాలన్న రాజ్యాంగ నిబంధన నుండి తప్పించుకోవడానికి ఇది వీలు కల్పించింది. అసెంబ్లీ లేదు కాబట్టి, ఆ స్థానంలో గవర్నర్ ఆమోదాన్నే అసెంబ్లీ ఆమోదంగా తీసుకున్నారు. రాష్ట్రాన్ని విస్తారమైన భద్రతా లాక్‌డౌన్‌లో ఉంచి దీన్నంతటినీ చేశారు. మాజీ ముఖ్యమంత్రులతో సహా రాజకీయ పార్టీల నాయకులను ఉపా/

నాసా/పిఎస్ఏ లాంటి నిరంకుశ చట్టాల క్రింద అరెస్టులు చేశారు. కమ్యూనికేషన్లను, ఇంటర్నెట్‌ను పూర్తిగా తొలగించారు.

**2.83** కఠినమైన భద్రతా లాక్‌డౌన్‌తో ప్రజల దైనందిన జీవితం స్తంభించిపోయింది. ప్రజారవాణా వ్యవస్థ నిలిచిపోయింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమైపోయింది. సుదీర్ఘ కాలం కర్ఫ్యూ అమల్లో ఉంది. రాష్ట్రంలో ప్రజానీకాన్ని ఈ చర్యలు మరింత దూరం చేశాయి.
ఇటీవల కాలంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున మిలిటెన్సీ మూలంగా జరిగిన మరణాలతోను, మితిమీరిన బలప్రయోగంతోను, విచక్షణా రహిత అరెస్టులతోను ప్రజలు మరింత దూరమయ్యారు.

**2.84** రాజ్యాంగం 370, 35ఎ అధికరణాల రద్దును, 'జమ్ము-కాశ్మీర్ పునర్వ్యవస్థీకృత చట్టం' ద్వారా రాష్ట్రాన్ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన కేసులు 2019 అగస్టు నుండి నేటికీ విచారణకు నోచుకోలేదు. ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం శాశ్వత నివాసితులు కాని వారు రాష్ట్రంలో భూములు కొనుగోలు చేయడాన్ని అనుమతించేందుకు జమ్ము-కాశ్మీర్ అభివృద్ధి చట్టాన్ని సవరించడం, నైవాసిక చట్టాలను సవరించడం, రాష్ట్రస్థాయి చట్టబద్ధ కమిషన్లను రద్దు చేయడం లాంటి తిరిగి తీసుకోవడానికి వీలులేని నిర్ణయాలు తీసుకుంటున్నది.

**2.85** కేంద్ర ప్రభుత్వం జమ్ము-కాశ్మీర్ నియోజకవర్గాల పునర్విభజన కమిషన్‌ను నియమించింది. కాని దాని సిఫార్సులు ఏ మాత్రం సమర్థనీయం కానివిగానూ, అనిర్హేతుకంగానూ ఉన్నాయి. జమ్ము ప్రాంతంలో 6 సీట్లను పెంచి, కాశ్మీర్ లోయలో మాత్రం 1 సీటునే పెంచింది. 2011 జనాభా లెక్కల ప్రకారం కాశ్మీర్ జనాభా 68.8 లక్షలు, జమ్ము జనాభా 53.5 లక్షలు. న్యాయబద్ధమైన పునర్విభజన జరిగితే 90 సీట్లున్న అసెంబ్లీలో 51 స్థానాలు కాశ్మీర్‌కు, 39 స్థానాలు జమ్ముకు కేటాయించవలసి ఉంటుంది. దీనికి బదులుగా ఇప్పుడు కాశ్మీర్‌కు 47, జమ్ముకు 43 స్థానాలు కేటాయించారు. ఈ నిర్ణయం జమ్ము-కాశ్మీర్ జనాభా పొందిక స్వభావాన్ని, జమ్ము-కాశ్మీర్ రాష్ట్ర పొందికను మార్చడానికి రాజకీయ ఉద్దేశాలతో తీసుకున్నది.

**2.86** పూర్వ జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని, దాని ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలి. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి. మీడియా పైన, ఇతర కమ్యూనికేషన్లపైన, ఇంటర్‌నెట్ పైన ఉన్న నిషేధాన్ని తక్షణం తొలగించాలి. విచక్షణారహిత అరెస్టులను ప్రత్యేకించి యువకుల అరెస్టులను నిలిపివేయాలి.

## ఈశాన్య ప్రాంతం

**2.87** గత కొద్ది సంవత్సరాలుగా అస్సాం ప్రభుత్వంపై పట్టు కొనసాగిస్తున్న బిజెపి ఈశాన్య ప్రాంతంలోకి తన తన ప్రభావాన్ని విస్తరించడానికి దానిని వినియోగించుకున్నది. ఒక్క మిజోరాం మినహా మిగతా అన్ని ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలోను బిజెపి నేరుగా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం కాని, సంకీర్ణ ప్రభుత్వాలలో కొనసాగడం కాని చేస్తున్నది. అస్సాం రాష్ట్రంలో పెద్ద మైనారిటీగా ఉన్న ముస్లిములను లక్ష్యంగా చేసుకొని రాష్ట్రంలో వాతావరణాన్ని మతతత్వపూరితం చేయడానికి బిజెపి ప్రభుత్వం పద్ధతి ప్రకారం ప్రయత్నిస్తున్నది. సిఏఏ, ఎన్ఆర్‌సి దీనికోసం వినియోగించబడుతున్నవి. రైతులు, ప్రత్యేకించి ముస్లిం రైతులు వారు సాగుచేసుకుంటున్న భూముల నుండి వెళ్ళగొట్టబడుతున్నారు. రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను బిజెపి తన పట్టు బిగించడానికి వినియోగించుకుంటున్నది.

**2.88** సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఏ) పలు రాష్ట్రాలలో కొన్ని దశాబ్దాలుగా అమల్లో ఉంటున్నది. 2015లో కుదిరిన నాగాలాండ్ శాంతి ఒప్పందం ఇంతవరకు అమలు కాలేదు. కాని నాగాలాండ్‌లో ఇటీవల ప్రత్యేక అధికారాలు కలిగిన సైనిక దళాలు అతి కిరాతకంగా 14 మంది అమాయక పౌరులను కాల్చిచంపాయి. ఈ చట్టం ఎంత దుర్మార్గంగా అమలవుతున్నదో ఇదే నిదర్శనం. ఈ సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తక్షణం రద్దుచేయాలి.

## నూతన విద్యావిధానం

**2.89** రాజ్యాంగ బద్ధంగా రాష్ట్రాలతో జరపాల్సిన సంప్రతింపులు, చర్చలు జరపకుండానే జాతీయ విద్యావిధానం 2020 ఆమోదించబడింది.

ఆరెస్సెస్ కార్యకర్తలు, దాని సంస్థలకు చెందిన వారు అధిక సంఖ్యలో ఉన్న ప్రభుత్వ నియమిత కమిటీ తుది ముసాయిదా పత్రాన్ని తయారు చేసింది. ఈ ముసాయిదా ఎలాంటి సంప్రతింపులు, చర్చలకు పెట్టకుండానే ఏక పక్షంగా ఆమోదించబడి ప్రకటించబడింది.

**2.90** విద్యారంగంలో హిందూత్వ మతోన్మాద ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళడం, దానికి అనుగుణంగా యువత చైతన్యాన్ని మలచడం ఈ నూతన ముసాయిదాలో పూసలో దారంలో కొనసాగింది. కరిక్యులం, సిలబస్, బోధనా పద్ధతులు అన్నీ కూడ ఈ లక్ష్యానికి అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఈ క్రమంలో ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు దాడికి గురయ్యాయి.

**2.91** ఈ విధానంలో ప్రధానాంశం విద్యను వాణిజ్యీకరించడం, కేంద్రీకృతం చేయడం, మతతత్వపూరితం చేయడం. ఈ లక్ష్యాలను అనుసరించడం విద్య సార్వత్రీకరణను, ప్రజాతంత్ర, శాస్త్రీయ విద్యను దెబ్బతీస్తుంది. ఆన్‌లైన్ విద్యాపద్ధతి, ప్రత్యేకించి ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు అనుసరిస్తున్నది విద్యారంగం నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు మొత్తంగా విద్యావ్యవస్థనే వదిలిపెట్టేలా చేసింది. భారత దేశంలో విస్తారమైన డిజిటల్ అసమానతలు పరిస్థితిని మరింత అధ్వానం చేస్తున్నాయి. ఆరేళ్ల లోపు బాలలకు తొలిబాల్యపు సంరక్షణను, స్కూలింగ్‌ను అందించడం అనే అవగాహననే నూతన విద్యావిధానం వదిలివేసింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, ట్యుటోరియల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ విద్యను ఒక సరుకుగా మార్చి, మెజారిటీ ప్రజానీకానికి దూరం చేస్తున్నాయి. ప్రస్తుత రూపంలో 'నీట్' అసమానమైనది, రాష్ట్రాల ప్రయోజనాలకు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల, ప్రాంతీయ భాషాపరమైన గ్రూపుల, అణగారిన తరగతుల ప్రయోజనాలకు విరుద్ధమైనది.

**2.92** రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను, విశ్వవిద్యాలయాలతో సహా స్వతంత్ర సంస్థల పాత్రను దెబ్బతీస్తూ, కేంద్ర ప్రభుత్వమే విద్యా వ్యవస్థలను అదుపు చేస్తుంది, ఆదేశిస్తుంది. స్కూళ్ళను, రాష్ట్ర స్థాయి విద్యాసంస్థలను

నిర్ణయించడం, నియంత్రించడం, నిర్వహించడంలో రాజ్యాంగపరంగా రాష్ట్రాలకున్న హక్కులను కేంద్రం దురాక్రమిస్తున్నది.

**2.93** హేతువు ప్రాతిపదికగా విజ్ఞాన సముపార్జన అనే సూత్రాన్ని ఈ విధానం క్రింద ప్రతిపాదించే విద్య ఉద్దేశపూర్వకంగా అణచివేస్తున్నది. శాస్త్రీయ జిజ్ఞాస పక్కన పెట్టబడుతున్నది. ఛాందసత్వం, గుడ్డి నమ్మకం, అహేతుకత, అవివేకం ముందుకు తీసుకు రాబడుతున్నాయి. రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువలు, సూత్రాలు అధారంగా యువత చైతన్యాన్ని బలోపేతం చేయడానికి బదులు మతతత్వ హిందూత్వ భావాలపై కేంద్రీకరణ జరుగుతున్నది. సుసంపన్నమైన భారతదేశ చరిత్ర బోధన స్థానంలో హిందూ పురాణాలు చోటుచేసుకుంటున్నాయి. వివిధ సమ్మిళిత భారత తాత్విక ధోరణుల స్థానాన్ని హిందూ ధార్మికత ఆక్రమిస్తున్నది.

**2.94** భారత విద్యావ్యవస్థలో పరిమాణం, నాణ్యత, సమానత్వం అనేవి ఇప్పటికే బలహీనంగా ఉన్నాయి. ఇప్పుడు అవి కూడ పూర్తిగా తుడిచి పెట్టబడుతున్నాయి.

**2.95** మన విద్యారంగంలో ప్రవేశపెట్టబడుతున్న ఈ వినాశకరమైన మార్పులకు వ్యతిరేకంగా విద్యారంగంతో సబంధం ఉన్న అన్ని తరగతులు, మేధావులు కలిసికట్టుగా విశాల పోరాటాన్ని నిర్వహించాలి.

**2.96** **జిజ్ఞాస, హేతుబద్ధతపై దాడి:** అశాస్త్రీయమైన, అచారిత్రకమైన హిందూత్వ మతోన్మాద భావజాలం జిజ్ఞాసపైన, హేతుబద్ధతపైన దాడులు చేస్తున్నది. చాందసత్వం, గుడ్డి ఆచారాలు, వెనుకబాటుతనం హిందూ పురాణాలే నిజమైన చరిత్ర అని ప్రచారం చేయడానికి దోహదపడతాయి. ప్రజల్లో గుడ్డినమ్మకాన్ని బలోపేతం చేసినట్లయితే అశాస్త్రీయమైన, అహేతుకమైన భావాలను వారు తేలిగ్గా స్వీకరిస్తారు. ఇది శాస్త్ర జిజ్ఞాసను, హేతుబద్ధతను దెబ్బతీస్తుంది.

**2.97** నూతన విద్యా విధానంలో ఇలాంటి భావాలను ముందుకు తీసుకువెళ్ళడంతో పాటు, దేశంలోని అన్ని సాంస్కృతిక, పరిశోధనా

సంస్థలు ఆరెస్సెస్ వ్యక్తులతో నింపబడుతున్నాయి, అదుపు చేయబడుతున్నాయి. భారత దేశ చరిత్రను హిందూత్వ మతతత్వ ఎజెండాకు అనుగుణంగా పునర్లిఖించడానికి అవి వినియోగించ బడుతున్నాయి. హిందూత్వ మతోన్మాద ధార్మికతను, ఆలోచనా విధానాన్ని వ్యాప్తి చేయాలంటే సంస్కృతిని ఏకీకృతం చేయడం అవసరం. జిజ్ఞాసను గుడ్డి నమ్మకంతోను, హేతుబద్ధతను అహేతుకతతోను నింపే ప్రయత్నాలు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ఆలోచనలను హరిస్తాయి.

## పర్యావరణం, వాతావరణ మార్పు

**2.98** ప్రపంచ వాతావరణ మార్పు ఫలితంగా భారతదేశం తీవ్రమైన వాతావరణ ప్రభావాన్ని చవి చూస్తున్నది. విపరీతమైన వర్షాలు విస్తారమైన ప్రాంతాలలో వరదలకు కారణమయి, పంటలకు, మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్ల చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలలో వరదలు కూడ ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి. తీరప్రాంత కోత, సముద్రమట్టం పెరుగుదల తీరప్రాంతాలపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. తీరప్రాంత మత్స్యకారుల, రైతుల జీవితాలను, జీవనభృతిని దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు, లోపభూయిష్టమైన ప్రణాళిక, నిర్మాణంతో కూడిన మౌలిక సదుపాయ ప్రాజెక్టుల మూలంగా హిమాలయ ప్రాంతానికి తీవ్రమైన దెబ్బతగిలింది.

**2.99** వాతావరణ మార్పు వల్ల ఏర్పడిన ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనడానికి ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నించడం లేదు. దీనికి పూర్తి భిన్నంగా పర్యావరణ పరిరక్షణకు ఉన్న చట్టాలను ప్రభుత్వం నీరుగారుస్తున్నది, నిర్మూలిస్తున్నది. పర్యావరణ ప్రభావ అంచనాను పలచన చేయడం, భారత అటవీ పరిరక్షణ చట్టానికి ప్రతిపాదించిన సవరణలు, గనులు, ఖనిజాల చట్టానికి ఇంతకు ముందే చేసిన సవరణ– ఇవన్నీ కూడ భారత దేశ అడవులను, మైనింగును, మౌలిక సదుపాయ ప్రాజెక్టులను విచక్షణా రహితంగా వాణిజ్యీకరించడానికి ఉద్దేశించబడినవి. ఇవన్నీ కూడ పర్యావరణానికి, గిరిజనుల, ఇతర అటవీవాసుల జీవితాలకు, జీవనభృతులకు తీవ్రమైన హాని కలిగిస్తాయి. 'కోప్ 26' సమావేశాల్లో వందకుపైగా దేశాలు 2030 నాటికల్లా అడవుల

నిర్మూలను అరికట్టాలని తీర్మానిస్తే అడవుల పట్ల ఇలాంటి అభివృద్ధి నిరోధక వైఖరి ఉండటం మూలంగానే భారత దేశం వాటితో జతకలవలేకపోయింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయపార్టీలు, నిపుణులు, ఈ మార్పుల వల్ల ప్రభావితం అయ్యేవారితో కలిపి ఒక జాతీయ ప్రాతినిధ్య సంస్థను ఏర్పాటు చేయాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు అది తక్షణ ప్రణాళికలను రూపొందించి, కార్యక్రమాన్ని సిద్ధం చేయాలి, నిధులను కేటాయించాలి.

## విదేశాంగ విధానం

**2.100** **అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామి:** కాల పరీక్షకు నిలిచిన భారత దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని మోడీ ప్రభుత్వం విడనాడింది. అన్ని ప్రపంచ వ్యవహారాల్లోను భారత దేశం ఇప్పుడు అమెరికాకు జూనియర్ భాగస్వామిగా దిగజార్చబడింది. ఇలాంటి విదేశాంగ విధాన దిశ నిరర్ధకత్వం ఉక్రెయిన్ యుద్ధంపై రష్యాకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి తీర్మానాలపై ఓటింగ్‌లో పాల్గొనక పోవడంలోను, ఇంధన సరఫరాకు సంబంధించి రూపాయి, రూబుల్ మారకం ప్రాతిపదికన రష్యాతో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోవడంలోను స్పష్టంగా వెల్లడయింది. ఈ ఘర్షణ ఉన్నప్పటికీ ఇండో పసిఫిక్ ప్రాంతంలో అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా భారత్ స్థానాన్ని మరింత పటిష్టపరచే ప్రయత్నాలు అమెరికా సామ్రాజ్యవాదము, బిజెపి ప్రభుత్వము కొనసాగిస్తూనే ఉన్నాయి.

**2.101** మోడీ ప్రధాని అయిన తర్వాత ఏ ఒక్క అలీనోద్యమ శిఖరాగ్ర సభకూ హాజరుకాలేదు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయల్‌తో సంబంధాలను పటిష్టం చేసుకున్నది. సంప్రదాయంగా వస్తున్న పాలస్తీనా ప్రజల పోరాటాలతో సంఘీభావాన్ని, మద్దతును విడనాడింది. మొట్టమొదటిసారి ఒక భారత ప్రధాని ఇజ్రాయల్‌కు అధికారిక పర్యటన జరిపి పాలస్తీనాకు వెళ్ళకుండా తిరిగి వచ్చారు. అమెరికా–ఇజ్రాయల్–భారత్ అపవిత్ర బంధం

బలోపేతం అయింది.

**2.102** పార్టీ 22వ మహాసభ జరిగిన తర్వాత కాలంలో భారతదేశం అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలను, సైనిక సంబంధాలను మరింత పటిష్టం చేసుకున్నది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌లతో కూడిన నాలుగు పక్షాల కూటమి (క్వాడ్) 2018లో కార్యదర్శి స్థాయి చర్చల్లో ఏర్పడింది. 2019లో ఇది విదేశాంగ మంత్రుల స్థాయి కూటమిగా మార్చబడింది. ఆ తర్వాత ఇండోపసిఫిక్ ప్రాంతంలో చైనాను ఏకాకిని చేసే లక్ష్యంతో క్వాడ్‌ను ఒక చురుకైన వ్యూహాత్మక సైనిక కూటమిగా మార్చే అమెరికా ప్రయత్నాలలో భారత్ పాలుపంచుకున్నది.

**2.103** 2+2 ప్రాతిపదికన అమెరికా, భారత్ విదేశాంగ, రక్షణ మంత్రుల క్రమబద్ధమైన సమావేశాలు 2018లో ఆరంభమయ్యాయి. 2+2 సమావేశం 2019లో పారిశ్రామిక భద్రతా ఒప్పందాన్ని (ఐఎస్ఏ) కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం మూలంగా అమెరికా వద్ద ఉన్న అధునాతన సైనిక సాంకేతిక పరిజ్ఞానం భారత దేశానికి అందించే వీలు కలుగుతుంది. అమెరికా, భారత్‌ల మధ్య మూడు వ్యూహాత్మక సైనిక సహకార ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రెండు ఒప్పందాలు, లాజిస్టిక్ ఎక్ఛేంజ్ మెమొరాండం ఆఫ్ ఎగ్రిమెంట్ (లెమోవా) (2016), కమ్యూనికేషన్స్ కంపాటిబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్ (కొంకాసా) (2018) మోడీ మొదటి దఫా అధికార సమయంలోనే జరిగాయి. వీటిలో చివరిది మూడవది, మౌలిక సహకార మార్పిడి ఒప్పందం (బిఇసిఏ) 2020 అక్టోబరు 17న కుదిరింది. ఈ ఒప్పందం దీర్ఘకాలిక వ్యూహాత్మక సైనిక సహకార స్వరూపాన్ని ఖరారు చేసింది.

**2.104** బిఇసిఏ ఒప్పందంలో అనేక ఆందోళనకరమైన, మన దేశ భద్రతకు నష్టదాయకమైన అంశాలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాల మధ్య రాజకీయ భౌగోళిక ఇంటిలిజెన్స్ సమాచార మార్పిడి జరగాలి. ఈ ఒప్పందం ఢిల్లీలోని భారత నౌకాదళ ప్రధాన కార్యాలయానికి, హవాయిలోని అమెరికా ఆసియా పసిఫిక్ దళాల ప్రధాన కార్యాలయానికి మధ్య శాశ్వత అనుసంధానాన్ని ఏర్పాటు చేస్తుంది.

**2.105** యుద్ధవిమానాలు, హెలికాప్టర్‌లతో సహా అమెరికా నుండి అధిక సైనిక సామగ్రిని కొనుగోలు చేసేందుకు భారత్ అంగీకరించింది. సైనిక సామగ్రి కోసం అమెరికా, ఇజ్రాయల్‌లపైనే పూర్తిగా ఆధారపడే స్థితికి భారత్ చేరుకుంటున్నది.

**2.106** **భారత్–చైనా సంబంధాలు:** భారత్ చైనాల మధ్య సైనిక ప్రతిష్టంభన ఇరుదేశాల మధ్య భౌతిక ఘర్షణలకు దారితీసింది. 2020 జూన్‌లో జరిగిన ఘర్షణలో ఇరువైపుల ప్రాణనష్టం జరిగింది. దీనిలో 20 మంది భారత సైనికులు మరణించారు. ఇలా వాస్తవాధీన రేఖ వెంబడి సైనికులు ప్రాణాలు కోల్పోయేంతటి ఘర్షణ జరగడం 45 సంవత్సరాల తర్వాత ఇదే మొదటి సారి. లడక్‌లోని గాల్వాన్ లోయలో జరిగిన ఈ ఘర్షణ శాంతియుత, ప్రశాంత వాతావరణానికి తీవ్రమైన దెబ్బ.

**2.107** భారత ప్రభుత్వం తీసుకున్న వైఖరికి పార్టీ మద్దతు తెలియచేసింది. మొత్తం పరిస్థితి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి ఒప్పందం కుదిరిందని భారత్ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. సైనిక దళాల ఉపసంహరణ అవగాహనను ఇరు పక్షాలు చిత్తశుద్ధితో అమలు చేస్తాయని తెలిపింది. పరిస్థితిని క్షీణింపచేసే చర్యను ఏ పక్షమూ చేపట్టబోదని, శాంతియుత, ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించడానికి ద్వైపాక్షిక ఒప్పందాలు, నిబంధనలు ప్రకారం ఇరు పక్షాలు వ్యవహరిస్తాయని కూడ పేర్కొంది.

**2.108** వాస్తవాధీన రేఖను గుర్తించడంలో స్పష్టత లేకపోవడం మూలంగానే ఇలాంటి వివాదాలు, ప్రతిష్టంభనలు ఏర్పడుతున్నాయి. భారత్, చైనాలు రెండూ వాస్తవాధీన రేఖను స్పష్టంగా గుర్తించుకోవాలని అంగీకరించడం సరిహద్దు వద్ద శాంతియుత వాతావరణం కొనసాగడానికి అవసరం.

**2.109** మన పార్టీకి వ్యతిరేకంగాను, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగాను 'చైనా అనుకూలురు' అనే మితవాద శక్తుల ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలి. ఇంతకు ముందు సోషల్ మీడియాలో ఇలాంటి ప్రచారం మార్పిడి చేసిన ఫొటోలతో, పచ్చి అబద్ధాలతో కూడిన తప్పుడు వార్త అని రుజువైంది.

## పెరుగుతున్న పోరాటాలు

**2.110** మన పార్టీ 22వ మహాసభ తర్వాత కాలంలో పెద్ద ఎత్తున సుసంఘటితమైన, స్పాంటేనియస్ ప్రజాపోరాటాలు పెరగడం అనేది చెప్పుకోదగ్గ విషయం. సిఎఎ–వ్యతిరేక పోరాటం, కిసాన్ ఉద్యమం, ట్రేడ్ యూనియన్ సమ్మెలు, పోరాటాలు మొదలైన వాటికి పార్టీ చురుకుగా మద్దతిచ్చింది, సంఘీభావం తెలిపింది. ఈ పోరాటాలన్నిటిలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిఎఎకు వ్యతిరేకంగా జరిగిన షహీన్‌బాగ్ పోరాటం వీటిలో చెప్పుకోదగ్గది.

**2.111 సిఎఎ – వ్యతిరేక పోరాటం:** సిఎఎ చట్టం చేసిన వెంటనే.. రాజ్యాంగంలో పౌరసత్వానికి ఇచ్చిన నిర్వచనాన్ని అతి ఘోరంగా ఉల్లంఘించిన ఈ చర్యకు వ్యతిరేకంగా స్పాంటేనియస్ పోరాటం ఉవ్వెత్తున లేచింది. ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఈ సిఎఎ తీసుకువచ్చారనీ, లౌకిక సూత్రాల పునాదినీ, మత సామరస్యాన్నీ దెబ్బతీయడానికి చట్టం చేశారనీ సరిగ్గానే భావించారు. ఈ పోరాటాల్లో యువత ముందుపీఠిన నిలబడ్డారు. హిందూత్వ మతతత్వ శక్తుల దాడులను వారు ముందుండి ప్రతిఘటించారు. హిందూత్వ మతతత్వ గూండాలు అనేక క్యాంపస్‌లలో హింసాకాండకు దిగి, భౌతికదాడులకు పాల్పడితే పోలీసులు అతి నగ్నంగా వారికి మద్దతుగా నిలబడ్డారు. ఈ పోరాటాల్లో ప్రజా ఉద్యమాలు, అనేక సెక్షన్లకు చెందిన మహిళలు, మేధావులు, ఎన్జీఓలు పాల్గొనడంతో ఇవి దేశవ్యాపితంగా విస్తరించాయి. పట్టువిడువకుండా సాగిన ఈ పోరాటం అంతటిలోకీ ఢిల్లీలోని షాహీన్ బాగ్‌లో సుదీర్ఘకాలం రాత్రింబవళ్లు సాగిన నిరసన కార్యక్రమం చెప్పుకోదగ్గది. దేశంలోని వందలాది ఇతర ప్రాంతాల్లో కూడా ఇటువంటి శాంతియుత నిరసన కార్యక్రమాలు జరిగాయి.

**2.112** కరోనా మహమ్మారి తలెత్తడం, 2020 మార్చిలో దేశవ్యాపిత లాక్‌డౌన్ విధించడంతో సిఎఎ–వ్యతిరేక ఉద్యమం ఆగిపోయింది. అయితే మోడీ ప్రభుత్వ హిందూత్వ మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా సాగిన తొలి ప్రజా ఉద్యమం ఇది.

**2.113 చారిత్రాత్మక కిసాన్ ఉద్యమం:** సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో ఏడాది పొడవునా జరిగిన చారిత్రక రైతాంగ ఉద్యమం విజయం సాధించింది. ఈ ఉద్యమం మోడీ ప్రభుత్వ మెడలు వంచి వ్యవసాయ చట్టాలను దానిచేత రద్దు చేయించింది. కార్పొరేట్లు తమ గరిష్టలాభాల కోసం వ్యవసాయ రంగంపై ఆధిపత్యం సాధించేందుకు పాలక వర్గాలు రూపొందించిన అభివృద్ధినిరోధక చట్టాలు ఇవి.

**2.114** 2020 నవంబర్ 16 నుండి లక్షల మంది రైతులు, స్త్రీలు, పురుషులూ ఢిల్లీ సరిహద్దుల్లోని రహదారులపై అయిదు చోట్ల ధర్నాలకు దిగారు. వారు పోలీసుల దమనకాండను ఎదిరించి ఢిల్లీ సరిహద్దులకు చేరుకున్నారు. విశేషమైన పద్ధతిలో జరిగిన ఈ పోరాటంలో లక్షలాది మంది రైతులు, ముఖ్యంగా పంజాబ్, హర్యానా, యుపి నుండి వచ్చి పాల్గొన్నారు. ఉత్తరాఖండ్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ నుండి కూడా రైతాంగం ఇందులో పాల్గొంది. ఇతర రాష్ట్రాల్లో కూడా పెద్ద ఎత్తున నిరసనలు, సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. ఈ పోరాటం ఏడాది పాటు సాగింది. పోరాటం సందర్భంగా తీవ్రమైన చలి, వ్యాధులు, ప్రమాదాల్లో 715 మంది రైతులు చనిపోయారు. ఈ కాలంలో 2020 డిసెంబర్ 8న, 2021 మార్చి 26న, 2021 సెప్టెంబర్ 27న మూడు దేశవ్యాపిత బంద్‌లు జరిగాయి. ఈ పోరాటం సందర్భంగా రైతు, కార్మిక సంయుక్త కార్యాచరణలు జరిగాయి. 2020 నవంబర్ 26వ తేదీన కేంద్ర ట్రేడ్ యూనియన్లు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన రోజునే రైతు సంఘాలు ఛలో ఢిల్లీకి తొలి సారి పిలుపునిచ్చాయి.

**2.115** ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు రైతాంగ ఉద్యమం నుండి వచ్చిన ఒత్తిడితో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసినప్పటికీ అన్ని పంటలకూ, రైతులందరికీ వర్తింపజేసే విధంగా కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలన్న కీలకమైన సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఒక కమిటీ ఈ అంశాన్ని పరిశీలిస్తుందని చెప్పారు గానీ ఇంతవరకు కమిటీనే వేయలేదు.

**2.116** జయప్రదంగా జరిగిన ఈ పోరాటం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, మెరుగైన జీవనం కోసం పోరాటాలు చేస్తున్న ఇతర

సెక్షన్ల ప్రజలకు స్ఫూర్తినిస్తుంది.

**2.117** **కార్మిక పోరాటాలు:** మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఇప్పటి వరకు ఉన్న కార్మిక చట్టాలన్నిటినీ రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చింది. సాధారణ బీమా రంగాన్ని ప్రయివేటీకరిస్తూ, రక్షణ రంగంలోనూ, రక్షణ ఉత్పత్తులు చేసే పరిశ్రమలన్నిటిలోనూ సమ్మెలను నిషేధిస్తూ చట్టం చేసింది. వాటితోపాటు దేశంలోని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల కింద ఉన్న ఆస్తులన్నిటినీ, ప్రాథమిక సదుపాయాలనూ, ఖనిజ వనరులనూ ప్రయివేటు వ్యక్తులకు దాదాపు ఉచితంగా కట్టబెట్టేందుకు ఎంతో తెలివిగా రూపొందించబడిన 'జాతీయ ఆస్తుల నగదీకరణ పైప్‌లైన్ (ఎన్ఎంపి)ను ప్రవేశపెట్టింది.

**2.118** కార్మికవర్గం దేశ వ్యాపితంగానూ, ఆయా రంగాల్లోనూ పోరాటాలు చేయడం ద్వారా ఈ విధానాలను నిరంతరాయంగా వ్యతిరేకిస్తున్నది. పార్టీ 22వ మహాసభ తర్వాత కార్మికవర్గం నిరంతరాయంగా పోరాట పంథాలో ఉన్నది. చివరికి కరోనా మహమ్మారి కాలంలోనూ, దాని వల్ల విధించబడిన లాక్‌డౌన్ కాలాల్లోనూ, అలాగే 2020 మార్చి నుండి అమలులో ఉన్న నిషేధాల కాలంలోనూ పోరాటాలు చేస్తూనే ఉన్నది.

**2.119** ఈ కాలంలో మూడు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలు జరిగాయి. 10 కేంద్ర ట్రేడ్ యూనియన్లు, దాదాపు అన్ని సెక్టార్లకు చెందిన స్వతంత్ర సమాఖ్యలూ సంయుక్తంగా 2019 జనవరి 8-9, 2020 జనవరి 8, 2020 నవంబర్ 26 తేదీల్లో ఈ దేశవ్యాపిత సమ్మెలు నిర్వహించాయి. నాలుగో సమ్మె 2022 మార్చి 28-29 తేదీల్లో జరిగింది.

**2.120** సార్వత్రిక సమ్మెలతో పాటు ఈ కాలంలో బొగ్గు, ఉక్కు, బ్యాంకు, బీమా రంగ ఉద్యోగులు, మెడికల్ రిప్రజంటేటివ్‌లు, టెలికమ్, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులు, ప్రయివేటు సంఘటిత రంగంలోని కార్మికులు సమ్మె పోరాటాలు చేశారు. కరోనా కాలంలో కూడా ఈ సమ్మె పోరాటాలు జరిగాయి. విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి చెందిన ఉక్కు కార్మికులు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నారు. వాళ్ల

ప్రజాభిప్రాయాన్ని ఎంతగా సమీకరించారంటే ఇప్పటివరకు ప్రయివేటీకరణకు అనుకూలంగా ఉన్న వామపక్షేతర పాలకవర్గ పార్టీలు కూడా వారి పోరాటానికి బహిరంగంగా మద్దతిచ్చాయి, ప్రయివేటీకరణను వ్యతిరేకించాయి.

**2.121** **కార్మిక, రైతాంగ సంయుక్త ఆందోళనలు:** ఈ కాలంలో కార్మిక, రైతాంగ ఉద్యమాలు దగ్గరవడం, సంయుక్త కార్యాచరణలు మరింత ఎక్కువగా జరగడం సంభవించింది. 2018 సెప్టెంబర్ 5న ఢిల్లీలో భారీ కార్మిక, కర్షక ప్రదర్శన జరిగింది. దీనిలో 2 లక్షల మంది వరకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. అంతకు ముందు 2018 ఆగస్టు 9న దేశవ్యాపితంగా పెద్ద ఎత్తున జరిగిన జైల్ భరో కార్యక్రమంలో 10 లక్షల మంది పాల్గొన్నారు.

**2.122** వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి, చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలి, విద్యుత్తు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి అన్ని నినాదాలను సంయుక్త ట్రేడ్ యూనియన్ వేదిక ఇవ్వగా, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి, ప్రయివేటీకరణను నిలిపివేయాలి అన్న నినాదాలతో సహా కార్మిక వర్గ నినాదాలను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఇచ్చింది. ఇది కార్మికులు, రైతాంగం మధ్య ఐక్యతను బలోపేతం చేసే వాతావరణాన్ని సృష్టించింది.

**2.123** **వర్గ పర్యవసానాలు :** ఈ పోరాటాల సందర్భంగా అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడితో మిలాఖత్ అయిన బడా బూర్జువా వర్గానికీ, కొన్ని సెక్షన్ల ధనిక రైతాంగంతో సహా మొత్తం రైంతాంగానికీ మధ్య కొత్త వర్గ ఘర్షణలు తలెత్తాయి.

**2.124** రెండోది, పాలక వర్గ భాగస్వాముల్లో కూడా ఒకవైపు బడా బూర్జువా వర్గానికీ, మరోవైపు బడా–యేతర బూర్జువా వర్గానికీ ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ) పరిశ్రమల రంగానికీ మధ్య కూడా ఘర్షణలు తలెత్తాయి.

**2.125** మూడోది, మన రాజ్యాంగపు ఫెడరల్ నిర్మాణాన్ని నాశనం చేసి దాని స్థానంలో ఏకీకృత ప్రభుత్వ నిర్మాణాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా దేశంలో పూర్తి రాజకీయ ఆధిపత్యం సాధించడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాల వల్ల కేంద్ర ప్రభుత్వానికీ, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకూ మధ్య ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తూ, పార్లమెంటులో బిజెపికి మద్దతుదారులుగా ఉన్న కొన్ని ప్రాంతీయ పార్టీలు, ఇప్పటి వరకు ఊగిసలాడుతూ, పార్లమెంటులో బిజెపికి మద్దతిచ్చే విషయంలో చాలావరకు తటస్థంగా ఉన్న పార్టీలు బిజెపి యొక్క ఈ ఆధిపత్య ధోరణులను వ్యతిరేకిస్తూ, ముఖ్యంగా రైతు పోరాటం సందర్భంగా ముందుకొచ్చాయి.

**2.126** పాలక వర్గ భాగస్వాముల మధ్య ఏర్పడుతున్న ఈ ఘర్షణలు కొన్ని అవకాశాలు కల్పిస్తాయి. వాటిని పీడిత వర్గాలు, ముఖ్యంగా కార్మికవర్గం, పేద రైతాంగం, వ్యవసాయ కార్మికవర్గం ఉపయోగించుకుని బూర్జువా–భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలి.

**2.127** కార్మికవర్గ ట్రేడ్ యూనియన్ ఉద్యమానికీ, రైతాంగం, వ్యవసాయ కార్మికవర్గానికీ మధ్య మరింత సమన్వయం పెరుగుతుండడంతో వర్గ పోరాటం మరింత ముందుకు పోయే అవకాశాలు ముందుకొచ్చాయి. ఇటువంటి పరిణామాలు చాలా ముందుగానే జరిగాయి. 2018లోనే ఈ సెక్షన్ల మధ్య ఉమ్మడి పోరాటాల ద్వారా గణనీయమైన పురోగమనం జరిగింది. పోరాటాల మధ్య పెరుగుతున్న ఈ ఐక్యతను రానున్న కాలంలో మరింత బలోపేతం చేయాలి.

## క్రోడీకరణ

**2.128** మొత్తాన్ని క్రోడీకరిస్తే, గత మహాసభ తరువాత జరిగిన కాలంలో బిజెపి తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది. ఫాసిస్టు లక్షణాలు గల ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి తన హిందుత్వ మతతత్వ ఎజెండాను మరింత దూకుడుగా అమలు చేస్తున్నది. అది నయా–ఉదారవాద

సంస్కరణలను మహోగ్రంగా అమలు చేస్తున్నది. నిరంకుశ పటిష్ట పరుస్తున్నది. రాజ్యాంగాన్నీ, రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేయబడిన సంస్థల స్వాతంత్ర్యాన్నీ ఒక పద్ధతి ప్రకారం వమ్ము చేస్తున్నది.

**2.129** అదే సమయంలో, కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో అవకతవకల వల్ల, ఆర్థిక విధానాల వల్ల పైనపడుతున్న ఈతిబాధల వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రక, విజయవంతమైన రైతాంగ పోరాటం, ప్రయివేటీకరణకూ, కార్మికచట్టాల రద్దుకూ వ్యతిరేకంగా కేంద్ర ట్రేడ్ యూనియన్లు చేసిన సంయుక్త పోరాటాలు, ట్రేడ్ యూనియన్లు, రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల మధ్య పెరుగుతున్న ఐక్యత... వీటిని మరింత బలోపేతం చేసి మొత్తం దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇవన్నీ వర్గ పోరాటం తీవ్రం కావడానికి దారితీయాలి.

**2.130** ఈ కాలంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం, భారత దేశ స్థాయిని అమెరికన్ సామ్రాజ్యవాదుల జూనియర్ భాగస్వామిగా మరింత గట్టిపరిచింది. అమెరికన్ సామ్రాజ్యవాదంతో అనేక సైనిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంది. గ్రూపులు కట్టింది. భారత ప్రజల్లో సామ్రాజ్యవాద-వ్యతిరేక చైతన్యాన్ని మన పార్టీ పెంచాలి.

## రాజకీయ పార్టీల పరిస్థితి

**2.131** **బిజెపి :** భారతీయ పాలక వర్గాల ప్రధాన రాజకీయ పార్టీగా బిజెపి ఎదిగింది. శీఘ్రంగా విస్తరిస్తున్న ఆర్‌ఎస్ఎస్ నెట్‌వర్క్ భుజాల మీద ఎక్కి అది దేశవ్యాపితంగా తన ప్రభావాన్ని పెంచుకుంది. దేశంలో ఆధిపత్య రాజకీయ పార్టీగా అది ముందుకొచ్చింది.

**2.132** బిజెపి 2019లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత నయా-ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తున్నది. కార్పొరేట్-మతతత్వ కూటమి బంధాన్ని బలపరుస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదులతో వ్యూహాత్మక, సైనిక సంబంధాలను బలపరుచుకోవడం ద్వారా జూనియర్

భాగస్వామి స్థాయిని మరింత పటిష్టం చేస్తున్నది. మత విభజనను మరింత శీఘ్రంగా సృష్టిస్తున్నది. నిరంకుశ మరింత పెంచడం ద్వారా ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నది.

**2.133** వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి బిజెపి పూర్తిగా ప్రజాస్వామ్య–వ్యతిరేక తప్పుడు పద్ధతులు అమలు చేస్తున్నది. ప్రతిపక్ష ఎంఎల్ఎలకు తొలుత డబ్బు ఆశ చూపించడం, దాంతోపాటు ఉన్నత పదవులిస్తామని ఊరించడం, రెండవది సిబిఐ–ఇడి ఇతర కేంద్ర సంస్థల ద్వారా వేధింపులకు గురిచేస్తామని బెదిరించడం, చివరిగా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి అరెస్టు చేయడం అనే త్రిముఖ పద్ధతులు అనుసరించడం ద్వారా వారి చేత ఫిరాయింపులు జరిపిస్తున్నది.

**2.134** ఇటీవల జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్‌లలో తన ప్రభుత్వాలను నిలబెట్టుకున్నది. ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి అంతకు ముందుకన్నా ఎక్కువ ఓట్లతో, తక్కువ సీట్లతో అధికారంలోకి రావడం ఆ పార్టీ పటిష్టమవడాన్ని సూచిస్తున్నది. ఇంతకు ముందు దఫా జరిగిన అనేక రాష్ట్రాల శాసన సభ ఎన్నికల్లో బిజెపి తన లక్ష్యాలు సాధించడంలో ఎదురుదెబ్బలు తిన్నది. జార్ఖండ్, మహరాష్ట్రల్లో అది ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేకపోయింది. కేరళలో అది తన ఒకే ఒక్క ఎంఎల్ఎను నిలుపుకోలేకపోయింది. పశ్చిమ బెంగాల్‌లో దాని ఎంఎల్ఎల సంఖ్య, ఓటింగు శాతం పెరిగినప్పటికీ అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా ప్రజలు దాన్ని తిరస్కరించారు. తమిళనాడులో తను పొత్తు పెట్టుకున్న అన్నా డిఎంకె ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలో ఉంచడానికి అది చేసిన ప్రయత్నాలు ఓడిపోయాయి. అస్సాంలో కేవలం కొద్దిపాటి, 0.86 శాతం ఓట్ల ఆధిక్యతతో అది ప్రభుత్వాన్ని నిలుపుకోగలిగింది.

**2.135** ప్రస్తుతం బిజెపి 12 రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్నది. మరో ఆరు రాష్ట్రాల్లో దాని సంకీర్ణ ప్రభుత్వాలు ఉన్నాయి. అది పార్లమెంటులోని రెండు సభల్లో ఆధిపత్యం కలిగి ఉంది.

**12.136 కాంగ్రెస్:** కాంగ్రెస్ పార్టీ భారత పాలక వర్గాలైన బడా బూర్జువా నేతృత్వంలోని బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది.

రాష్ట్రాల్లో అది ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న చోట నయా-ఉదారవాద విధానాలను అమలు చేయడం కొనసాగిస్తున్నది.

**2.137** దాని రాజకీయ పలుకుబడి, సంస్థాగత బలం తగ్గిపోతున్నది. వివిధ రాష్ట్రాల్లో ఆ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు బిజెపిలోకి ఫిరాయించడంతో ప్రస్తుతం అది ఒక సంక్షోభం తర్వాత మరో సంక్షోభం ఎదుర్కొంటున్నది. లౌకికతత్వం గురించి మాట్లాడుతున్నప్పటికీ హిందూత్వ శక్తులను అది సైద్ధాంతికంగా సమర్థవంతంగా సవాలు చేయలేకపోతున్నది. పైగా తరచూ రాజీ మార్గం అనుసరిస్తున్నది. బలహీనపడిన కాంగ్రెస్ లౌకిక ప్రతిపక్ష పార్టీలన్నిటినీ సమీకరించగల స్థితిలో లేదు.

**2.138** ఆర్ఎస్ఎస్‌తో మౌలికమైన సంబంధాలు కలిగి, అధికారంలో ఉన్న బిజెపి ప్రధాన ప్రమాదకారి అని 22వ మహాసభ రాజకీయ తీర్మానం పేర్కొంది (పేరా 2.89). అందువల్ల బిజెపి, కాంగ్రెస్ రెంటినీ సమానమైన ప్రమాదాలుగా పరిగణించకూడదు. అయితే, కాంగ్రెస్ పార్టీతో రాజకీయ పొత్తు ఉండబోదు.

**2.139** **ప్రాంతీయ పార్టీలు:** ప్రారంభంలో ప్రాంతీయ బూర్జువా-భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు ఛాంపియన్లుగా నిలబడిన ప్రాంతీయ పార్టీలు తర్వాతి కాలంలో చాలా వరకు నయా-ఉదారవాదాన్ని అక్కున చేర్చుకున్నాయి. స్థానికంగా తమ స్వంత ప్రయోజనాలను ప్రధానంగా పరిగణించిన ఈ పార్టీలు రాజకీయ అవకాశవాదాన్ని ప్రదర్శిస్తూ తరచూ రాజకీయ స్థానాలను మారుస్తూవచ్చాయి. అయితే, ఫెడరలిజంపై దాడులు పెరుగుతున్న కొద్దీ రాష్ట్ర ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న అనేక ప్రాంతీయ పార్టీలకు బిజెపితో ఘర్షణలు ముదురుతున్నాయి.

**2.140** తమిళనాడులో డిఎంకె నాయకత్వంలోని లౌకిక సంఘటన, బిజెపి-అన్నా డిఎంకె సంఘటనను ఓడించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీహార్‌లో ఆర్‌జెడి, ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీలు బిజెపికి వ్యతిరేకంగా నాయకత్వ పాత్ర వహిస్తున్నాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేనతో పొత్తుపెట్టుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయడం

ద్వారా ఆ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా ఎన్‌సిపి ముఖ్యపాత్ర నిర్వహించింది. కేరళ ఎల్‌డిఎఫ్‌లో ఎన్‌సిపి భాగస్వామిగా ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పంజాబ్‌లో విజయం సాధించి, రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో ఒక ప్రధాన ప్రాంతీయ పార్టీగా అవతరించింది. కొన్ని రాష్ట్రాల్లో చిన్న ప్రాంతీయ పార్టీలు సామాజిక పీడనకు వ్యతిరేకంగా నిలబడుతున్నాయి. తమిళనాడులో విసికె పార్టీ ఆ విధంగా బిజెపికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాతంత్ర విధానాన్ని చేపట్టింది.

**2.141** అదే సమయంలో, కొన్ని ప్రాంతీయ పార్టీలు బిజెపి బెదిరింపులకు, వేధింపులకు, బిజెపి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తుందనే భయాలకూ లోనవుతున్నాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్, బిజెడిలు పార్లమెంటులో పాలక పార్టీకి చాలా వరకు మద్దతిస్తున్నాయి. టిఆర్‌ఎస్ ప్రస్తుతం బిజెపికి వ్యతిరేకంగా కొన్ని విధానాలు చేపట్టింది. బిజెపికి సంప్రదాయ మిత్రులైన శివసేన, అకాలీదళ్‌లు ఆయా రాష్ట్రాల్లో సంభవించిన ఘర్షణల వల్ల బిజెపితో తెగతెంపులు చేసుకున్నాయి. జెడి(యు), ఎజిపి, ఎడిఎంకె పార్టీలు బిజెపితో పొత్తులో వున్నాయి. ఒకనాడు బిజెపి–నేతృత్వంలోని ఎన్డీయేలో భాగస్వామి అయిన టిఎంసి నేడు బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతోంది. అది తన సిపిఐ(ఎం) వ్యతిరేక, వామపక్ష వ్యతిరేకదాడులను కొనసాగిస్తూనే మరోవైపు జాతీయ స్థాయిలో బిజెపి–వ్యతిరేక శక్తులకు నాయకత్వం వహించాలని ఆశపడుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఒకనాటి పాలక పార్టీ అయిన టిడిపి చాలా వరకు బిజెపి వైపు మొగ్గు చూపుతోంది.

**2.142** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా లౌకికతత్వాన్ని కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు నిలబడినప్పుడు మనం వాటితో సహకరిస్తూనే మరోవైపు వాటితో ఎత్తుగడల రీత్యా వ్యవహరించేటప్పుడు ఆయా రాష్ట్రాల్లో అవి అనుసరిస్తున్న రాజకీయ వైఖరులను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

**2.143** ప్రాంతీయ పార్టీలు ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న రాష్ట్రాల్లో మనం వాటి విధానాలను వ్యతిరేకించేటప్పుడు ఆయా విధానాలకు

వ్యతిరేకంగా స్వతంత్రంగానూ, వామపక్ష పార్టీలతోను కలిసి ప్రజలను సమీకరించాలి. అయితే మనం ఈ ప్రభుత్వాలను బిజెపి నాయకత్వంలోని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో సమానంగా చూడరాదు.

**2.144** జమాతే – ఇస్లామ్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా వంటి ముస్లిమ్ తీవ్రవాద సంస్థలు, వాటి రాజకీయ ఫ్రంటులూ ఉన్నాయి. మైనారిటీలపై హిందూత్వ శక్తుల విషపు దాడుల నేపథ్యంలో వారిలో ఏర్పడిన పరాయీకరణ, అభద్రతా భావాలను ఇవి ఉపయోగించుకుంటున్నాయి. అయితే వాటి కార్యకలాపాలు హిందూత్వ మతతత్వ శక్తులకు మాత్రమే ఉపయోగపడతాయి. ప్రజాతంత్ర, లౌకిక శక్తులు మైనార్టీల హక్కుల కోసం పోరాడటం, లౌకిక వేదికలపై వారిని సమీకరించడం ఎంతో అవసరం.

**2.145** **వామపక్ష పార్టీలు:** జాతీయ స్థాయిలో అయిదు వామపక్ష పార్టీలు వివిధ సమస్యలపై కార్యాచరణలకు, పోరాటాలకు సంయుక్తంగా పిలుపునిస్తున్నాయి. కరోనా మహమ్మారి కారణంగా సమర్థవంతమైన కార్యాచరణ కార్యక్రమాలు, పెద్ద ఎత్తున జనసమీకరణలు సాధ్యం కాలేదు. వామపక్ష ప్రత్యామ్నాయంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలంటే వామపక్ష పార్టీల ఉమ్మడి కార్యాచరణ ముఖ్యం. వామపక్ష ఐక్యత బలపరచడానికి ఇటువంటి కృషి కొనసాగాలి. దీనికి కావలసిన చొరవను పార్టీ తీసుకోవాలి.

**2.146** బీహార్‌లో వామపక్షాలు ఎన్నికల్లో విజయాలు సాధించాయి. అయితే, వాటి మధ్య భిన్నమైన రాజకీయ వైఖరులున్నాయి. ఆర్ఎస్‌పి, ఎఐఎఫ్‌బిలు కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్‌తో, బెంగాల్‌లో వామపక్ష సంఘటనలో ఉన్నాయి. సిపిఐ (ఎంఎల్) బెంగాల్‌లో భిన్నమైన ఎన్నికల ఎత్తుగడలు అనుసరిస్తోంది. ఏమైనా, వామపక్ష ఐక్యతను బలపరచడం కోసం ఉమ్మడి అవగాహనకు రావడానికి కృషి జరగాలి.

**2.147** **సిపిఐ (ఎం):** బిజెపి ఆధిపత్య రాజకీయ పార్టీగా ఎదిగి, ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్ శీఘ్రంగా విస్తరిస్తున్న ఈ కాలంలో సిపిఐ(ఎం) పార్టీ స్వతంత్ర

బలం, రాజకీయంగా జోక్యం చేసుకునే సామర్థ్యం మరింత తగ్గిపోయింది.

**2.148** ఈ కాలంలో ఉమ్మడి పోరాటాలను బలపరచడంలో పార్టీ చురుకైన పాత్ర నిర్వహించింది. తొలుత సిఎఎ-ఎన్‌పిఆర్-ఎన్‌ఆర్‌సిని వ్యతిరేకించడంలో తర్వాత చారిత్రక, విజయవంతమైన రైతాంగ ఉద్యమానికి మద్దతివ్వడంలో పార్టీ చురుకుగా వ్యహరించింది. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగానూ, విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా మత విభజన పెంచడానికి జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగానూ, ప్రజల ప్రజాతంత్ర హక్కులు, పౌరహక్కుల రక్షణ కోసం, ట్రేడ్ యూనియన్లు, ఇతర ప్రజాసంఘాలు పిలుపునిచ్చిన వివిధ సమ్మెలు, నిరసన ప్రదర్శనలకు మద్దతుగానూ పార్టీ అనేక ఉద్యమాలు నడిపింది, ఆందోళనలు నిర్వహించింది. కరోనా విపత్తు సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందించడంలో పార్టీ చురుకుగా వుంది.

**2.149** సైద్ధాంతికంగా కమ్యూనిస్టు-వ్యతిరేకత జీర్ణించుకున్న ఆర్‌ఎస్‌ఎస్ - బిజెపిలు వామపక్షాలను ముఖ్యంగా సిపిఐ(ఎం)ను లక్ష్యంగా చేసుకున్నాయి. మన పార్టీ బలంగా ఉన్న పశ్చిమ బెంగాల్, త్రిపుర, కేరళలపై అవి కేంద్రీకరించి మన పార్టీ కార్యకర్తలపైనా, పార్టీ కార్యాలయాలపైనా దాడులకు తెగబడుతున్నాయి.

**2.150** **కేరళ:** కేరళలో మన పార్టీ కార్యకర్తలపై ఆర్‌ఎస్‌ఎస్ - బిజెపి దాడులు, హత్యలు కొనసాగుతున్నాయి. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి కేంద్ర సంస్థలను పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నది. ఈ ప్రయత్నాల్లో బిజెపికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని యుడిఎఫ్ మద్దతిస్తోంది. మన పార్టీ కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడుతూ, హత్యలు చేస్తున్నది.

**2.151** సిపిఐ(ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ 2021లో మరోసారి కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందింది. ఇది అపూర్వమైన విజయం. ఎందుకంటే గత నాలుగు దశాబ్దాలుగా కేరళ ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ

ప్రభుత్వాన్ని మూరుస్తూ వస్తున్నారు. గడచిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ పనితీరూ, ఈ విజయం మన పార్టీకి బలాన్నిచ్చింది, ప్రతిష్టపెంచింది.

**2.152** ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ మహత్తరమైన కృషి వల్ల ప్రజల జీవితాలకు సంబంధించిన అంశాల్లో గుణాత్మకమైన మార్పులు వచ్చాయి. గడచిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను సక్రమ రీతిలో అమలు పరిచింది. ప్రజల కేంద్రంగా అది అమలుపరిచిన ప్రత్యామ్నాయ విధానాలు, ఫెడరల్ వ్యవస్థలోని పరిమిత అవకాశాల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయగలదో చూపించింది. మతసామరస్యం ప్రాతిపదికపై అన్ని సెక్షన్ల ప్రజలకూ రక్షణ కల్పించింది. ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడే స్పష్టమైన రాజకీయ పంథా, బిజెపితో కుమ్మక్కవుతున్న యుడిఎఫ్ అవకాశవాద, మిలాఖత్ వైఖరిని ఎండగట్టడం 2021 శాసన సభ ఎన్నిల్లో అపూర్వమైన విజయానికి తోడ్పడ్డాయి.

**2.153** కేరళలో అనేక ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయం అందించడంలో పార్టీ, ఎల్‌డిఎఫ్ నిర్వహించిన పాత్ర పెద్ద ఎత్తున ప్రశంసలు అందుకున్నది. కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో కేరళ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ నిర్వహించిన పాత్రకు ప్రపంచం నలుమూలల నుండి ప్రశంసలు వచ్చాయి. ఆ తర్వాత వచ్చిన కోవిడ్ వెల్లువలను ప్రజాఆరోగ్య వ్యవస్థతో సమర్థవంతమైన టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీట్‌మెంట్ ద్వారా, స్థానిక సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా సమర్థవంతంగా పరిష్కరించడం జరిగింది.

**2.154** **పశ్చిమ బెంగాల్:** మన పార్టీ పశ్చిమ బెంగాల్‌లో బీభత్స, హింసాత్మక రాజకీయాలు అనుసరించే తృణమూల్ కాంగ్రెస్ ఫాసిస్టు తరహా దాడులవల్ల తీవ్రమైన అణచివేతను ఎదుర్కొంటున్నది. ఈ దాడులకు వ్యతిరేకంగా ప్రతిఘటన పెరుగుతున్నది. 2011, 2021 మధ్య మనం 229 మంది కార్యకర్తలను కోల్పోయాము. ఈ కాలంలో 1,02,000 మంది మన పార్టీ సభ్యులు, సానుభూతిపరులు తమ ఇళ్ల నుండి వెళ్లగొట్టబడ్డారు. పట్టణ ప్రాంతాల్లో వారి ఆలనాపాలనా పార్టీ చూడాల్సి వచ్చింది. మన పార్టీకి చెందిన 1,30,000 మంది సభ్యులు,

సానుభూతిపరులపై తప్పుడు కేసులు బనాయించారు. వారిపై వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డారు. వారు ఎంతో ధైర్యంతో ఈ అణచివేతను ఎదుర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర స్థాయిల్లో పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాల్లోకి పార్టీ, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాయి.

**2.155** పశ్చిమ బెంగాల్ శాసన సభ ఎన్నిల్లో పార్టీ ఓటమి విధ్వంసకరంగా పరిణమించింది. పార్టీ వరుసగా అనేక ఆత్మవిమర్శనాత్మక సమీక్షలు చేసి, గుణపాఠాలు తీసింది. వీటిని పార్టీ జీర్ణించుకుని చిత్తశుద్ధితో అమలుపరచాలి.

**2.156** **త్రిపుర:** రాష్ట్ర ప్రభుత్వ రక్షణతో బిజెపి చేస్తున్న ఫాసిస్టు తరహా దాడులను ఇక్కడ మన పార్టీ ఎదుర్కొంటున్నది. 22 మంది పార్టీ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. అంతకు ముందు మన పార్టీ చేసిన పోరాటాలు, ఉద్యమాలపైనా, ప్రజాసమస్యలపై ప్రజా సంఘాలు చేపట్టిన కార్యక్రమాలపైనా బిజెపి తీవ్రంగాదాడులకు దిగింది. 47 పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేసి తగులబెట్టింది. వందలాది మంది పార్టీ సభ్యులు, సానుభూతిపరుల ఇళ్లను, వాహనాలను, పుస్తకాలు, ఫర్నిచర్‌నూ ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో అనేక మంది కామ్రేడ్స్ గాయపడ్డారు. వారిలో కొందరు ఆసుపత్రుల పాలయ్యారు.

**2.157** బిజెపి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఫార్సుగా మారిపోయాయి. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ వేయనివ్వ లేదు, ఓటింగులో పాల్గొననివ్వలేదు. ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున హింసాకాండ జరిగింది. దాదాపు ఓటింగ్ అంతా రిగ్గింగు అయింది.

**2.158** గతంలో గిరిజన స్వయంపాలిత మండళ్ల ఎన్నికల్లోనూ, తర్వాత 334 స్థానిక సంస్థల వార్డులకు జరిగిన ఎన్నికల్లోనూ మన పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. ఒకవేళ ఎవరైనా వేసి ఉంటే వారిపై హింసాకాండకు పాల్పడి నామినేషన్లు ఉపసంహరించు కోవాల్సిందిగా బెదిరింపులకు దిగారు. బిజెపి 112 స్థానాల్లో పోటీలేకుండా గెలుపొందింది. మిగిలిన 222 స్థానాల్లో

అయిదు మినహా మిగిలిన అన్ని స్థానాల్లోనూ అది పెద్ద ఎత్తున రిగ్గింగుకు పాల్పడ్డం ద్వారా గెలుపొందింది. ఈ పరిస్థితుల్లో కూడా వామపక్ష సంఘటన 20 శాతం వరకు ఓట్లు గెలుచుకుంది.

### వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన

**2.159** వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటుకు పార్టీ ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. ఈ విషయాన్ని పార్టీ 21వ మహాసభ కింది విధంగా చెప్పింది :

"వివిధ వర్గ ప్రజాసంఘాలతో ఉమ్మడి డిమాండ్లపై ఒక ఉమ్మడి వేదిక నిర్మించడం ఈ దిశలో ఒక ముందడుగు. కార్మికులు, రైతాంగ ఉమ్మడి పోరాటాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. (21వ మహాసభ రాజకీయ తీర్మానం పేరా 2.87)

"ప్రస్తుత తరుణంలో వామపక్ష పార్టీలు, వాటి వర్గ, ప్రజా సంఘాలు, వామపక్ష గ్రూపులు, మేధావులు, వివిధ పార్టీల్లో చెదురుమదురుగా ఉన్న సోషలిస్టులు, లౌకిక బూర్జువా పార్టీల్లోని ప్రజాతంత్ర సెక్షన్లు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనారిటీలకు సంబంధించిన ప్రజాతంత్ర సంస్థలు, పీడిత ప్రజల సమస్యలు తీసుకుని పనిచేస్తున్న సామాజిక ఉద్యమాలు... ఇవి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన కేంద్రకాన్ని ఏర్పాటు చేయగల శక్తులుగా ఉన్నాయి. ఈ శక్తులన్నిటినీ, బూర్జువా – భూస్వామ్య పార్టీల విధానాలకు వ్యతిరేకమైన, నిర్దిష్టమైన కార్యక్రమం ఆధారంగా ఉన్న వేదిక మీదకు తీసుకురావడం ద్వారా మాత్రమే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఒక నిర్దిష్టమైన రూపాన్ని సంతరించుకుంటుంది." (పార్టీ 22వ మహాసభ రాజకీయ తీర్మానం పేరా 2.110)

**2.160** ఈ అవగాహనతోనే వామపక్ష ప్రజాసంఘాలతో కూడిన ఉమ్మడి వేదిక జన్ ఏక్తా జన్ అధికార్ ఆందోళన్ (జెఇజెఎఎ) ఏర్పాటు చేయడానికి కృషి చేయడం జరిగింది. అయితే వివిధ కారణాల వల్ల ఇది ప్రారంభం కాలేదు. సమర్థవంతమైన ఉమ్మడి వేదికల ఏర్పాటు కోసం కృషిని

కొనసాగించాలి.

**2.161** వర్గ, ప్రజా సంఘాల ఉమ్మడి పోరాటాలు నిర్వహించడం జరిగింది. ట్రేడ్ యూనిన్‌లు, రైతులు, వ్యవసాయ కార్మికుల పోరాటాల మధ్య మరింత పటిష్టమైన ఐక్యత ఏర్పడ్డం ఇందులో చెప్పుకోదగ్గ విషయం. పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభం నుండి ముందుకు వచ్చిన ఉమ్మడి డిమాండ్ల ఆధారంగా రైతు సంఘాల మధ్య విస్తృత ఐక్యత పెంపొందింది. అఖిల భారత కిసాన్ సంఘర్ష్ కో–ఆర్డినేషన్ కమిటీ (ఎఐకెఎస్‌సిసి) దేశవ్యాపిత ఆందోళన ప్రారంభించింది. దాదాపు 500 రైతు సంఘాలతో జాతీయ సదస్సు నిర్వహించింది. దాని నుండే సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఏర్పడింది. ఇదే చారిత్రక రైతు పోరాటాన్ని విజయం వైపు నడిపించింది.

**2.162** రైతు పోరాటం పట్ల వివిధ ఇతర ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమాలు, మేధావులు ప్రకటించిన సంఘీభావాన్ని మరింత పటిష్ట పరుచుకోవాలి. ప్రతి రాష్ట్రంలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలో భాగస్వామ్యం కాగల శక్తులను గుర్తించడం తగిన రీతిలో జరగలేదు. దీన్ని వెంటనే చేపట్టి తక్షణం పూర్తి చేయాలి. దీని ఆధారంగానే, బూర్జువా భూస్వామ్య విధానాలకు నిజమైన ప్రత్యామ్నాయంగా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన కార్యక్రమాన్ని ముందుకు తీసుకురావడానికి ఉద్యమాల్లో ఐక్యతను పటిష్ట పరచాలి.

## వామపక్ష, ప్రజాతంత్ర కార్యక్రమం

**2.163** బూర్జువా భూస్వామ్య విధానాలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమాన్ని ఈ కింది వాటి ఆధారంగా రూపొందించాలి:

ఎ) **ఆర్థిక స్వావలంబనను కాపాడటం:** ప్రభుత్వ రంగ సంస్థల, ప్రభుత్వ విభాగాల ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి. మంచినీరు, విద్యుత్తు, ప్రభుత్వ రవాణా, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక సర్వీసులు అందజేయాలి. జాతీయ నగదీకరణ పైప్‌లైన్‌నూ,

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేటైజేషన్‌లను రద్దు చేయాలి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయాలి. సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)లను ప్రోత్సహించాలి. అసంఘటిత రంగానికి రక్షణ కల్పించాలి. అతి సంపన్నులపై పన్నుల విధించాలి. సమతుల్య అభివృద్ధిని పునరుద్ధరించాలి. బాగా అవసరమైన మౌలిక సదుపాయాలు నిర్మించడానికీ, ఉద్యోగాలు కల్పించడానికీ, దేశీయ గిరాకీని పెంచడానికీ ప్రభుత్వ పెట్టుబడుల పెంచాలి. భూ సంస్కరణలు అమలు చేయాలి. సహకార వ్యవసాయం, ఉత్పత్తి, మార్కెటింగ్‌లను అభివృద్ధి చేయాలి. భారత దేశ ఆహార భద్రతను పెంచాలి.

బి) **భారత రాజ్యాంగ పరిరక్షణ,** భారత గణతంత్ర రాజ్య లౌకిక ప్రజాతంత్ర లక్షణాన్ని కాపాడాలి. రాజ్యాంగ వ్యవస్థ యొక్క మూల స్తంభాలను పటిష్టపరచడానికి ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయాలి. లౌకికతత్వం యొక్క మౌలిక సూత్రం, అంటే మతాన్ని రాజ్యం నుండి రాజకీయాల నుండి వేరుగా ఉంచడం అనేదాన్ని రాజ్యాంగ సూత్రంగా ప్రకటించాలి. మతపరమైన విభజన కోసం విద్వేష ప్రచారాలు చేయడాన్నీ, హింసాకాండ రెచ్చగొట్టడాన్నీ నిషేధించాలి. మతపరమైన మైనారిటీల జీవితాలకూ, స్వేచ్ఛలకూ, మతపరమైన హక్కులకూ రక్షణ కల్పించాలి. వ్యవస్థ నుండి, ప్రభుత్వ సంస్థల నుండీ పచ్చి మతోన్మాద శక్తులను ఏరిపారేయాలి. అన్ని రకాల ప్రయివేటు సైన్యాలనూ, నిఘా గ్రూపులనూ రద్దు చేయాలి. మనుషులను కొట్టి చంపే కిరాతక చర్యలకు వ్యతిరేకంగా చట్టం చేయాలి. అస్సాంలో ఎన్ఆర్‌సి అప్‌గ్రేడ్‌ను మినహాయించి, సిఎఎ–ఎన్‌పిఆర్, ఎన్ఆర్‌సి లను రద్దు చేయాలి.

సి) రాజ్యాంగం గ్యారంటీ చేసిన **ప్రజాతంత్ర హక్కులను, పౌర హక్కులను రక్షించడం.** తీవ్రంగా దుర్వినియోగ మవుతున్న ప్రస్తుత రూపంలోని యుఎపిఎ (ఉపా) చట్టాన్ని రద్దు చేయాలి. దేశ ద్రోహ చట్టాన్ని, ఎఎఫ్ఎస్‌పిఎ, జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) లను

రద్దు చేయాలి. మరణ శిక్షను రద్దు చేయాలి. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయాలి. పాక్షిక లిస్టు పద్ధతితో కూడిన దామాషా ప్రాతినిథ్య పద్ధతిని ప్రవేశ పెట్టడంతో సహా ఎన్నికల సంస్కరణలను అమలు చేయాలి. సామాజిక ఆడిటింగ్, జవాబుదారీ తనాన్ని చట్టబద్ధం చేయాలి. సమాచార హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి.

డి) **ఫెడరలిజం:** రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కల్పించే విధంగా కేంద్ర రాష్ట్ర సంబంధాలను పునర్వ్యస్థీకరించాలి. కేంద్ర సర్ ఛార్జీలనూ, సెస్‌లనూ పంచడం ద్వారా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన పన్నేతర ఆదాయాన్ని పంపిణి చేసే పూల్‌లో భాగం చేయడం ద్వారా ద్రవ్య ఫెడరలిజాన్ని పటిష్ట పరచాలి. అంతర్రాష్ట్ర మండలినీ, ప్రణాళికా సంఘాన్ని, జాతీయ అభివృద్ధి మండలిని పునరుద్ధరించాలి. గవర్నర్ల వ్యవస్థపై పునః పరిశీలన చేయాలి. 356వ అధికరణాన్ని తొలగించి దాని స్థానంలో తగిన రక్షణలు ప్రవేశపెట్టాలి. జమ్మూ–కాశ్మీర్ స్వయం ప్రతిపత్తితో సహా దానికి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి. 370,35ఎ అధికరణాలను రద్దు చేయడాన్ని వెనక్కు తీసుకోవాలి.

ఇ) **కార్మికవర్గం, రైతాంగం:** నైపుణ్యం లేని కార్మికునికి వినియోగదారుల ధరల సూచీతో లింక్ చేసే విధంగా నెలకు రూ. 26,000 తగ్గకుండా కనీస వేతనం ఇచ్చేట్లు చట్టం చేయాలి. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం 1979ని పునరుద్ధరించి అందరు వలస కార్మికులకు వర్తించే విధంగా విస్తరించి బలోపేతం చేయాలి. రహస్య బ్యాలెట్ ద్వారా ట్రేడ్ యూనియన్‌లను గుర్తించే పద్ధతి ఉండాలి. కార్మికులకు సామాజిక భద్రత, యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించేందుకు గ్యారంటీ ఇవ్వాలి. సి2+50 శాతం ఫార్ములా ఆధారంగా అన్ని పంటలకూ, అందరు రైతులకూ చట్టబద్ధంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఇవ్వడాన్ని న్యాయబద్ధం చేయాలి. రైతులకు కేంద్ర ప్రభుత్వం రుణ మాఫీ చేయాలి. వ్యవసాయ కార్మికులకు వేతనాలు, సామాజిక భద్రత కోసం కేంద్రం చట్టం చేయాలి.

ఎఫ్) **సామాజిక న్యాయం:** కుల వ్యవస్థనూ, అన్ని రకాల కుల అణచివేతలనూ రద్దు చేయాలి. ఎస్సీ, ఎస్టీలకు మౌలిక మానవ హక్కులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఎస్సీలకు ప్రత్యేక కాంపొనెంట్ ప్రణాళిక కోసం కేంద్ర స్థాయిలో చట్టం చేయాలి, ఎస్టీలకు సబ్–ప్లాన్ అమలు చేయడం, సాధికార కమిటీ దాని అమలు పర్యవేక్షించడం, అటవీ భూములపై ఆదివాసీ హక్కులు, వారి జీవనోపాధి, సంస్కృతి రక్షణ కోసం రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన నిబంధనలు తయారు చేయడం, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేయడం, రిజర్వు కేటగిరీలోని బ్యాక్‌లాగ్ పోస్టులన్నిటినీ భర్తీ చేయడం, మనుషులచేత దొడ్లను శుభ్రం చేసే విధానం రద్దును కచ్చితంగా అమలు పరచడం, అంటరానితనాన్ని పాటించేవారికి కఠినమైన శిక్షలు విధించడం, అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయడం, ఇతర వెనుక బడిన తరగతుల (ఓబిసి) జనాభా తెలుసుకునేందుకు కుల గణన అమలు చేయడం జరగాలి.

**మహిళలు :** మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేయాలి. మహిళలకు సమాన హక్కులు, వేతనాలు ఇవ్వడం, మహిళలు, పిల్లలపై భయంకరంగా పెరుగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా కఠినమైన చర్యలు తీసుకోవడం, ఇటువంటి వాటిని నివారించడానికీ, అరికట్టడానికీ, నేరస్తులను కఠినంగా శిక్షించడానికీ గట్టి చర్యలు తీసుకోవడం, కుల దురహంకార నేరాలను నిషేధిస్తూ చట్టం చేయడం జరగాలి.

**పిల్లలు :** సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్)ను పిల్లలందరికీ వర్తించేట్లు సార్వత్రికం చేయాలి. విద్యా హక్కు చట్టాన్ని గట్టిగా అమలు చేయాలి. అన్ని రూపాల బాలకార్మిక వ్యవస్థలను రద్దు చేయాలి. పిల్లల అమ్మకానికి వ్యతిరేకంగా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి.

**ఎల్‌జిబిటి :** ట్రాన్స్ జెండర్ పౌరుల హక్కులను రక్షించాలి, అభివృద్ధి చేయాలి. ఎల్‌జిబిటి పౌరులపై నేరాలు, వేధింపులను నివారించేందుకు న్యాయపరమైన చర్యలతో సహా కఠినమైన చర్యలు తీసుకోవాలి.

**వికలాంగులు :** వికలాంగుల చట్టం కిందకు, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం కిందకు వచ్చే వ్యక్తుల హక్కులను గట్టిగా రక్షించడం కోసం బడ్జెట్‌లో సరిపడినన్ని నిధులు కేటాయించాలి. జాతీయ వికలాంగుల విధానాన్ని పునర్వ్యస్థీకరించాలి. వికలాంగ వ్యక్తుల హక్కులపై ఐక్యరాజ్య సమితి సదస్సు సిఫార్సులకు అనుగుణంగా ఇతర చట్టాలను మార్పు చేయాలి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి. ప్రాథమిక సదుపాయాలు, రవాణా, ఐటితో సంబంధిత సర్వీసులు వారికి అందుబాటులో ఉండే విధంగా నిర్మించాలి.

**జి) ప్రజా సంక్షేమం**

1) **ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయాలి:** అన్ని రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి. అందరికీ పెన్షన్ సదుపాయం అందించాలి. పట్టణ, గ్రామీణ పేదలకు సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, గృహ వసతి కల్పించాలి.

2) **ఉపాధి :** ఉపాధి హామీ చట్టం కింద పనులను విస్తృతపరచడం, కింద వేతనాలు పెంచడం, పట్టణ ఉపాధి గ్యారంటీ పథాన్ని ప్రవేశపెట్టడం, నిరుద్యోగ భృతిని ఇవ్వడం జరగాలి.

3) **నూతన విద్యా విధాన్ని రద్దు చేయాలి:** రాజ్యాంగ విలువలను పటిష్టపరిచే విధంగా, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా పాఠ్యాంశాలు, కరికులమ్ పునర్వ్యస్థీకరణ చేయాలి. ప్రయివేటు విద్యా సంస్థలను నియంత్రించాలి. విద్యకు కేంద్రం నిధుల

కేటాయింపును జిడిపిలో 6 శాతానికి పెంచాలి. విద్యలో డిజిటల్ అసమానతలు రూపుమాపాలి. ఫ్రీ సాఫ్ట్‌వేర్‌ను ప్రోత్సహించాలి.

4) ప్రభుత్వ నిధులతో **సార్వత్రిక ప్రభుత్వ ఆరోగ్య రక్షణ వ్యవస్థ:** ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర నిధులను జిడిపిలో కనీసం 5 శాతానికి పెంచాలి. అత్యవసర ఔషధాల ధరల తగ్గించాలి. ప్రయివేటు ఆరోగ్య సదుపాయాలను నియంత్రించాలి.

**5) పర్యావరణం:** నియంత్రణ వ్యవస్థతో విషవాయువుల ఉద్గారాలను తగ్గించడం ద్వారా వాతావరణాన్ని పరిరక్షించాలి. పునరుత్పాదక ఇంధనానికి ప్రోత్సాహం ఇవ్వాలి. అందరికీ ఇంధన సమానత్వం అందేట్లు చూడాలి. అడవులు, చిత్తడి నేలలను రక్షించాలి. కాలుష్యాన్ని నివారించాలి, ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

**6) సంస్కృతి, మీడియా:** మతతత్వ, మూఢత్వ ప్రభావాలను తగ్గించేందుకుగాను ప్రజల సమస్యలపై కేంద్రీకరించడం ద్వారా లౌకిక, ప్రజాతంత్ర సంస్కృతిని అభివృద్ధి చేయాలి. జానపద కళలతో సహా భిన్న సంస్కృతులను, సంప్రదాయాలను ప్రోత్సహించాలి. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొనబడిన అన్ని భాషలనూ సమానంగా ప్రోత్సహించి, అభివృద్ధి చేయాలి. సాంస్కృతిక రంగ వ్యక్తులపైనా, కళారూపాలపైనా దాడులు చేసే మతతత్వ శక్తులపై కఠినంగా వ్యవహరించాలి.

**పత్రికా స్వేచ్ఛను కాపాడాలి:** ప్రభుత్వరంగ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసులను బలోపేతం చేయాలి. మీడియా గుత్తాధిపత్యాన్ని నిరోధించాలి, ఆ రంగంలో క్రాస్ ఓనర్‌షిప్‌ను నిషేధించడం, మీడియాకు స్వతంత్ర రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయడం, మీడియా వ్యక్తులకు రక్షణ, భద్రత కల్పించడం జరగాలి.

**7) విదేశాంగ విధానం:** భారత దేశం కచ్చితమైన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అమలు చేయాలి. అమెరికన్ సామ్రాజ్యవాద జూనియర్

భాగస్వామిగా భారత్‌కు ప్రస్తుతం ఉన్న స్థాయిని తిరగదోడాలి. అన్ని వ్యూహాత్మక, రక్షణ ఒప్పందాలను సమీక్షించాలి. అమెరికా యొక్క వ్యూహాత్మక ప్రయోజనాలను, సంబంధాలను ముందుకు తీసుకుపోయే అంతర్జాతీయ, ప్రాంతీయ కూటముల నుండి తప్పుకోవాలి.

## పార్టీని బలోపేతం చేయడం

**2.164** పశ్చిమ బెంగాల్‌లో మన ప్రజా పునాది బాగా క్షీణించింది. త్రిపురలో కూడా క్షీణిస్తున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మనకు ఎన్నటికన్నా అతి తక్కువ ఓట్లు వచ్చాయి. పార్టీ స్వతంత్ర బలాన్ని, ప్రభావాన్ని పటిష్టపరుచుకోవలసిన అవసరాన్ని మనం పార్టీ 16వ మహాసభ నాటి నుండి గుర్తిస్తున్నాం.

**2.165** పార్టీ 17వ మహా రాజకీయ తీర్మానం ఈ విధంగా పేర్కొంది :

"మన భవిష్యత్ దిశను ఖరారు చేసే క్రమంలో మనం ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశం, పార్టీ స్వతంత్ర పాత్ర, ప్రభావాలను ఎలా పటిష్టపర్చుకోవాలి అన్నదే. చాలా కాలం గడిచినప్పటికీ మనం ఈ విషయంలో పెద్దగా పురోగతి సాధించలేదని అంగీకరించాలి. (2.80)

**2.166** ఇతర అంశాలతో పాటు, మన పార్టీ స్వతంత్ర బలాన్ని, రాజకీయంగా జోక్యం చేసుకోగలిగే సామర్థ్యాన్నీ పెంచుకోవడం అనేది మౌలికమైన సమస్య అని పార్టీ 22వ మహా సభ తర్వాత జరిగిన ఎన్నికల సమీక్ష నొక్కి చెప్పింది. ఇది అత్యవసరం. ఈ విషయంలో గతంలో పార్టీ అనేక సార్లు అనేక రాజకీయ, సంస్థాగత నిర్ణయాలు చేసింది. వీటిని పార్టీ జీర్ణించుకుని సరైన రీతిలో తక్షణం అమలు చేయాలి.

**2.167** ఈ క్షీణతను నిరోధించి, తిరిగి పురోగమన పట్టాలు ఎక్కించడం అత్యవసరం. ఈ పని చేయకుండా మనం మన విప్లవ కర్తవ్యాలను సాధించే దిశగా ముందుకు సాగలేం. మనం ఈ కింది వాటిని ప్రధానంగా చేపట్టాలి.

ఎ) రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత పనిని తక్షణం పటిష్టపరచాలి. ప్రజలతో సజీవమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోడానికి అన్ని వైపుల నుండి, కేంద్రీకరించి పనిచేయాలి. స్థిరమైన వర్గ, ప్రజా పోరాటాలను అభివృద్ధి చేయాలి. మన రాజకీయ ప్రభావం పెంపొందించేందుకుగాను వీటిని సమీకృతం చేసుకోవాలి. సాహిత్య ఉత్సవాలు నిర్వహించడం, గ్రంథాలయాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పడం చేయాలి.

బి) ప్రజలకు సంబంధించిన సమస్యలను చేపట్టి క్షేత్రస్థాయిలో పోరాటాలను పటిష్టపరచడం మీద కేంద్రీకరించాలి. ఇటువంటి పోరాటాలు మొక్కుబడిగా ఉండరాదు, ప్రత్యక్షంగా విజయాలు సాధించే వరకు కొనసాగించాలి.

సి) కోవిడ్ మహమ్మారి, దాని వల్ల వచ్చిన లాక్‌డౌన్‌లు మిలిటెంట్ ప్రజా పోరాటాల అభివృద్ధికి సహజంగానే అడ్డంకిగా నిలిచాయి. ప్రజల జీవనోపాధికి సంబంధించిన అనేక రకాల సమస్యలపై ప్రజా పోరాటాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం ద్వారా ఈ అడ్డంకులను అధిగమించాలి.

డి) హిందూత్వ మతోన్మాద శక్తులు విసిరే సవాళ్లను పార్టీ సైద్ధాంతికంగా, రాజకీయంగా, సంస్థాగతంగా తీవ్రంగా ఎదుర్కోవాలి. మనం విచ్ఛిన్నకర మతతత్వ ఎజెండాకు వ్యతిరేకంగా, లౌకిక విలువల విధ్వంసానికి వ్యతిరేకంగా ఎదురుదాడి చేయాలి. మైనారిటీ మతాలకు చెందిన వారిని రక్షించే విషయంలో మనం ఛాంపియన్లుగా నిలవాలి. మనం హిందూత్వ జాతీయవాదాన్ని భారతీయ జాతీయవాదంతో ఎదుర్కోవడం ద్వారా కలుపుకుపోయే (ఇన్‌క్లూజివ్) భారత దేశం అనే చైతన్యాన్ని పటిష్టపరచాలి.

ఇ) సామాజిక వివక్ష, కుల పీడన, జెండర్ వివక్షలకు సంబంధించిన సమస్యలపై పార్టీ పోరాటాలు నిర్వహించాలి. సామాజిక పీడనకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా

జరిగే పోరాటాలతో మిళితం చేయాలి. వర్గ ఐక్యతను చెదరగొట్టేందుకు ప్రయత్నించే అస్థిత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలి.

ఎఫ్) నిర్మాణంపై జరిగిన కొల్‌కొత్తా ప్లీనం నిర్ణయాలను తక్షణం సరైన రీతిలో అమలు చేయాలి. ప్లీనం మార్గదర్శకాల ప్రకారం పార్టీ సంస్థలను దారిలో పెట్టాలి.

## హిందూత్వను ఎదుర్కొనే మార్గం

**2.168** హిందూత్వ మతోన్మాద శక్తులను వేరుచేయాలంటే ముందుగా పార్టీని బలోపేతం గావించడం మౌలికావసరం. హిందూత్వనూ, దాని బహుముఖమైన మతతత్వ సంస్థలనూ ఎదుర్కోవడం అంటే వాటిని రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో స్థిరమైన రీతిలో ఎదుర్కోవడం అని అర్థం. హిందూత్వ మతతత్వ ఎజెండాకు వ్యతిరేకంగా ఈ పోరాటాన్ని బలపరచడం కోసం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలి.

**2.169** ఈ క్రింది చర్యలు చేపట్టడం ద్వారా పార్టీ, ప్రజాసంఘాలు ఈ సుస్థిరమైన పోరాటాన్ని నిర్వహించాలి.

అ) పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రూపులు నిరంతరాయంగా సైద్ధాంతిక, రాజకీయ ప్రచార సామగ్రిని తయారు చేస్తుండాలి. ఈ ప్రచార సామగ్రి ప్రజలకు అర్థమయ్యే రీతిలో, విస్తారమైన ప్రజలకు చేరే రీతిలో ఉండాలి. అది హిందూత్వ, మతతత్వ శక్తుల అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ఎండగట్టేట్టు ఉండాలి.

ఆ) విద్వేషం, ఉగ్రవాద విషప్రచారం సాగిస్తూ, ముఖ్యంగా మతపరమైన మైనారిటీలపై ఫాసిస్టు తరహా దాడులు సాగిస్తున్న హిందూత్వ గ్రూపుల ఎదురుదాడిని చురుకుగా ఎదుర్కొనేట్లుండాలి. సూక్ష్మ, స్థూల స్థాయిల్లో సామాజిక వాతావరణాన్ని మతతత్వ పూరితం గావించే ప్రయత్నాలను ప్రతిఘటించే విషయంలో చాలా

అప్రమత్తంగా వ్యవహరించాలి.

ఇ) పెరుగుతున్న మౌఢ్యం, మూఢనమ్మకాలు, అహేతుకత, గుడ్డి నమ్మకాలను ఎదుర్కొనేందుకు సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించే సంస్థలను ప్రోత్సహించాలి. హేతువాద దృక్పథం ఆధారంగా లౌకిక, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాలి. అహేతుకతనూ, అశాస్త్రీయతనూ వ్యాపింప జేస్తున్న హిందూత్వ మూకలను ఎదుర్కోడానికి ఈ పని చేయడం అవసరం.

ఈ) సామాజిక పీడనకు వ్యతిరేకంగా సమస్యలపై పోరాడ్డంలో ఛాంపియన్లుగా నిలవాలి. హిందూత్వ, మహిళలకు సమాన హక్కులను నిరాకరిస్తుంది. మహిళలు అణిగిమణిగి ఉండాలని చెప్పడం ద్వారా అది స్త్రీలపై విషపు దాడులకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తుంది.

ఉ) దళితులు, ఆదివాసీల్లో వినాశకరమైన హిందూత్వ కులతత్వ, మూఢ భావాల వ్యాప్తిని ఎదుర్కోవాలి. భారతీయ సమాజంలోని మిశ్రమ సంస్కృతిని హైలైట్ చేస్తూ సాంస్కృతిక కార్యకలాపాల నిర్వహణపై ప్రత్యేకంగా కేంద్రీకరించాలి.

ఊ) సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలి. కరోనా మహమ్మారి సందర్భంగా చేసిన కృషిని ఆరోగ్య కేంద్రాల ద్వారా కొనసాగించాలి. లైబ్రరీలు, రీడింగ్ రూమ్‌లు, విద్యాపరమైన కోచింగ్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు మొదలైన వాటిని ఏర్పాటు చేసే కార్యకలాపాలను చేపట్టాలి.

ఎ) విద్యా రంగంలో ఆర్ఎస్ఎస్, హిందూత్వ మతోన్మాద శక్తులు చాలా చురుకుగా ఉన్నాయి. లౌకిక, ప్రజాతంత్ర, బహుళత్వంతో కూడిన విషయాన్ని సృష్టించి, ప్రచారం చేయడం ద్వారా విద్యారంగంలో జోక్యం చేసుకోడానికి, శాస్త్ర జిజ్ఞాసను పెంపొందించడానికి మనం చొరవ తీసుకోవాలి.

**2.170** ఇటువంటి కార్యక్రమాలు లేనందున ఆర్ఎస్ఎస్, బిజెపిలు తమ "హిందూ అస్తిత్వ" భావజాలాన్ని సామాజిక, తెగలపరమైన అడ్డంకులను అధిగమించి అన్ని సెక్షన్ల ప్రజల్లో చొప్పించడంలో జయప్రదం అవుతున్నాయి. అహేతుకతను హేతు దృక్పథంతోనూ, అశాస్త్రీయతను శాస్త్రీయ దృక్పథంతోనూ ఎదుర్కోవడం అన్నిటికన్నా ముఖ్యమైన అంశం.

## రాజకీయ పంథా

**2.171** 1) సుమారు ఎనిమిది సంవత్సరాల బిజెపి ప్రభుత్వ హయాంలో మతతత్వ, కార్పొరేట్ బంధం పటిష్టపడి నిరంకుశ దాడులు పెరిగాయి. 2019లో తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అది ఫాసిస్టు తరహా ఆర్ఎస్ఎస్‌కు చెందిన హిందూ రాష్ట్ర ఎజెండాను మరింత దూకుడుగా ముందుకు తీసుకుపోతున్నది. దీంతోపాటు అంతే దూకుడుగా నయా-ఉదారవాద విధానాలను అమలుపరుస్తున్నది, నిరంకుశ పాలన సాగిస్తున్నది. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సాగుతున్న హిందూత్వ రాష్ట్ర ఎజెండా రాజ్యాంగ చట్రాన్ని ప్రమాదకరంగా డొల్లబారుస్తున్నది, భారత రిపబ్లిక్కుకు చెందిన లౌకిక, ప్రజాతంత్ర లక్షణాన్ని నాశనం చేస్తున్నది.

2) అందువల్ల మన ప్రధాన కర్తవ్యం బిజెపిని వేరుపరిచి, ఓడించడం. ఈ పని చేయాలంటే ప్రజలను వర్గ, ప్రజాసంఘాల్లోకి శక్తివంతమైన, మిలిటెంట్ పద్ధతిలో సమీకరించడం కోసం సిపిఐ(ఎం), వామపక్ష శక్తుల స్వతంత్ర బలం పెరగాలి.

3) హిందూత్వ మతోన్మాద ఎజెండాకు, మతతత్వ శక్తుల కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాటం నడపడానికి కూడా పార్టీ, వామపక్ష శక్తుల బలం పెరగడం అవసరం. హిందూత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని లౌకిక శక్తులను అత్యంత విస్తృతంగా సమీకరించాలి.

4) దూకుడుగా అమలు చేస్తున్న నయా–ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగానూ, జాతీయ వనరుల లూటీకి వ్యతిరేకంగానూ, ప్రభుత్వ రంగాన్ని, ప్రజోపయోగ సర్వీసులను, ఖనిజ సంపదనూ ప్రయివేటీకరించడానికి వ్యతిరేకంగానూ విస్తారమైన సెక్షన్ల ప్రజలను సమకరించడంలో పార్టీ ముందుండాలి. ఇటీవల జరిగిన రైతాంగ పోరాటం మాదిరిగా వర్గ, ప్రజా పోరాటాలను తీవ్రతరం చేయడం ద్వారానే ప్రజలను విస్తారంగా సమీకరించడం, కార్పొరేట్ మతతత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లౌకిక ప్రతిపక్ష పార్టీలను కదిలించడం చేయగలుగుతాము.

5) హిందూత్వ – కార్పొరేట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం విజయంవంతం కావాలంటే హిందూత్వ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగానూ, నయా–ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగానూ ఏక కాలంలో పోరాడ్డం అవసరం.

6) అంగీకృత సమస్యలపై పార్లమెంటులో లౌకిక ప్రతిపక్ష పార్టీలతో పార్టీ సహకరిస్తుంది. పార్లమెంటు బయట మతతత్వ ఎజెండాకు వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నిటినీ సమీకరించడానికి పార్టీ కృషి చేస్తుంది. పార్టీ స్వతంత్రంగానూ, ఇతర ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఐక్యంగానూ నయా–ఉదారవాద దాడులకు వ్యతిరేకంగానూ, ప్రజాస్వామ్యంపైనా, ప్రజాస్వామ్య హక్కులపైనా జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగానూ, నిరంకుశ చట్టాలను ఉపయోగించుకుని అసమ్మతిని అణచివేసే చర్యలకు వ్యతిరేకంగానూ ఆయా సమస్యల ప్రాతిపధికపై పోరాడుతుంది

.

7) వర్గ, ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణల కోసం ఉమ్మడి వేదికల ఏర్పాటుకు పార్టీ మద్దతిస్తుంది. కార్మిక రైతాంగ వ్యసాయ కార్మిక ఐక్య పోరాటాలను బలోపేతం చేసే అన్ని రకాల చర్యలకూ పార్టీ మద్దతిస్తుంది.

8) వామపక్ష ఐక్యతను బలపరచడంతోపాటే పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడం ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలి. వామపక్ష ఐక్య

ఉద్యమాలు, ఆందోళనలు.. బూర్జువా భూస్వామ్య పాలక వర్గాల విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను హైలైట్ చేయాలి.

9) ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమాలతో సహా వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నిటినీ సమీకరించేందుకు పార్టీ నిరంతరాయంగా కృషి చేయాలి. వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమమే ప్రత్యామ్నాయ విధానాలుగా హైలైట్ చేస్తూ వామపక్ష ప్రజాతంత్ర వేదిక సంయుక్త ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహించాలి.

10) ఎన్నికలు ఎప్పుడు వస్తే అప్పుడు బిజెపి–వ్యతిరేక ఓటు ఒకచోట చేరే విధంగా పైన చెప్పిన రాజకీయ పంథాకు లోబడి ఎన్నికల ఎత్తుగడలు అమలుపరచడం జరుగుతుంది.

## ప్రస్తుత పరిస్థితుల్లో కర్తవ్యాలు

**2.172** ఎ) పార్టీ నిరంతర వర్గ, ప్రజా పోరాటాల ద్వారా తన స్వతంత్ర పాత్రను బలపరుచుకోవడానికీ, తన ప్రభావాన్ని, రాజకీయంగా జోక్యం చేసుకునే సామర్థ్యాన్ని విస్తరించడానికీ ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజా సమస్యలపై స్థానిక పోరాటాలను పెంపొందించడంపైనా, దానికి సరైన ఫాలో–అప్ చేసేదానిపైనా ప్రత్యేకంగా కేంద్రీకరించాలి.

బి) నయా–ఉదారవాద విధానాలద్వారా తీవ్రమైన ఆర్థిక దోపిడీకి గురవుతున్న అన్ని సెక్షన్లను ఏకం చేసి జీవనోపాధి సమస్యలపై పోరాటాల్లోకి దించాలి. స్పాంటేనియస్‌గా తలెత్తే అన్ని పోరాటాల్లో పార్టీ చురుకుగా జోక్యం చేసుకుని వాటిని బలోపేతం చేయాలి.

సి) హిందుత్వ మతతత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పార్టీ ముందు పీఠిన ఉండాలి. ఈ పోరాటాన్ని వివిధ స్థాయిల్లో స్థిరంగా కొనసాగించాలి. హిందుత్వ మతోన్మాద శక్తుల కార్యాకలాపాలను ఎదుర్కొనేందుకు లౌకిక ప్రజాతంత్ర శక్తులను – అందుకు సంబంధించిన పౌరులు, సంస్థలు, సామాజిక ఉద్యమాలతో సహా

సాధ్యమైనంత విస్తృత స్థాయి ఐక్యతను నిర్మించాలి.

డి) నిరంకుశ చర్యలను వ్యతిరేకించడంలో పార్టీ నాయకత్వ పాత్ర వహించాలి. మానవ హక్కులను, పౌర హక్కులను, ప్రజాతంత్ర హక్కులను, కళాకారుల స్వేచ్ఛను, అకడమిక్ స్వయంప్రతిపత్తిని రక్షించేందుకు జరిగే ఉమ్మడి పోరాటాలకు అన్ని రకాల ప్రజాతంత్ర శక్తుల సహకారం తీసుకోవాలి. అలాగే హిందూత్వ మతతత్వానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ వ్యవస్థకు చెందిన ప్రజాతంత్ర, లౌకిక సారాన్ని ధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు కూడా వారి మద్దతు సమీకరించాలి.

ఇ) సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాలను ముందుకు తీసుకుపోయే కృషిని పార్టీ మరింత పటిష్టం చేయాలి. మహిళలు, దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న సామాజిక పీడనకు వ్యతిరేకంగా సమస్యలను చేపట్టడంలో పార్టీ ఛాంపియన్‌గా నిలవాలి.

ఎఫ్) హిందూత్వ మతతత్వ దాడుల నుండి మైనారిటీల హక్కులను, భద్రతను రక్షించే కృషిని పటిష్టపరచాలి.

జి) మౌఢ్యం, మూఢనమ్మకాలు, అహేతుకత, గుడ్డినమ్మకాల పెరుగుదలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, సామాజిక పోరాటాలను పార్టీ బలోపేతం చేయాలి. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ప్రజల్లో అహేతుకత, అశాస్త్రీయతలకు వ్యతిరేకంగా శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించే క్యాంపెయిన్లలో పార్టీ ముందుపీఠన నిలబడాలి. శాస్త్రీయ దృక్పథాన్ని రక్షించడం కోసం, పునరుద్ధరణవాద ప్రయత్నాలకు వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువగా ప్రజాసమీకరణ జరపాలి.

హెచ్) మన జాతీయ, ఆర్థిక స్వావలంబనను కాపాడ్డం కోసం పార్టీ భారత ప్రజల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని రేకెత్తించాలి. పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిజం ఒక్కటే నిజమైన ప్రత్యామ్నాయం అన్న ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలి.

ఐ) మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోవడానికి వ్యతిరేకంగా పార్టీ ప్రజాభిప్రాయాన్ని మలచాలి. భారత దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తిరిగి ప్రతిష్టించడం కోసం పోరాటాలు చేయాలి.

జె) కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని రక్షించుకోడానికి, దాని ప్రజానుకూల విధానాలను కాపాడుకునేందుకు పార్టీ కృషి చేయాలి, పార్టీపైన ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో జరుగుతున్న ఫాసిస్టు తరహా దాడులకు వ్యతిరేకంగా నిరసనలను బలోపేతం చేయాలి.

## ముగింపు

2.173 ఈ కర్తవ్యాలు నిర్వహించాలంటే దేశవ్యాపితంగా బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించడం అవసరం. నిర్మాణంపై కోల్‌కతా ప్లీనం చేసిన నిర్ణయాలను అమలుపరచడం ద్వారా మాత్రమే, మార్క్సిజం, లెనినిజంపై ఆధారపడి దేశవ్యాపితంగా ప్రజా పునాది కలిగిన బలమైన పార్టీని నిర్మించగలం. ముఖ్యంగా ఈ క్రిందివాటిపై కేంద్రీకరించాలి.

1) ప్రజలతో బలమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోడానికి ప్రజాపంథాగల విప్లవ పార్టీని బలోపేతం చేయడం.

2) ప్రజల్లో పార్టీ సంబంధాలను, ప్రభావాన్ని విస్తరించడం. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సమీకరించడం.

3) కోల్‌కతా ప్లీనం ఆదేశించినట్లు నాణ్యత గల సభ్యులతో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం.

4) పార్టీలోకి యువతనూ, మహిళలనూ ఆకర్షించేందుకు కేంద్రీకరించడం.

5) అన్ని రకాల అన్యవర్గ భావజాలాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని బలోపేతం చేయడం.

బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించేందుకు మన దీక్షను ద్విగుణీకృతం చేద్దాం!

ప్రజాపంథాతో కూడిన విప్లవ పార్టీ నిర్మాణం వైపు పురోగమిద్దాం!

అఖిల భారత ప్రజాపునాది గల బలమైన సిపిఐ(ఎం)ను నిర్మించేవైపు పురోగమిద్దాం!


ప్రతులు : 2000

ప్రచురణ కాలం : మే, 2022

వెల : ₹. 25/-

153220

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866 2577202, 9490099057